బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు:140

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



నేటినుంచి ఖమ్మంలో సిపిఐ రాష్ట్రసమితి సమావేశాలు 3లో

సంపుటి 07, సంచిక: 207 | శుక్రవారం | 28-06-2024 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

## వారం రోజులు మోస్తరు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాగల వారం రోజుల పాటు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. పలు జిల్లాల్లో భారీ వర్షాలతో పాటు ఉపరితల గాలులు వీస్తాయన్నారు. గురువారం నుంచి శుక్రవారం వరకు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో బలమైన తరువాయి 8లో

# పేపర్ లీకేజీపై దర్యాప్తు



'ఎమర్జెన్సీ' రాజ్యాంగంపై అతిపెద్ద దాడి

భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా చేయడమే లక్ష్యం

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాం

సుస్థిరతకు ప్రజలు పట్టం కట్టారు : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ లాంటి విషయాల్లో దర్యాప్తు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, రాజ్యాంగంపై జరిగిన అతిపెద్ద దాడి 'ఎమర్జెన్సీ' అంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగంపై అదో మచ్చలా మిగిలిపోయిందన్నారు. గురువారం కొత్తగా కొలువుదీరిన 18వ లోక్‌సభతో పాటు రాజ్యసభ సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడారు. మూడోసారి అధికారాన్ని చేపట్టిన మోదీ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దేశంలో 1975లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉండగా విధించిన ఎమర్జెన్సీపై వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగంపై జరిగిన అతిపెద్ద దాడి ఎమర్జెన్సీ కాలాన్ని ఆమె అభివర్ణించారు. భారత రాజ్యాంగంపై అదో మచ్చలా మిగిలిపోయిందన్నారు. ఎమర్జెన్సీ విషయంలో బీజేపీ, విపక్షాల మధ్య కొన్నిరోజులుగా వాగ్వాదం జరుగుతున్న క్రమంలో బుధవారం లోక్‌సభలో స్పీకర్ ఓంబిర్లా చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. మళ్లీ ఇప్పుడు రాష్ట్రపతి కూడా ఎమర్జెన్సీపై వ్యాఖ్యలు చేయడంతో విపక్షాలను ఆగ్రహానికి గురిచేసింది. ముర్ము తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో భారత్ తరువాయి 2లో

# ఫిరాయింపులకు కెసిఆర్ పునాది



ప్రభుత్వం కూలిపోతుందనే బిఆర్‌ఎస్ మాటలకు బిజెపి వంతపాడింది

రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పని చేస్తాం

ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధుల పార్టీ ఫిరాయింపులకు పునాది వేసిందే బిఆర్‌ఎస్ అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విమర్శించారు. గతంలో 61 మంది ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలను బిఆర్‌ఎస్‌లోకి కెసిఆర్ లాక్కున్నారని, ఫిరాయింపులను ప్రోత్సహించినందుకు కెసిఆర్ ముక్కు నేలకు రాయాలని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే కూలిపోతుందని మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు అన్నారని, వారి మాటలకు అప్పట్లో బిజెపి వంతపాడిందని సిఎం గుర్తు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి గురువారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రభుత్వాన్ని కూలగొడతామని బిఆర్‌ఎస్, బిజెపి రంకెలేశాయన్న రేవంత్‌రెడ్డి, అలాంటి మాటలు మాట్లాడుతుంటే గాలికి వదిలేయాలా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలనుకోవడమే కెసిఆర్ భావదారిద్ర్యమని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఓటింగ్ శాతం 16 శాతానికి తగ్గిందని, కెసిఆర్‌కు ఇప్పటికీ కనువిప్పు కలగలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకే ఎంపి ఎన్నికల్లో బిజెపిని కెసిఆర్ గెలిపించారని ఆరోపించచారు. బిఆర్‌ఎస్ కంచుకోటగా చెప్పుకునే మెదక్‌లో ఆ పార్టీ మూడో స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాన్ని పడగొట్టాలనే ఆలోచనలు మానుకోవాలని సిఎం హితవు పలికారు. కెసిఆర్‌ను గద్దె దింపాలన్న తన జీవిత లక్ష్యం నెరవేరిందని, గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో ధ్వంసమైన తెలంగాణ రాష్ట్రాన్ని పునర్ నిర్మించడమే తన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పని చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బడ్జెట్ దృష్ట్యా నిధుల కోసం కేంద్ర మంత్రులను కలుస్తున్నామని, త్వరలో ప్రధాని, మరింత మంది కేంద్ర మంత్రులను కలుస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో కెసిఆర్ పూర్తిగా చేతులెత్తేశారని, ఆ కారణంగానే బిజెపి బలం పెరిగిందన్నారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ పూర్తిగా ధ్వంసమైందని విమర్శించారు. పార్లమెంట్ తరువాయి 2లో



## విద్యుత్ రంగంలో అవకతవకలపై జ్యుడీషియల్ విచారణ చేస్తే తప్పేముంది

కెసిఆర్‌కు హైకోర్టు ప్రశ్న

ప్రజాపక్షం / హైదరాబాద్

విద్యుత్ రంగంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ ఎంక్వాయిరీ చేస్తే తప్పేముందని తెలంగాణ హైకోర్టు మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావును ప్రశ్నించింది. పవర్ కమిషన్ తదుపరి విచారణను వాయిదా వేయడానికి నిరాకరించింది. కమిషన్ ఈ నెల 19న ఇచ్చిన నోటీసు ప్రకారం జూన్ 27వ తేదీలోగా కెసిఆర్ ఆ కమిషన్ ముందు హాజరు తరువాయి 8లో



## రాష్ట్రపతి ప్రసంగం అబద్ధాల పుట్ట

ప్రభుత్వ ఇచ్చిన స్క్రిప్ట్ అని ప్రతిపక్షాలు విమర్శ

**న్యూఢిల్లీ :** పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగం 'ప్రభుత్వం ఇచ్చిన స్క్రిప్ట్' అని ప్రతిపక్ష నాయకులు కొట్టిపారేశారు. అది అబద్ధాల పుట్ట అని మండిపడ్డారు. 1975 ఎమర్జెన్సీ గురించి పదేపదే ప్రస్తావించడంపై ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని, మోదీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగంపై తరువాయి 2లో

# ఇందిరమ్మ రాజ్యస్థాపనే ధ్యేయం

అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం

ఆగస్టుకు ముందే రుణమాఫీ

మిషన్ భగీరథ పేరుతో బిఆర్‌ఎస్ వేలకోట్లు దండుకుంది

రూ.128.48 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన భట్టి

హాజరైన మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, పొంగులేటి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

ప్రజా ఆకాంక్షలు, కోర్కెల మేరకు అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపించడమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖమంత్రి మల్లు భటి విక్రమార్క అన్నారు. గురువారం కొత్తగూడెం నియోజకవర్గ కేంద్రంలో రూ.128.48 కోట్ల అభివృద్ధి పనులకు భట్టి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పోస్టాఫీస్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో భట్టి మాట్లాడారు. అమృత్ పథకంలో భాగంగా రూ.124.48 కోట్ల మంచినీటి పథకం రూ.4 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల పనుల భూమి పూజ పూర్తయ్యిందని, త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గడిచిన పదేళ్లలో ప్రజలు పెద్ద ఎత్తున దగా పడ్డారని, కానీ ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.
ఎన్నికల సమయంలో ఏవైతే హామీలను ఇచ్చామో వాటిని తూచా తప్పకుండా పాటిస్తామని, ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే ఐదు గ్యారెంటీలు అమలవుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రుణ మాఫీ చేయదని, రైతు భరోసా ఇవ్వదని కొందరు పనిగట్టుకుని ప్రజలకు మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు. ఆగస్టు 15 నాటికి రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని, ఆరునూరైనా ఆగస్టు కంటే ముందే రుణమాఫీని అమలు చేసి తీరుతామన్నారు. విధి విధానాలు ఖరారైన మరుక్షణమే రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రభుత్వమని, ఇది కేవలం ప్రజల కోసమే పనిచేస్తుందని తెలిపారు. రూ.125 కోట్లతో అమృత్ పథకం కొత్తగూడెంలో అవసరం ఉందంటే గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన భగీరథ పేరుతో ఏం చేసిందన్నారు. కేసిఆర్ రూ.42000 కోట్లను ఖర్చుపెట్టిన చూపించి వేల కోట్లు దండుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో నీటి యద్దడి ఉందని, భువనగిరి, ఆలేరు, భద్రాద్రి కొత్తగూడెం లాంటి ప్రాంతాల్లో నీరు లేక ప్రజలు అల్లాడి పోతున్నారని, మొన్నటికి మొన్న తరువాయి 2లో

### పారిశ్రామిక పురోభివృద్ధికి తోడ్పాటివ్వండి

ఎమ్మెల్యే కూనంనేని



భద్రాద్రి కొత్తగూడెం ఎంతో చైతన్య వంతమైన జిల్లా అని, ఈ జిల్లాని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేసి సహకరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. గత పాలకుల చేతిలో ఘోరంగా దెబ్బతిన్న ప్రజలు ఎన్నో ఆశలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏరికోరి తెచ్చుకున్నారని, ఈ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు కోర్కెల మేరకు పనిచేయాలని కోరారు. జిల్లా అన్ని రంగాల్లో పూర్తిగా అభివృద్ధి పథంలో నడవాలంటే ప్రభుత్వం చొరవ తరువాయి 2లో

## నీలం విజయకుమార్ మృతి



**అనంతపురం :** కమ్యూనిస్టు యోధ నీలం రాజశేఖరరెడ్డి కుమారుడు డాక్టర్ నీలం విజయకుమార్(79) గురువారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు. విజయకుమార్ అనంతపురంలో కంటి వైద్యునిగా మంచి గుర్తింపు పొందారు. వయసు రీత్యా ఇంటికే పరిమితమయ్యారు. ఈ నెల 16వతేదీన ఉదయం వాకింగ్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడి తలకు బలమైన దెబ్బ తగలడంతో వెంటనే సమీపంలోని సవేరా ఆసుపత్రికి తరలించారు. పది రోజుల చికిత్స అనంతరం ఆరోగ్యం కుదుట పడటంతో డిశ్చార్జ్ అయ్యారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా గురువారం సాయంత్రం గుండె పోటుతో మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు.

**నారాయణ, రామకృష్ణ సంతాపం**

డాక్టర్ నీలం విజయకుమార్ మృతిపట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. 'సిపిఐ అగ్ర నాయకులు నీలం రాజశేఖరరెడ్డి పెద్ద కుమారుడైన డాక్టర్ నీలం విజయకుమార్ మరణం బాధాకరం. అనంతపురంలో నేత్రవైద్యులుగా ఉంటూ సిపిఐ బలోపేతానికి సహకరించారు. డాక్టర్ విజయకుమార్ హైదరాబాద్‌లో నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు సహాయ సహకారాలందించడమేగాక, రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు.



## సింగరేణిని ప్రైవేటీకరించేందుకే బొగ్గు గనుల వేలం

ప్రజాపక్షం/హైదరాబాద్

సింగరేణిని ప్రైవేటీకరించేందుకే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ బొగ్గు గనులను వేలం వేసిందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు విమర్శించారు. సింగరేణి సంస్థను కాపాడుకునే అంశంలో కార్మికలుకు బిఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. సింగరేణి ప్రాంతానికి చెందిన మాజీ ఎంఎల్‌ఎలు, ఆ ప్రాంత బిఆర్‌ఎస్ నాయకులు, బొగ్గు గని కార్మిక సంఘం నాయకులతో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్ తరువాయి 8లో



## భారత్ హిందూ రాజ్యం కాదు

తేల్చిన ఎన్నికల ఫలితాలు: అమర్త్యసేన్

**కోల్‌కత:** భారత్ హిందూ రాష్ట్రం కాదన్న వాస్తవాన్ని ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు నిరూపించాయని నోబెల్ అవార్డు గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త సేన్ వెల్లడించారు. విచారణ లేకుండా ప్రజలను జైళ్లలో ఉంచడం బ్రిటిష్ పాలన నుంచి దేశంలో కొనసాగడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో భారత్ హిందూ రాష్ట్రం తరువాయి 8లో



## పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి దామోదర రాజ నర్సింహ్మా

ప్రజాపక్షం/హైదరాబాద్

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా అన్నారు. ఇందుకు అన్ని జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను అందించే చర్యలు తీసుకోవాలని జిల్లాల వైద్యాధికారులు(డిఎంహెచ్‌ఒ)లను ఆయన ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో అన్ని జిల్లాల డిఎంహెచ్‌ఒలతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజ నర్సింహా తరువాయి 2లో

# స్ఫూర్తి ప్రదాత రామోజీ

ప్రజాసేవకు పదవులక్కరలేదని నిరూపించిన గొప్ప వ్యక్తి

అమరావతిలో ఆయన పేరుతో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు

ఎన్‌టిఆర్, రామోజీలకు భారతరత్న కోసం కృషి

సంస్మరణ సభలో ఎపి సిఎం చంద్రబాబు

రాజధానిలో రామోజీ విగ్రహం ఏర్పాటు: పవన్



**అమరావతి:** రామోజీరావు భావితరాలకు స్ఫూర్తి ప్రధాత అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయవాడ నగర శివారులోని అనుమోలు గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత రామోజీరావు సంస్మరణ సభకు సీఎం చంద్రబాబు కుటుంబసభ్యులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు పాత్రికేయ, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రామోజీరావు వ్యక్తికాదు... ఓ వ్యవస్థ అన్నారు. ఆయన ఏ పనిచేసినా ప్రజాహితం కోరుకునేవారు. నీతి, నిజాయతీకి ప్రతిరూపం రామోజీరావు. మారుమూల గ్రామంలో పుట్టి పట్టుదలతో అత్యున్నత స్థాయికి ఎదిగారు. ఎంచుకున్న ప్రతి రంగంలో నంబర్‌వన్‌గా ఎదిగారు. పత్రికారంగంలో ఉండి నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేశారు. రామోజీరావు నిరంతరం విలువల కోసం బ్రతికారు. ప్రజల కోసం పోరాటం చేశారు. నవ్యాంధ్రకు ఏ పేరు పెట్టాలా అని ఆలోచిస్తున్న సమయంలో పరిశోధన చేసి 'అమరావతి' పేరు సూచించారు. ఐదేళ్ల పాటు ఇబ్బందులు ఎదుర్కొన్నా... ఇక నుంచి అమరావతి దశ, దిశ మారుతుంది. తెలుగుజాతి ఉజ్వల భవిష్యత్తుకు అమరావతి నాంది పలుకుతుంది. తెలుగు భాష, తెలుగు జాతి అంటే ఆయనకు తరువాయి 2లో

# బొలీవియాలో సైనిక తిరుగుబాటుయత్నం






బొలీవియాలో సైనిక తిగుబాటు ప్రయత్నం జరిగింది. అయితే, ఈ ప్రయత్నాన్ని భద్రతా దళాలు సమర్థంగా అడ్డుకున్నాయి. ఇటీవల తొలగించిన ఆర్మీ కమాండర్ జనరల్ జువాన్ జోస్ జునిగా ఈ తిరుగుబాటుకు ప్రయత్నించినట్టు అనుమానిస్తున్నారు. అతనిని భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నాయి. కాగా, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొట్టి, సైనిక పాలనకు తెరతీయాలని కొంత మంది ప్రయత్నిస్తున్నారని బొలీవియా అధ్యక్షుడు లూయిస్ ఆర్స్ ఆరోపించారు. ఈ తిరుగుబాటును అణచివేసిన తర్వాత అతను రాజధాని లా పాజ్‌లోని తన అధికార నివాసం గ్రేట్ హౌస్ ఆఫ్ పీస్ నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడానికి వీధుల్లోకి వచ్చి యుద్ధాలు చేయాలని పిలుపునిచ్చారు. తమ వామపక్ష ప్రభుత్వాన్ని కొంత మంది మితవాదులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. సైన్యం దేశంలో ఒకభాగంగా ఉం దాలని, సైన్యమే దేశం కాకూడదని ఆయన వ్యా ఖ్యానించారు. లా పాజ్‌కే తలమానికంగా ఉన్న తుఫాను ప్యాలెస్‌ను సైనికులు స్వాధీనం చేసుకున్నారన్న వార్తలను కూడా ఆయన ప్రస్తావించారు. ఇలాంటి కుట్రలను తిప్పికొట్టే సామర్థ్యం తమ ప్రభుత్వానికి ఉందని ఆర్స్ ధీమా వ్యక్తం చేశారు. తిరోగమన రాజకీయ శక్తులకుపరాజయం, పతనంతప్పవని ఆయన అన్నారు.'లాంగ్‌లివ్ బొలీవియా... లాంగ్ లివ్ బొలీవియన్స్'అంటూ ప్రజలకు అభివాదం చేశా రు. ప్రజాస్వామ్యాన్ని ఉల్లంఘించ్డానికి, ప్రజలను భయపెట్టడానికి తాము సాయుధ బలగాలను ఎన్నడూ అనుమతించబోమని స్పష్టం చేశారు. ఇలావుంటే, ఈ తిరుగుబాటు వెనుక అమెరికా ప్రోత్సాహంఉండవచ్చని బొలీవియా స్వదేశీ సంతతికి చెందినమొదటి అధ్యక్షుడు మోరేల్స్ అన్నారు. అమెరికా మద్దతుతో జరిగిన తిరుగుబాటు కారణంగా అతను దేశం నుంచి పారిపోవాల్సి వచ్చింది. అయితే, అధ్యక్షుడిగా ఆర్స్ ఎన్నికైన తర్వాత తిరిగి బొలీవియా చేరుకున్న మోరేల్స్, తనకు ఎదురైన అనుభవాన్ని ఒక ప్రకటనలో వివరించారు. ఇలా వుంటే, పొరుగున ఉన్న పరాగ్వే, వెనెజులా తదితర దేశాలు ఈ సైనిక తిరుగుబా టు ప్రయత్నాన్ని ఖం డించారు. వెనెజులా అధ్య క్షుడు నికొలస్ మదురో తన ప్రకటనలో బొలీవియా ప్రజ లు ఎన్నుకున్న ప్రభుత్వా న్ని కూలదోయడానికి జరిగిన కుట్రను ఖండించారు.

ప్రపంచం



ఎర్ర సముద్రం మార్గాన నౌకలను నడపడం ప్రమాదకరంగా మారింది. సోమాలియా తదితర దేశాలకు చెందిన సముద్రపు దొంగలు తరచు దాడులు చేసి, కొల్లగొడుతున్న సంఘటనలు కోకొల్లలు. రవాణా (కార్గో) నౌకలపైన కూడా దాడులు జరుగుతునే ఉన్నాయి. తాజాగా యెమెన్‌లోని అల్‌హొదైడా రేవు పట్టణానికి సమీపంలో శఓ కార్గోషిప్‌పై దాడి జరిగింది. యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, అమెరికా, బ్రిటన్ తదితర దేశాల అధికారుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా, గత ఏడాది నవంబర్ నుంచి ఇప్పటి వరకూ హౌతీ మిలిటెంట్లు 60కి పైగా నౌకలపై దాడులు చేశారు. తుపాకులు, డ్రోన్లతో విరుచుకుపడ్డారు. ఒక నౌకను స్వాధీనం చేసుకోగా, రెంటిని సముద్రంలో ముంచేశారు. నలుగురు సెయిలర్లు మృతి చెందారు. ఈ ఏడాది మే 30 తర్వాత ఇజ్రాయిల్ భూభాగంపై జరిపిన దాడుల్లో 16 మంది మృతి చెందగా 42 మంది గాయపడ్డారు. గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులకు ప్రతీకారంగా హౌతీ తిరుగుబాటుదారులు కూడా దాడులకు తెగబడుతున్నారు.



ఒకటి కంటే ఎక్కువ వార్‌హెడ్స్‌ను తీసుకెళ్లే సామర్థ్యం ఉన్న అత్యంత శక్తివంతమైన క్షిపణిని విజయవంతంగా ప్రయోగించినట్టు ఉత్తర కొరియా గురువారం అధికారికంగా ప్రకటించింది. ఇటీవల అమెరికా, దక్షిణ కొరియా దేశాలు సైనిక విన్యాసాలు జరిపిన నేపథ్యంలో, ఆయుధ సంపదను మరింతగా పెంచుకోవాలని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ నిర్ణయించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే, ఎక్కడికైనా సులభంగా తరలించడానికి వీలున్న మిసైల్ ప్రయోగం జరిపినట్టు ఉత్తర కొరియా అధికారులు ప్రకటించారు. నిర్ణీత లక్ష్యాన్ని ఈ క్షిపణి ఛేదించిందని, ఆ దృశ్యాలను రాడార్ ద్వారా తిలకించి, ధ్రువీకరించు కున్నామని వివరించారు. పొరుగు దేశం నుంచి వచ్చే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటామని, పరోక్షంగా దక్షిణ కొరియాకు హెచ్చరికలు జారీ చేశారు.కాగా, ఉత్తరకొరియా క్షిపణి ప్రయోగం విఫలమైనందని దక్షిణకొరియా తెలిపింది. ఈ వైఫల్యాన్ని కప్పిపు చ్చు కోవడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నదంటూ విమర్శించింది. అమె రికా సైతం ఉత్తర కొరియా ప్రయోగం విఫలమైందని ఒక ప్రకటనలో తెలిపింది.

# నేనూ బాధితురాలినే..

## లైంగిక వేధింపులపై యుఎస్ హౌస్ కమిటీ ముందు పారిస్ హిల్టన్ సాక్ష్యం



వాషింగ్టన్ డిసి: తాను కూడా లైంగిక వేధింపులకు గురయ్యానని ప్రముఖ సామాజిక కార్యకర్త, మీడియా పర్సనాలిటీ, నటి, మోడల్, గాయని, వ్యాపారవేత్త పారిస్ విట్నీ హిల్టన్ ప్రకటించింది. అమెరికాలో ప్రస్తుతం నెలకొన్న సోషలైట్ జీవనంలో యువతకు మెరుగైన రక్షణ అవసరాన్ని వివరించేందుకు హౌస్ కమిటీ ముందు హాజరైన హిల్టన్ సాక్ష్యాన్ని నమోదు చేశారు. తాను యుక్త వయసులో ఉన్నప్పుడు, బలవంతంగా మందులు తినిపించారని, పలువురి నుంచి లైంగిక వేదింపులకు గురయ్యానని కాంగ్రెస్ ప్యానెల్‌కు చెప్పారు. తనపై పలుమార్లు దౌర్జన్యాలు జరిగాయని, తాను హింసకు గురయ్యానని 43 ఏళ్ల హిల్టన్ చెప్పారు. వివస్త్రను చేసి, ఏకాంతమైన చోట నిర్బంధించారని కూడా ఆమె తెప్పారు. తన మాదిరిగా హింసకు, అనాదరణకు, అత్యాచారాలకు గురైన టీనేజర్లకు తిరిగి మంచి భవిష్యత్తును అందించేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలను కూడా ఆమె ప్రతిపాదించారు. సుమారు 50 బిలియన్ డాలర్ల ఖర్చుతో, బాధితులకు చికిత్స అందించాలని, అదే విధంగా బోర్డింగ్ పాఠశాలలను నెలకొల్పాలని పేర్కొన్నారు. సైనిక శైలిలో బూట్ క్యాంపులు నిర్వహించడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుందని చెప్పారు. బాలల కోసం ప్రత్యేక న్యాయస్థానాలు అవసరమని హిల్టన్ అభిప్రాయపడ్డారు. లైంగిక వేధింపులు, ఇతరత్రా హింసకు గురైన యువతను ఆదుకోవడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# అల్జీరియాలో 'నీటి యుద్ధాలు'



**అల్జీర్స్:** అల్జీరియాలో నీటి యుద్ధాలు కొనసాగుతున్నాయి. నెలల తరబడి ఎదుర్కొంటున్న నీటి ఎద్దడిని నివారించాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆందోళనలతో అల్జీర్స్‌సహా దేశంలోని పలు నగరాలు, పట్టణాలు అట్టుడుకుతున్నాయి. అల్జీరియన్ అధికారులు నీటి కొరతను నివారించడానికి తీసుకుంటున్న చర్యలు ఎలాంటి ఫలితాలను ఇవ్వడం లేదు. తగ్గుతున్న వర్షపాతమే ఈ దుస్థితికి కారణం. తాగునీరు దొరకని పరిస్థితులు నెలకొనగా, సాగు నీరు లభించక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ రంగం కుదేలవడంతో, కరువు తాండవిస్తున్నది. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న టియారెట్‌లో కొన్ని నెలలుగా ప్రజలు రేషన్ ద్వారా అందుతున్న కొద్దిపాటి మంచి నీటితో సరిపుచ్చుకోవాల్సి వస్తున్నది. అవి కూడా సక్రమంగా అందకపోవడంతో, ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. రోడ్లను దిగ్బంధించిన ప్రజలు, వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. టైర్లను కాల్చి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికే మొరాకోలోని పలు ప్రాంతాల్లో కరువును ఎదుర్కోవడానికి రేషన్‌ను ప్రవేశపెట్టారు. వర్షాభావ కారణంగా రిజర్వాయర్లలో నీరు గణనీయంగా తగ్గడంతో, ఆచితూచి ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు అల్జీరియాలోనూ అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆఫ్రికాలోనే అతిపెద్ద దేశమైన అల్జీరియాలో సుమారు 81 డ్యామ్‌లో నీరు, మొత్తం సామర్థ్యంలో కేవలం మూడో వంతు మాత్రమే ఉన్నాయి. కొత్తగా బావులు తవ్విస్తున్నప్పటికీ, తగినంత నీరు లభ్యం కావడం లేదు. దీనితో ప్రత్యామ్నాయ మార్గాలను అల్జీరియన్ ప్రభుత్వం పరిశీలిస్తున్నది. ఈలోగా, నీటి కోసం ప్రజలు యుద్ధాలు చేయాల్సి వస్తున్నది.

# బైడెన్, ట్రంప్ నువ్వా? నేనా?



**వాషింగ్టన్ డిసి:** ఈసారి అమెరికా అధ్యక్ష ఎన్నికలు అత్యంత ఉత్కంఠ భరితంగా సాగనున్నాయి. డెమోక్రాటిక్ అభ్యర్థి, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్, రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీలో ఉన్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య రసవత్తరమైన పోటీ తప్పదని పరిశీలకులు అంటున్నారు.ఈనేపథ్యంలో, గురువారం రాత్రి 9 గంటలకు (భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం 6.30 గంటలకు) జరిగే డిబేట్ ప్రాధాన్యతను సంతరించుకుంది.ప్రస్తుతానికి ప్రజల్లో ఇద్దరికీ దాదాపు సమానమైన బలం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. దీనితో వీరిద్దరి మ ధ్య నువ్వా? నేనా? అన్న చందంగా పోటీ తప్పకపోవచ్చు. 2020లో తలపడిన వీరిద్దరూ మరోసారి రంగంలోకి దిగారు. అయితే, ట్రంప్ అధికాంలో ఉన్నప్పుడు తీసుకున్న పలు నిర్ణయాలు, అనుసరించిన విధానాల పట్ల ప్రజల్లో వ్యతిరేక వ్యక్తమైంది. ఫలితంగా ఆ పోరులో ట్రంప్ ఓటమికాగా, బైడెన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యా రు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేకపోయిన ట్రంప్ తన అభిమానులను రెచ్చగొట్టి, 'కాపిటోల్'పై దండయాత్ర కు పంపారన్న ఆరోపణలు ఉన్నాయి. రిపబ్లికన్లలో కొంత మంది బైడెన్‌కు అనుకూలంగా ఉండగా, రిపబ్లికన్లలో కొంత మంది ట్రంప్‌ను సమర్థిస్తున్నారని, దీనితో క్రాస్ ఓటింగ్ తప్పదని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. స్థూలంగా చూస్తే, ఇద్దరు అభ్యర్థులకు దాదాపు సమానమైన బలం ఉందని, దీనితో ఎవరు గెలుస్తారన్నది చెప్పడం కష్టమని చెప్తున్నారు. అ యితే, వలసదారులు, ఆర్థిక విధానాలు వంటి అంశాలపై ట్రంప్ ఉదారంగా వ్యవహరించడంతో,అతని పట్ల కొంత మంది మొగ్గు చూపవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. యుఎస్‌లో డిగ్రీ పూర్తి చేసిన వారికి గ్రీన్ కార్డు ఇవ్వనున్నట్టు ట్రంప్ ప్రకటించడం, ఆయనలో వచ్చిన మార్పుకు నిదర్శనం. అమెరికాలో స్థిరపడి, ఇప్పటికే పౌరసత్వం పొందిన లక్షలాది మంది విదేశీయులు ట్రంప్ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. బహుశా ట్రంప్‌కు ఇది లాభించవచ్చు. మరోవైపు బైడెన్ కూడా ప్రజలకు కొత్త కొత్త హామీలు గుప్పిస్తున్నారు. ఇద్దరూ ప్రజాహిత ప్రణాళికలను ప్రకటిస్తున్న నేపథ్యంలో పోటీలో ఎవరు గెలుస్తారన్నది ఆసక్తి రేపుతున్నది. ఇద్దరి మధ్య జరిగే డిబేట్‌లో ఎవరు, తమ వాదనతో ప్రజలను మెప్పిస్తారనే విషయంపైనే జయాపజయాలు ఆధారపడి ఉంటాయన్నది నిజం.

## పేపర్ లీకేజీపై దర్యాప్తు (మొదటి పేజీ తరువాయి)

శరవేగంగా ఆత్మనిర్భర్ దిశగా వృద్ధి చెందుతోందన్నారు. ప్రభుత్వం పదేళ్లలో సుస్థిర అభివద్ధిని సాధించిందనితెలిపారు. జమ్మూకశ్మీర్‌పై శత్రువులు అంతర్జాతీయ వేదికలపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కానీ ఈ ఎన్నికల్లో కశ్మీర్ లోయలో మార్పు కనిపించిందనిజ... శత్రువుల కుట్రలకు అక్కడి ప్రజలు గట్టిగా బదులిచ్చారన్నారు. అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం అన్నారు. రిఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ (సంస్కరణలు, పనితీరు, మార్పు) ఆధారంగా ప్రజలు ఎన్నికల్లో తీర్పునిచ్చారన్నారు. గత పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుందన్నారు. 'ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తోంది. పెద్ద ఎత్తున మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చింది. మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యాయి. మహిళల అభివద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. పౌరవిమానాయాన రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చాం. ఈశాన్య రా ష్ట్రాలఅభివద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. ఆర్థిక భరోసా కోసం నేరుగా రైతుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నాం. దేశవ్యాప్తంగా మెట్రో సేవలు విస్తరించాం' అని ముర్ము తన ప్రసంగంలో వివరించారు. తొలుత ఇటీవలే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొంది ఎంపీలుగా ప్రమాణస్వీకరాం చేసిన సభ్యులకు రాష్ట్రపతి శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ప్రజల విశ్వాసాన్ని గెలిచి సభకు ఎన్నికయ్యారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయరని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజలు సుస్థిరతకు పట్టం కట్టారని, ప్రజలు నిజాయతీని నమ్మి ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించారన్నారు. సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినందుకు ఈసీకి అభినందనలు తెలిపారు. ఉభయ సభల ప్రారంభానికి ముందు రాష్ట్రపతి భవన్ నుంచి పార్లమెంట్‌కు చేరుకున్న రాష్ట్రపతికి ప్రధాన ద్వారం వద్ద ప్రధానిమోదీ, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్,పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్వాగతం పలికారు.

## స్ఫూర్తి ప్రదాత రామోజీ (మొదటి పేజీ తరువాయి)

ఎనలేని ఆప్యాయత. పనిచేస్తూ చనిపోవాలని ఆయన కోరుకున్నారు. చివరి రోజుల్లో అదే జరిగింది. ఢిల్లీలో విజ్ఞాన్ భవన్ మాదిరిగా, అమరావతిలో రామోజీవిజ్ఞాన కేంద్రంఏర్పాటు చేస్తాం. అమరావతిలో ఒక రోడ్డుకు రామోజీరావు మార్గ్ అని పేరు పెడతాం. విశాఖపట్నంలో చిత్రనగరి ఏర్పాటు చేస్తాం.తెలుగుజాతికి ఆయన చేసిన సేవలకుగాను తగిన గుర్తింపు రావాలి. ఎన్టీఆర్, రామోజీరావులకు భారతరత్న సాధించడం మన బాధ్యత. రామోజీరావు ప్రజల ఆస్తి. ఆయన స్థాపించిన వ్యవస్థలను భావితరాలకు అందించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రామోజీరావు రాజీలేని పోరాటం చేశారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన ప్రజా సంక్షేమం కోణంలోనే మాట్లాడేవారు. రామోజీరావు మాటల్లో జర్నలిజం విలువలే తనకు కనిపించాయి. పత్రికా స్వేచ్ఛ ఎంత అవసరమో ఆయన వివరించారు. ప్రభుత్వంలో ఏం జరిగినా ప్రజలకు తెలియాలని అనేవారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజా సమస్యల గురించే పత్రికలో రాసేవారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరూ కషి చేయాలనే వారు. ఎన్ని కష్టాలు వచ్చినా జర్నలిజం విలువలు వదల్లేదు. అమరావతిలో రామోజీరావు విగ్రహం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ప్రజా శ్రేయస్సు కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జీవితాంతం పరితపించిన వ్యక్తి రామోజీరావు అని 'ఈనాడు' ఎండీ కిరణ్ అన్నారు. ప్రజల హక్కులను పాలకులు కబళించినప్పుడల్లా ఆయన బాధితుల పక్షం వహించేవారు. దేశంలో ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉండేవారు. ఆయన నమ్మిన, పాటించిన విలువలను త్రికరణ శుద్ధిగా కొనసాగిస్తామని కుటుంబ సభ్యులు, తన తరఫున సభా ముఖంగా హామీ ఇస్తున్నానన్నారు. రాజధాని అమరావతి కోసం రూ.10 కోట్లు విరాళం ప్రకటించి ముఖ్యమంత్రికి చెక్ అందజేశారు. అమరావతి దేశంలోనే గొప్ప నగరంగా మారాలి. నవ్యాంధ్ర రాజధాని అమరావతి పేరు రామోజీరావు సూచించారు. ఈ సభ నాన్న ఆశయాలు, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లే సంకల్ప సభగా భావిస్తున్నాం. సంస్మరణ సభ నిర్వహించిన ప్రభుత్వానికి కతజ్ఞతలు అని కిరణ్ తెలిపారు. సభలో మంత్రి కొలుసు పార్థసారథి, హిందూ మాజీ సంపాదకులు ఎన్.రామ్, ప్రముఖ దర్శకులు రాజమౌళి, కీరవాణి, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

## ఇందిరమ్మ రాజ్యస్థాపనే ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)



ట్యాంకర్ల ద్వారా ప్రజలు నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అనేక పథకాలు పేరుతో కేసీఆర్ రూ.70 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రప్రజల నెత్తిన అప్పులు కుంపటి పెట్టారన్నారు. సీతారామ ప్రాజెక్టు పేరుతో అశ్వాపురం మండలంలో నిర్మిస్తున్న పథకం రూపురేఖలు మార్చి ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని అమాంతం పెంచేశారని, రూ.9 వేల కోట్లను ఖర్చు చేసిన గత పాలకులు ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి కమ్మం జిల్లాతో పాటు నల్గొండ ఇతర జిల్లాల్లో భూములను గోదావరి జలాలు తడుపుతాయని, అయితే సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట తదితర నియోజక వర్గాలకు పెద్దగా లాభం చేకూరడం లేదని స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు మా దృష్టికి తీసుకొచ్చారని, అసరరమైతే అదనపు కాల్వలు నిర్మించి కొత్తగూడెం న ఇయోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు నీరందేలా కృషి చేస్తామని చెప్పారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అశ్వాపురం వద్ద పంప్‌హౌస్ ఫేస్ 1కు ట్రైల్ రన్ నిర్వహించారన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు మంత్రిగా కొనసాగే అవకాశాన్ని ప్రజల తనకు కల్పించారని, తాను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేసి ప్రారంభించానని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పంపు హౌస్ ఫేస్ 1ని ప్రారంభించామని,ప్రాజెక్టు నిర్మాణం కోసం భ భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. కొంత ఆలస్యమైనప్పటికీ రైతు భరోసా డబ్బులు అర్హుల ఖాతాల్లో జమవుతాయని, ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పోరాటాలజిల్లా అని జిల్లా ఇంచార్జ్, రోడ్లు భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. భూమి పూజ చేసిన మంచినీటి పథకాన్ని ఆదారు నెలల్లో పూర్తి చేసి ప్రజల చెంతకు చేరుస్తామని చెప్పారు. విజయవాడ నుండి హైదరాబాద్ వరకు జాతీయ రహదారి పనులకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రి నితిన్ ఘట్కారితో చర్చించి అనుమతులు తీసుకున్నామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. హైదరాబాద్ నుండి భద్రాచలం వరకు రూ.20200 కోట్లతో మరో జాతీయ రహదారి ఏర్పాటు చేస్తామని, దాని పలుకు కూడా త్వరలో ప్రారంభంకానున్నాయని తెలిపారు. ఇందిరమ్మ, ఇల్లు, రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, రైతు భరోసా అర్హుల దరి చేరుతాయని, ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు కొందరు తప్పుడు ప్రచారాలు మొదలు పెట్టారని, దానిని ప్రజలు నమ్మొద్దన్నారు. రీ డిజైన్ పేరుతో గత పాలకులు సీతారామ పేరు మార్చి వ్యయం పెంచేశారని, రూ.9 వేల కోట్లు వెచ్చించి బూడదలో పోసిన పన్నీరులా చేశారని పంచాయితీరాజ్, సమాచార శాఖా మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మాయమాటలతో ప్రజలను పదేళ్ల పాటు మోసం చేసిన బిఆర్ఎస్‌కు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ రాజ్య ఫలాలు అందుతాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సంసిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న, జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీ నారాయణ, కొత్వాల శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ శేషాంజన్ స్వామి, ఇంజనీర్లు రవి కుమార్, రాము, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పషా, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. వైద్యం అందించడంలో డిఎంహెచ్‌ఒలు అందరూ ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని సూచించారు. డి.ఎం.హెచ్.ఓ.లు ప్రైవేటు ఆసుపత్రుల లో డిహెచ్ఎంఒలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, వైద్య సేవలతో పాటు ఆసుపత్రుల ఫీజులను పరిశీలించాని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య ఆరోగ్య సేవా కార్యక్రమాలను సమన్వయంపై మంత్రి డిఎంహెచ్‌ఒలకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య ఆరోగ్య సేవలను ప్రజలకు అందించడంలో డిఎంహెచ్వోలది గురుతరమైన బాధ్యతా అని, ప్రతి 30 కిలోమీటర్ల దూరంలో ఒక ప్రభుత్వ హెల్త్ సెంటర్ ఉండాలని, జిల్లా, ప్రాంతాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మధ్య భౌగోళికంగా కనెక్టివిటీపై దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రయివేటు ఆసుపత్రుల లైసెన్స్ రద్దు చేయాలని, వచ్చే సమావేశానికి డిఎంహెచ్‌ఓలు పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. ఆసుపత్రుల్లో ప్రభుత్వ వైద్యుల హాజరు తప్పనిసరిగా నిర్వహించాలని, జిల్లాల వారిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలు డి ఎం హెచ్ ఓ లదే బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో మౌలిక సదుపాయాల కల్పన కు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సిబ్బంది కొరత లేకుండా చూడాలని, పారిశుద్య వ్యవ స్తమరింత మెరుగుపడేలా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు రోగులకు మెరుగైన డైట్ ను అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. డాక్టర్లు విధిగా సమయపాలన, మెరుగైన వైద్య సేవలను అందించేలా డి ఎం హెచ్ ఓ లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్భంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్అండ్ పిసి అండ పి ఎన్ డి టి యాక్ట్ అమలు, అవగాహన పై రూపొందించిన వాల్ పోస్టర్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్య, ఆరోగ్యశాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చోంగ్తూ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్ వి కర్ణన్‌లతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు, ఎన్‌హెచ్ఎం అధికారులు, వివిధ జిల్లాల డిప్యూటీ డిఎంహెచ్వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కెసిఆర్ పునాది

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో మంచి పనితీరును కనబరిచామన్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో తమఓటింగ్‌శాతంపెరిగిందని సిఎం గుర్తు చేశారు. సమర్థులైన మంత్రులు ఉన్నారు ప్రతిపక్షాలు పలు కీలక శాఖలకు మం త్రులు లేరని ఆరోపిస్తున్నాని, విద్యాశాఖ తన వద్దే ఉందని, అన్ని శాఖలకు సమర్థవంతులైన మంత్రులున్నారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల కంటే ఇక్కడి మంత్రులు మెరుగ్గా ఉన్నారో లేరో చూడాలని ప్రతిపక్షాలకు సూచించారు. అభివృద్ధి పనుల కోసం మంత్రులు కేంద్రమంత్రులను కలుస్తున్నారని తెలిపారు. ఆరు సంక్షేమ పథకాలను అమలు చేయడమే ధ్యేయమని, ఏకకాలంలో రైతు రుణ మాఫీ చేయడానికి నిర్ణయించచామని సిఎం పునరుద్ఘాటించారు.

**నాకంటూ ఛాయిస్‌లేదు :** టిపిసిసి అధ్యక్షుడిగా తన పదవీ కాలం ముగిసిందని, టిపిసిసి అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా వారితో కలిసి పనిచేస్తానన్నారు. అధ్యక్షుడి నియామకంపై తన కంటూ ప్రత్యేక ఛాయిస్ ఏమీ లేదని రేవంత్‌రెడ్డి అన్నారు. జీవన్ రెడ్డి అనుభవాలను పార్టీ వినియోగించుకుంటుందని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. జీవన్‌రెడ్డి చర్యల వల్ల కాంగ్రెస్‌కు నష్టం జరగాలని బిఆర్ఎస్ నేతలు చూశారని, కాంగ్రెస్ పట్ల జీవన్‌రెడ్డికి ఉన్న నిబద్ధత వారికి అర్థం కాదన్నారు.

## పురోభివృద్ధికి తోడ్పాటివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

చూపి ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాల్సిన వసరం ఉందన్నారు. కొత్తగూడెంపాల్వంచ మున్సిపాలిటీలను కలుపుతు కార్పేరేషన్ ఏర్పాటు చేయాలని, ఇలా చేయడం ద్వారా ప్రజలు మేలు చేకూరడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. పాల్వంచ కేంద్రం లో 800 మె.వాట్ల విద్యుత్ ఉత్పత్తిని ఏర్పాటు చేయాలని, కొత్తగూడెం, పాల్వంచలలో నెలకొన్న సర్వే నెంబర్ల సమస్యకు పరిష్కారం చూపాలని, సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెంకు ఎలాంటి ఉపయోగం లేదని, దీనిని ఇరిగేషన్ మంత్రికి కూడా వివరించామని, ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఈ జిల్లాలోని భూములను కూడా తడిపేందుకు ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేయాలని, దీనిపై తమకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. అదే విధంగా సింగరేణి బొగ్గు గనులు, అనేక పరిశ్రమలు ఉన్న ఈ జిల్లాలో ఐటి హబ్ ఆవసరం ఎంతైనా ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకోవాలని, ఐటి హబ్ ఏర్పాటుకు సింగరేణితో చర్చిస్తే సమస్య తీరుతుందని తెలిపారు. జిల్లాలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని, మానవ వనరుల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. దీంతో స్పందించిన భట్టి అన్ని విధాలుగా, అన్నిరంగాల్లో ఈ జిల్లా ముందంజలో ఉండే విధంగా కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు.

## అబద్ధాల పుట్ట (మొదటి పేజీ తరువాయి)

దాడి జరుగుతోందన్నారు. 1975లో ఎమర్జెన్సీ విధించడాన్ని రాజ్యాంగంపై జరిగిన ప్రత్యక్ష దాడి అని, ఆ రోజులను చీకటి అధ్యాయం అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన ప్రసంగంలో పేర్కొన్నారు. రాజ్యాంగేతర శక్తులపై దేశం విజయం సాధించిందని అన్నారు. కాగా, ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం అనంతరం సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను ప్రభుత్వం ప్రకటించడాన్ని తప్పుబట్టారు. 'భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందనేది కట్టుకథని, మన రైతులను అభివృద్ధి చేసిందా అని ప్రశ్నించారు. భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తే ఇంత మంది యువత ఎందుకు నిరుద్యోగులుగా ఉన్నారని, అగ్నివీర్ వంటి పథకం ఎందుకని, ధరల పెరుగుదలను ఎందుకు నియంత్రించలేకపోతున్నామని నిలదీశారు. పెట్టుబడులకు సంబంధించి ప్రభుత్వ వాదనలపై అఖిలేష్ స్పందిస్తూ నిజంగా పెట్టుబడులు పెట్టి ఉంటే మనం మరింత అభివృద్ధి చూసేవారిమన్నారు. కొంతమంది వ్యక్తుల అభివృద్ధి జాతీయ వృద్ధిని కాదన్నారు. అది వృద్ధి చెందిన వారి సంఖ్యను పెంచుతుంతదేమోగానీ అత్యంత దోపిడీ గురువుతన్న రైతులు, పేదలకు ఒరిగిందేమీలేన్నారు. ముర్ము ఎమర్జెన్సీ ప్రస్తావననుప్రశ్నించగా.. ఎమర్జెన్సీ సమయంలో జైల్లో ఉన్న ప్రజలకు బిజెపి ఏం చేసిందని ప్రశ్నిస్తూ వారికి సమాజ్‌వాది పార్టీ గౌరవం, పెన్షన్లు ఇచ్చిందని గుర్తుచేశారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా మాట్లాడుతూ రాష్ట్రపతి 'ప్రభుత్వం ఇచ్చిన స్క్రిప్ట్'ను చదివి వినిపించారని, సొంతంగా మెజారిటీ లేదన్న విషయాన్ని బిజెపి ఇంకా గ్రహించలేదన్నారు. బహుశా వారు గత సంవత్సరం ప్రసంగం నుండి కొంత స్క్రిప్ట్‌ను తీసుకున్నట్లు కనిపిస్తుందన్నారు. సిపిఐ (మార్కిస్ట్–లెనినిస్ట్) లిబరేషన్ ఎంపి సుదామ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రపతి ప్రసంగం పూర్తిగా అబద్ధాలతో కూడుకున్నదని చెప్పారు. తమది మెజారిటీ ప్రభుత్వమని చెప్పుకుంటున్న బిజెపి... ఇది కూటమి ప్రభుత్వమని గుర్తుంచుకోవాలన్నారు. మణిపూర్ గురించి మాట్లాడాలన్నారు. మహిళా సాధికారతపై ఎందుకు పసలేని ప్రసంగాలు చేస్తున్నారని ప్రశ్నిస్తూ మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించారని, ప్రజలు నిరాశ్రయులయ్యారని, మహిళా మల్లయోధులకు ఇంకా న్యాయం జరలేదని విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగంలో కొత్తదనం ఏమీ లేదని కాంగ్రెస్ నేత తారిఖ్ అన్వర్ అన్నారు. కేవలం పాత ప్రసంగాలకు కొన్ని మార్పులు చేశారని చెప్పారు. ఎమర్జెన్సీ తర్వాత అనేక ఎన్నికలు జరిగాయని, అందులో బిజెపి ఓడిపోయిందని, తాము కొత్తగా చెప్పేదేమీ లేదని అన్వర్ అన్నారు. ఎమర్జెన్సీ విధించడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఖండించారు.

# హరిత టూరిజం హోటల్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వొద్దు : చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: నిర్మల్ జిల్లా, కడెం ప్రాజెక్టు వద్ద ఉన్న హరిత టూరిజం హోటల్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వ కుండా,దీనిని టూరిజం కార్పొరేషనే నడిపించేలా తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ హోటల్‌ను ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన పర్యాటక ప్రాంతాలలో నూతనంగా హరిత హోటల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.ఈ మేరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి చాడవెంకట్‌రెడ్డి గురువారం లేఖ రాశారు. దివంగత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పర్యాటక ప్రాంతాలలో హరిత టూరిజం హోటల్స్ ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వ భూమిని కేటాయించి, వాటికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులను కూ డా కేటాయించి, అభివృద్ధి చేశారని ఆయన వివరించారు. కొంతమంది అధికారులు, బయటి వ్యక్తులతో కుమ్మక్కై ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సిఎంకు రాసిన లేఖలో చాడ తెలిపారు. ఈ విషయమై విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలని, ఒకవేళ హరితహోటల్స్‌ను ప్రైవేటుపరం చేయాలని ప్రభుత్వానికి ఆలోచన ఉంటే, వెంటనే ప్రైవేటుపరం ఆలోచనను విరమించుకోవాలని,అవసరమైతే ఇంకా చాలా పర్యాటక కేంద్రాల వద్ద హోటల్స్‌ను నిర్మించాలని కోరారు. మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా హరిత హోటల్స్‌ను ఏర్పాటు చేశారని చాడ గుర్తు చేశారు.

# 'స్టాఫ్ గెస్ట్ లెక్చరర్స్'ను రెన్యువల్ చేయండి

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఈనెల 1 నుంచి ప్రారంభమైనప్పటికీ రాష్ట్రంలో 35 శాతం స్టాఫ్ గెస్ట్ లెక్చరర్స్‌ను రెన్యువల్ చేయలేదని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. తద్వారా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు,ఇతర ప్రైవేట్ కళాశాలలకు వెళ్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టాఫ్ గెస్ట్ లెక్చరర్స్ సమస్యను వెంటనే పరిష్కరించి, పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపైన రాష్ట్ర ప్రభుత్వందృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో పర్మినెంట్ లెక్చరర్లు లేని కళాశాలలు 25వరకు ఉన్నాయని, మూడు వేల మంది గెస్ట్ లెక్చరర్‌లకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారు రోడ్డున పడ్డారని తెలిపారు. గెస్ట్ లెక్చరర్‌కు జీత భత్యాలు పెంచాలన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో అనేక ప్రభుత్వ కళాశాలలను మంజూరు చేశామని, విద్యార్థి జీవితంలో ఇంటర్ మీడియట్ చాలా కీలకమని తెలిపారు. ప్రయివేటు కళాశాలలు వ్యాపార ధోరణితో ఉన్నాయని ఆయన అన్నారు.

# విమర్శించడం సరికాదు

బిఆర్‌ఎస్‌కు అద్దంకి దయాకర్ హితవు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఏ కమి షన్‌ను వేసినా ఆ కమిషన్‌ను విమర్శించడం, ఎదురుదాడి చేయడం బిఆర్‌ఎస్ పార్టీ అధినేత కెసిఆర్‌కు అలవా టుగా మారిందని, ఇది సరికాదని టిపిసిసి అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ విమర్శించారు. హైదరాబాద్‌లోని సచివాలయం మీడియా పాయింట్ వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము దొంగతనం చేస్తాం కానీ మమ్మల్ని ఎవరు అడగొద్దు అనేలా బిఆర్ ఎస్ వాదన ఉన్నదన్నారు. హైకోర్టు చెప్పినట్టు విందాం... ఏ కమిషన్ వేసినా దానికి సమాధానం చెబుతామని బిఆర్‌ఎస్ నేతలు తొలుత అన్నారని, అలాంటప్పుడు ఇప్పుడు ఎందుకు హైకోర్టును ఆశ్రయిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. మీ నాయకుడిని అసెంబ్లీకి రమ్మంటే రాడు.. ప్రతి అంశం అక్కడే చర్చిద్దామంటే వినడు అని అన్నారు. ఛత్తీస్‌ఘడ్ విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలపైన కూడా అసెంబ్లీలో చర్చిద్దామంటున్నాం, ప్రతిపక్ష నేతగా కెసిఆర్ సభకే రావడం లేదు అని విమర్శించారు. గత బిఆర్‌ఎస్ సర్కార్‌లో 25 శాతం రాష్ట్రంలో అక్రమాలు జరిగాయని, నీటిపారుదల శాఖనే తీసుకుంటే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి పరాకాష్టకు చేరడం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీలు కూలి పోయాయన్నారు.

# నిరుద్యోగుల హామీలను పట్టించుకోని ప్రభుత్వం: కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్:ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. జాబ్ క్యాలండర్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని,లేదంటే నిరుద్యోగుల తరపున బిఆర్‌ఎస్ నాయకులందరూ రోడ్డెక్కి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. గ్రూప్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పలువురు అభ్యర్థులు హైదరా బాద్, నందినగర్‌లోని కెటిఆర్ నివాసంలో వారు గురువారం కెటిఆర్‌తో సమావేశమయ్యారు. అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జాబ్ క్యాలె oడర్ పేరుతో కాంగ్రెస్ పలు ప్రకటనలు చేసిందని, దాదాపు 10పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్లకు తేదీలను కూడా ప్రకటించిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేయలేదని, వెంటనే ఆనోటిఫికేషన్లను విడుదల చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. గ్రూప్2లో 2వేల ఉద్యోగాలు, గ్రూప్3లో వేలాదిగా ఉద్యోగాలు పెంచుతామని హామీనిచ్చారన్నారు. గ్రూప్1కు సంబంధించి గత ప్రభుత్వం ఇచ్చిన దానికి కేవలం 60 ఉద్యోగాలను మాత్రమే అదనంగా కలిపారన్నారు. నిరుద్యోగులకు బిఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. చాలా మంది అభ్యర్థులు అన్ని పరీక్షలను రాస్తారని, అందుకే పరీక్ష, పరీక్షకు మధ్య సరిపడేంత సమయం ఇవ్వాలని కోరారు. ఏడాది లో రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కెటిఆర్ డిమాండ్ చేశారు.

# నిరుద్యోగులతో కెటిఆర్ రాజకీయం సిగ్గు చేటు



ప్రజాపక్షం/హైదరాబాద్ : మాజీ మంత్రి కెటిర్ నిరుద్యోగులతో రాజకీయం చేయాలని చూడడం సిగ్గుచేటని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. ప్రవల్లిక ఆత్మ హత్యను అవనపరిచిన కెటిఆర్ నిరుద్యోగుల గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీప్రక్రియను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రణాళిక బద్ధంగా జాబ్ క్యాలండర్ తో రాష్ట్రంలో ప్రతి ఖాళీని భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారని చెప్పారు. గ్రూప్1 లీకేజీ అయినప్పుడు మౌనంగా ఉన్న కెటిఆర్, నిరుద్యోగులతో ప్రెస్‌మీట్ పెట్టడం తీవ్రంగా తప్పు పట్టారు. వెంటనే నిరుద్యోగులకు కెటిఆర్ క్షమాపణలు చెప్పాలని దయాకర్ డిమాండ్ చేశారు.

# డ్రగ్స్ కంట్రోల్ దాడులు



ప్రజాపక్షం/హైదరాబాద్: డ్రగ్ యాక్ట్ ప్రకారం నిర్ణయించిన ధరలకంటే అధిక ధరలకు మందులు విక్రయిస్తున్న దుకాణాల పైన డ్రగ్ కంట్రోల్ అధికారులు గురువారం దాడులు నిర్వహించి,కేసులు నమో దు చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఇంట్రాలెంట్200ఎం.జి ట్యాబ్‌లెట్లను, ఇంట్రోసిడ్ 200 ఎంజి ట్యాబ్లెట్లను రూ.152.26ల అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో విక్రయదారులపైన డ్రగ్స్ కంట్రోలర్ కేసు నమోదు చేశారు. అలాగే జగిత్యాలలో ఎలవెంట్ 2.5 అనే ట్యాబ్లెట్‌ను రూ.25.80ను ఎక్కువ ధరలకు విక్రయిస్తున్న వారిపైన కేసు నమోదు చేశారు. మోసపూరిత ప్రకటనలతో కిడ్నీలో రాయి ఉన్నట్లు, డయాబెటిక్, స్టోన్ బస్టు, కళాంజలి అయిల్‌ను పేరుతో విక్రయిస్తున్న వారిపై కూడా డ్రగ్స్ కంట్రోల్ అధికారులు కేసు నమోదు చేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, సిహెచ్ స్వప్న దాడులు నిర్వహించారు.మందులను అధిక ధరలకు, మోసపూరిత ప్రచారంతో మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ వి.బి కమలాసన్‌రెడ్డి తెలిపారు.

## నీటి వనరుల వినియోగం కోసం

# ప్రణాళికలు రూపొందించాలి

* జలశక్తి అభియాన్‌పై వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ రాజీవ్‌గౌబా



ప్రజాపక్షం / హైదరాబాద్ : నీటి వనరుల వినియోగం కోసం శాస్త్రీయ ప్రణాళికలను రూపొందించాలని, వనరుల వివరాలను జియో ట్యాగింగ్ చేయాలని కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ రాజీవ్ గౌబా అన్నారు. గురువారం జలశక్తి అభియాన్‌పై అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నిర్వాహకులు, కేంద్ర మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో ఆయన ఢిల్లీలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరుల వివరాలను కూడా సిద్ధం చేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకం, కాంపా, ఫైనాన్స్ కమిషన్ తదితర పథకాల కింద లభించే నిధులను నీటి సంరక్షణ కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చని సూచించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా గత ఏడాది అమృత్ సరోవర్ కార్యక్రమం కింద 75 వేలకు పైగా కొత్త నీటి వనరులను నిర్మించినందుకు ప్రధాన కార్యదర్శులను ఆయన అభినందించారు. ఈ సంవత్సరం నారీ శక్తి సే జలశక్తి అభియాన్ ఇతివృత్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వాములను చేసి నీటి నిర్వహణలో వారికి శిక్షణ ఇవ్వాలని కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాష్ట్రాలను కోరారు. నీటి వినియోగంపై నిర్ణయం తీసుకోవడంలో మహిళల పాత్ర పెరగాల్సిన అవసరాన్ని ఆయన పునరుద్ఘాటించారు. గ్రామీణ, పట్టణ నీటి సరఫరా కోసం రాష్ట్రాలు సమగ్ర ఓ అండ్ ఎం విధానాన్ని రూపొందించాలని ఆయన కోరారు. సరైన క్లోరినైజేషన్ చేసి నాణ్యమైన తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని అన్నారు. వర్షపు నీటి సంరక్షణ నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలని, పట్టణ ప్రాంతాల్లోని నీటి వనరుల ఆక్రమణలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. నీటి వనరులకు ఆధారమైన చెరువులు, కుంటలలో పూడిక తీయటం, శుభ్రపరచడం, భూగర్భజలాల రీఛార్జ్ కోసం పాడుబడిన బోర్‌వెల్‌లను పునరుద్ధరించడం, నీటి వనరులను జియో ట్యాగింగ్ చేయడం, పరీవాహక ప్రాంతాలలో అటవీ పెంపకం, చిన్న నదుల పునరుజ్జీవనం వంటివి జలశక్తి అభియాన్‌లో ప్రధానమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంకా ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఇరిగేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు ఎప్పుడిచ్చారో తెలుసా?

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో రైతు బందు ఎప్పుడు చ్చారో, ఎలా ఇచ్చారో, ఎన్ని సార్లు పూర్తిగా ఇవ్వకుండా ఆపివేశారో రాష్ట్ర రైతాంగానికి మొత్తం తెలుసాని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బిఆర్ఎస్ మాజీ మంత్రి అసలు రైతు భరోసా విధివిధానాలు ఏమిటి, రైతు భరోసా ఎప్పుడు ఇస్తారంటూ చేసిన వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందిస్తూ అసలు రైతు భరోసాపై బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడడం మంచిది కాదని, రైతలు అన్ని విషయాలు మర్చిపోలేదన్నారు. 2018 కాలం 128 రోజుల (4 నెలల 5 రోజులు) పాటు, యాసంగిలో 161 రోజులు, 2019 వానాకాలంలో138 రోజులు,2020 వానాకాలంలో 169 రోజులు, 2021–22 యాసంగిలో 84 రోజులు, 2022–23 యాసంగిలో 148 రోజులు, 2023 వానాకాలంలో కూడా 108 రోజుల పాటు రైతుబంధు నిధులు విడుదల చేసిన మీరు, ఇప్పటి ప్రభుత్వాన్ని విమర్శిస్తుండడం కోడిగుడు మీద ఈకలు ఏరుతున్న చందంగా ఉందన్నారు. అప్పటి రైతు బంధు పేరుతో గుట్టలకు, రాళ్ళురప్పలకు, పుట్టలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసిన భూములకు, జాతీయ రహదారులకు, బంజరు భూములకు ఇచ్చి 12 విడతలలో రూ.26,500 కోట్ల ప్రజాధనాన్ని దుబారా చేసారు కాబట్టే, ఈ ప్రభుత్వము 'రైతుభరోసా' పథకాన్ని ఆదర్శవంతమైన పథకంగా తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రైతుల అభిప్రాయాలను తీసుకుంటున్నామని, అదేవిధంగా రాష్ట్ర కేబినేట్ నియమించిన సబ్ కమిటీలో విధివిధానాలు తయారుచేసి త్వరలోనే ఆ పథకాన్ని అమలు చేస్తామని మంత్రి తెలిపారు. మాది నియంతృత్వ పోకడల ప్రభుత్వం కాదని, నిందలు మోపడం మాని, ప్రతిపక్షంగా నిర్ణయాత్మక సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# నేటి నుంచి సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలు

15 సంవత్సరాల తర్వాత ఖమ్మంలో

హాజరు కానున్న నారాయణ, అజీజ్ పాషా, చాడ, కూనంనేని

ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా సమితి



ప్రజాపక్షం/ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి సమావేశాలు శుక్రవారం ఖమ్మంలో ప్రారంభం కానున్నాయి. 15 ఏళ్ల తర్వాత జరుగుతున్న సమావేశాలకు ఖమ్మం జిల్లా సమితి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. 2009 నవంబరు 8, 9, 10 తేదీల్లో చివరి రాష్ట్ర సమితి సమావేశాలు జరిగాయి. ఆ తర్వాత మరల రాష్ట్ర సమితి సమావేశాలకు ఖమ్మం వేదిక కానుంది. 28 ఉదయం 10 గంటలకు రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం స్థానిక గిరి ప్రసాద్ భవన్‌లో ప్రారంభం కానుంది. కార్యదర్శి వర్గ సమావేశ అనంతరం కార్యవర్గ సమావేశం జరుగుతుంది. 29, 30 తేదీలలో రాష్ట్ర సమితి సమావేశాలు ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్నాయి. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్ పాషా, చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరు కానున్నారు. సమావేశానికి సంబంధించి జిల్లా కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. నాయకులకు స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చే రాష్ట్ర సమితి సభ్యులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో గత కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణను ఈసమావేశాల్లో రూపొందించనున్నారు. ముఖ్యంగా పార్టీ విస్తరణ ప్రచార ఆందోళనలపై దృష్టి సారించనున్నారు. కేంద్రప్రభుత్వం తెలంగాణకు అతిపెద్ద ఆదాయ వనరుగా తలమానికంగా ఉన్న సింగరేణిని ప్రైవేటు పరం చేయాలనే ఆలోచనతో బొగ్గు బ్లాకుల వేలం పాటను సిపిఐ పూర్తిగా నిరసిస్తుంది. జూన్ ఐదు నుంచి చేపట్టనున్న ఆందోళనలకు కార్యకర్తలను సన్నద్ధం చేయడంతో పాటు ఆందోళనకు ఒక ప్రణాళికను ఈ సమావేశంలో నిర్ణయించనున్నారు. దేశంలో పెరుగుతున్న మతోన్మాద చర్యలు బిజెపి వైఖరి ని చర్చించి ప్రజా చైతన్యం కోసం కార్యక్రమాలను రూపొందించే అవకాశం ఉంది. అట్టడుగు వర్గాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రతి సమస్యను పాలకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే మార్గంలో అనుసరించాల్సిన వ్యూహాలను ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. పార్టీ నిర్మాణం, విస్తృతి పైన ప్రత్యేక దృష్టి సారించనున్నారు. మారిన కాలమాన ఆర్థిక రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పార్టీ నిర్మాణాన్ని రూపు దిద్దేందుకు విస్తృత స్థాయిలో చర్చ జరిగే అవకాశం ఉంది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటుప్రసాద్, రాష్ట్ర నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేష్‌ల నేతృత్వంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. సమావేశాలు జరిగే సిపిఐ కార్యాలయం, ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్ వరకు ఎర్ర జెండాలు, తోరణాలతో అలంకరించారు.

# బోనాల ఉత్సవాలకు జులై 5లోగా ఏర్పాట్లు పూర్తి

జూలై 21న లష్కర్ బోనాలు, 22న రంగం

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

ఉత్సవాల విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

రాష్ట్ర రవాణా బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికే ప్రత్యేకమైన ఆషాడ బోనాల ఉత్సవాలోభాగంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను ప్రజలందరి సహకారంతో అన్ని శాఖలు అధికారులు పూర్తి సమన్వయం పని చేయడంతో విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా,బిసి శాఖ, జి ల్లాఇంఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సికింద్రాబాద్ బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూలై 5లోపే నగరంలోని అన్ని దేవాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూలై 21 న బోనాలు, 22న ఉదయం 9గంటలకు రంగం, అంబారిపై అమ్మవారు ఊరేగింపు ఉంటుందని ఆయన తెలిపారు. 1830 నుండి సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి ప్రతి సంవత్సరం బోనాలు సమర్పిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. అమ్మవారి ఆశీర్వాదంతో బోనాలు విజయవంతం అయ్యేలా ప్ర జల సహకారం ఉండాలని కోరారు. బోనాలు ఉ త్సవాలు అంటేనే హైదరాబాద్‌లో సంస్కృతి సాంప్రదాయాలకు పెదపీట ఉంటుందని ఈసారి బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం 20 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఆలయ పరిసరాల్లో లైటింగ్ , ఉత్సవాలు జరుగు మూడు రోజుల పాటు నిరంతర నీటి సరఫరా, నిరంతర విద్యుత్ ఏర్పాటు తో పాటు అదనపు ట్రాన్స్ఫార్మర్‌లు ఏర్పాటు , పోలీసుల సమక్షంలో బారికెడ్లు ఏర్పాటు చేపట్టాలని తెలిపారు.తాగునీటికి వాటర్ పాకెట్స్, వాటర్ బాటిల్స్ ,4 హెల్త్ క్యాంప్‌లు, శి క్షణ పొందిన పిసిఆర్ బృందాలు ,ప్రత్యేక అంబులెన్స్ ,ఫైర్ ఇంజన్స్ ,వెల్ కమ్ బోర్డుల ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ సమీక్షా సమావేశంలో జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయ , డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ,దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ,కమీషనర్ హన్మంతరావు , సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్చార్జి కోటా నీలిమ, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, పోలీస్ , జిహెచ్ఎంసి, ఆర్అండ్‌బి, వాటర్ వర్క్స్ , ,విద్యుత్ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థిక సంస్కరణలతో దేశ గతిని మలుపుతిప్పిన పివి

నేడు పివి జన్మదినం సందర్భంగా స్మరించుకున్న కొండా సురేఖ



ప్రజాపక్షం / హైదరాబాద్ : మాజీ ప్రధాని, భారతరత్న పివి నర్సింహారావు ఆర్థిక సంస్కరణలతో దేశ గతిని మలుపు తిప్పారని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నేడు శుక్రవారం పివి నర్సింహారావు 103వ జయంతిని పురస్కరించుకుని దేశానికి పివి అందించిన అమూల్యమైన సేవలను మంత్రి సురేఖ స్మరించుకున్నారు. పివి నర్సింహారావు పరచిన బాటలో నడిచి నేడు దేశం ప్రపంచంలో ఆర్థికంగా శక్తివంతమైన దేశాల్లో ఒకటిగా నిలిచిందని మంత్రి సురేఖ అన్నారు. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన బహుభాషాకోవిదుడు, జ్ఞానసంపన్నుడు, తొలి తెలుగు ప్రధాని అయిన పివి నర్సింహారావు తెలంగాణ బిడ్డ కావడం మనందరికీ గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి విశేష సేవలందించి, దేశాన్ని అభ్యుదయ బాటలో నడిపించిన పివి నేటి యువ రాజకీయ నాయకులకు స్ఫూర్తిప్రదాత అని మంత్రి సురేఖ కొనియాడారు.

# ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నర్సింగ్ అధికారులదే కీలక పాత్ర

నర్సింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి : ప్రో. కోదండరామ్



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజల ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంతో పాటు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నర్సింగ్ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. అనేక సమస్యలతో సతమతమవుతున్న నర్సింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని హామీనిచ్చారు. హైదరాబాద్, నాంపల్లి, తెలుగు యూనివర్సిటీ, ఆడిటోరియంలో తెలంగాణ నర్సింగ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి కిరణ్ పవ్వాడి అధ్యక్షతన 'తెలంగాణ నర్సింగ్ అధికారుల సంఘం' రాష్ట్ర సదస్సు గురువారం జరిగింది. ఈ సదస్సులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శివ సాయి కృష్ణ స్వాగతం పలుకగా, ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కోదండరామ్, ప్రత్యేక అథితులుగా ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్నగౌడ్, సంఘం సలహాదారు బి.వెంకటేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా కోదండరామ్ సదస్సునుద్దేశించి మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నర్సింగ్ అధికారుల సమస్యల పట్ల ఉదాసీన వైఖరి ప్రదర్శించిందని విమర్శించారు. నర్సింగ్ ఉద్యోగుల బదిలీలలో స్థానికత పాటించలేదని, డిఏ, పిఆర్‌సిపెంపును పట్టించుకోలేదని, ఆసుపత్రులలో కనీసం నర్సింగ్ ఉద్యోగులకు దుస్తులను మార్చుకునే గది కూడా లేదని, తాగు నీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నర్సింగ్ అధికారులు ఎదుర్కుంటున్న అన్ని సమస్యలనూ, జిఓనంబర్ 317 ద్వారా స్థానికత కోల్పోయిన నర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేసే అంశంతో పాటు జాతీయ వైద్య మండలి నిబంధనల మేరకు ప్రతి 100 పడకల ఆసుపత్రిలో ఐదు మంది హెడ్ నర్సుల నియామకానికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి,వాటి పరిష్కరానికి కృషి చేస్తానని కోదండరామ్ హామీనిచ్చారు. వై.నాగన్నగౌడ్ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి ఒక కళ అని,మానవతా సేవనని అన్నారు. అనారోగ్యం నుండి కోలుకునేందుకు సరైన ఆరోగ్యం,జీవన నాణ్యతను నిర్వహించేందుకు ప్రజలకు సహాయపడుతారని తెలిపారు. అవసరమైన వైద్య సేవలను అందించేలా ఆరోగ్య సంరక్షణ అధికారుల శ్రేయస్సు కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు సమర్థవంతమైన ఆరోగ్య సంరక్షణను అందించేందుకు 'ఆరోగ్యకరమైన తెలంగాణ' నిర్మాణంలో భాగంగా కాంగ్రెస్ అధికారంలోనికి రాగానే 7,000 మంది నర్సింగ్ అధికారులను నియమించిందని గుర్తు చేశారు. నర్సింగ్ అధికారుల సమస్యలను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ దృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని నాగన్న గౌడ్ చెప్పారు. ఈ సదస్సులో తెలంగాణ నర్సింగ్ అధికారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి. కవిత, ఉపాధ్యక్షులు ఎస్.సుజీవన్, కె.విజయేశ్కాంత్, ఈ.స్వాతి, సహాయ కార్యదర్శులు ఎండి. సలావుద్దీన్, కె. రామనాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శిలు జి. నరేంద్ర రాజన్, కె. వినోద్, కోశాధికారి జి. నరేష్, నాయకులు రాజేందర్ రెడ్డి, నంద కుమార్, మొగిరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ విద్యాసేవల 'ఆదరణ' సొసైటీకి ప్రభుత్వ స్థలం

వార్షికోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క హామీ



ప్రజాపక్షం/హైదరాబాద్ : అవసరమైన నిరుపేద, అనాథ విద్యార్థులకు రెండు దశాబ్దాలకు పైగా ఉచిత విద్యను అందించేందుకు విలువలు, ఆదర్శాలతో అమితాభ ఆదరణ విద్యాలయాన్ని నిర్వహిస్తున్న ఆదరణ సొసైటీకి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు తప్పక కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. బుధవారం రాత్రి రవీంద్రభారతి ఆడిటోరియంలో అమితాభ ఆదరణవిద్యాలయ అప్‌గ్రేడ్ కోసం ప్రముఖ సినీ గాయకుల బృందంతో నిర్వహించిన కోటిరాగాల గానలహరి, డ్యాన్స్ మ్యూజికల్ నైట్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఉపన్యసించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ప్రముఖ సంగీత దర్శకులు కోటికి ఆదరణ సొసైటీ పాలకవర్గం మంత్రి సీత క్క చేతుల మీదుగా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. కోటిని పూలమాలలు, శాలువాలతో ముంచెత్తి ఘనంగా సత్కరించారు. ప్రముఖ సినీనటులు సుమన్, సంపూర్ణేష్‌బాబు ఈ సత్కారంలో భాగస్వాములయ్యారు. మంత్రి సీతక్క ప్రసంగిస్తూ ప్రతీ ఊరులో పాఠశాల ఉన్నప్పుడే ప్రజలకు మరిన్ని విద్యా ఫలాలు అందుతాయన్నా రు. ఆదర్శ సమాజంనిర్మితమవుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఎన్నో ఉన్నప్పటికీ ఆదరణ సొసైటీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న అమితాభ ఆదరణ విద్యాలయ ప్రపంచ వ్యాపితంగా పేరొందిందన్నా రు. వేలాది మంది అమితాభ విద్యార్థులు ఉచి త విద్యను అందుకుని అత్యున్నత ఉద్యోగాలలో స్థిరపడ్డారని, ఆదరణ సొసైటీ కృషి అభినందనీయమన్నారు.ప్రముఖ సినీ సంగీత దర్శకులు, లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు సన్మాన గ్రహీత కోటి, ప్రముఖ సినీ గాయకులు గీతామాధురి, శ్రీకృష్ణ, భీమ్లానాయక్ ఫేం అరుణ్, బిగ్‌బాస్ ఫేం దామిని, సాహితి, ఉమానేహ, చిన్మయి, సింధూజ పాడిన పా టలు ఆహుతులను ఉర్రూతలూగించాయి. రవీంద్రభారతి చప్పట్లు, ఈలలు, కేరింతలతో మార్మోగింది. ఓండ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ గోపాల్ శిష్య బృందం, ఆయనచే ప్రత్యేకశిక్షణ పొందిన అమితాభ ఆదరణ విద్యాలయ విద్యార్థుల నృత్యాలు ప్రశంసలు చూరగొన్నాయి. అమితాభ ఆదరణ విద్యాలయ వ్యవస్థాపక ప్రెసిడెంట్ మాధవరావు జాడిని మంత్రి ఘనంగా సత్కరించారు. అమితాభ ఆదరణ విద్యాలయాన్ని ఇంటర్, డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు 5ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని మంజూరు చేయించాలని మాధవరావు జాడి మంత్రి సీతక్కను అభ్యర్థించగా ఆమె సానుకూలంగా స్పందించారు. అమితాభ ఆదరణ విద్యాలయ నిర్వహణకోసం బి.పుల్లారెడ్డి రూ.3లక్షల చెక్కును సీతక్క సమక్షంలో డొనేట్ చేశారు. ప్రముఖ దైవ ఉపాసకులు దైవజ్ఞశర్మ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పూజామాధవరావు జాడి, డాక్టర్ ధర్మ య్య వెండవెట్ల, డాక్టర్ మాయాదేవి వాగ్మరే, అనిల్‌కుమార్ సల్లూరి, డాక్టర్ ఆనందరావు వాగ్మరే, దేశని జైపాల్‌రెడ్డి, అడ్వైజరీ బోర్డ్ మెంబర్లు ఉస్మానియా ప్రొఫెసర్ డాక్టర్ జాడి మురళీధర్, భరత్ వాగ్మరే, డాక్టర్ జె.నర్సింహారావు పాల్గొన్నారు.

## రాహుల్ ప్రతిపక్ష నేతకావడం పట్ల హర్షం

ప్రజాపక్షం/హైదరాబాద్: పార్లమెంట్‌లో బడుగు బలహీన వర్గాల తరుపున రాహుల్ గాంధీ తన వాణిని వినిపిస్తారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత కావడం పట్ల దేశ ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గాంధీ భవన్‌తో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాశ్మీర్ నుం డి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ త ర్వాత బడుగు బలహీన వర్గాల కుల గణనను చేపట్టాలని నిర్ణయం తీసు కున్నారని చెప్పారు. శుక్రవారం (నేడు) మాజీ ప్రధానమంత్రి పివి నరసింహా రావు జయంతి సందర్భంగా నెక్లెస్ రోడ్ లో ఉన్న ఆయన సమాధి దగ్గరకు అందరూ హాజరు కావాలని హనుమంతరావు కోరారు.

## కేంద్ర మంత్రులకు దత్తాత్రేయ విందు



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కేంద్ర మంత్రులకు ఢిల్లీలోని హరియాణా భవన్‌లో గురువారం ఆ రాష్ట్ర గవర్నర్ బండారు ప్రత్యేక విందు ఇచ్చారు. ఈ సందర్భంగా గవ ర్నర్ బండారు దత్తాత్రేయ కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, కింజారపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మలను ఘనంగా సత్కరించారు.

ప్రజాపక్షం
శుక్రవారం, జూన్ 28

# ఎమర్జెన్సీపై ఎందుకీ రభస

ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో అంతర్గత ఎమర్జెన్సీ విధించి 49 సంవత్సరాలు గడిచిపోయాయి. అభివృద్ధి నిరోధక శక్తుల ప్రమాదాన్ని నిరోధించే పేరుతో1975 జూన్ 25 అర్ధరాత్రి ఎమర్జెన్సీ ఉత్తర్వు జారీ అయింది. పౌరహక్కులు, స్వేచ్ఛలు బంద్ అయినాయి. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు పడ్డాయి. ప్రతిపక్ష నాయకులను జైళ్లలో పెట్టారు. అది రాజ్యాంగబద్ధమైన నిరంకుశపాలన. ఆనాటి పరిస్థితుల గూర్చిన అంచనాపై, ఇందిరాగాంధీ రాజకీయ ఉద్దేశాలపై ఎప్పుడూ భిన్నాభిప్రాయాలున్నాయి. కాని ఆ కాలంలో జరిగిన అకృత్యాలు అన్నివర్గాలనుంచి ఖండనకు గురయినాయి. రాజ్యాంగేతర శక్తిగా అధికారం చెలాయించిన సంజయ్‌గాంధీ విమాన ప్రమాదంలో మరణించాడు. పౌరస్వేచ్ఛల అణచివేత, అకృత్యాలపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తి, రాజకీయ వ్యతిరేకతను గ్రహించిన ఇందిరాగాంధీ 1977 మార్చిలో ఎమర్జెన్సీ ఎత్తివేసి సార్వత్రిక ఎన్నికలు నిర్వహించారు. దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పారు. జయప్రకాశ్ నారాయణ్ సూత్రధారిగా సిండికేట్ కాంగ్రెస్, సోషలిస్టులు, జనసంఘ్, భారతీయ లోక్‌దళ్‌లతో కూడిన జనతాపార్టీకి అధికారం కట్టబెట్టారు. మొరార్జీదేశాయ్ ప్రధానమంత్రి అయినారు. అయితే అంతర్గత తగాదాలతో రెండున్నర సంవత్సరాల్లోపే ఆ ప్రభుత్వం కూలిపోయింది. జనతా పార్టీలో చేరిన జనసంఘ్ ఆర్‌ఎస్‌ఎస్ సభ్యత్వాన్ని వదులుకోవటానికి నిరాకరించటంపై వివాదం చివరి వేటు అయింది. అయితే జనతా పార్టీ ప్రభుత్వం చేసిన ఒక మేలేమిటంటే భవిష్యత్‌లో మరేనేత అంతర్గత ఎమర్జెన్సీ విధించే అవకాశాన్ని కఠినతరం చేస్తూ, రాజ్యాంగానికి 44వ సవరణ చేసింది. 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని తొలగించి "సాయుధ తిరుగుబాటు" అని చేర్చారు. అంటే భారతదేశ భద్రతకు బాహ్యశక్తుల నుండి ప్రమాదం తలెత్తినపుడు –చైనీ దండయాత్ర సందర్భంలో మాత్రమే అత్యవసర పరిస్థితి విధించే అవకాశం ఉంటుంది. అదీ సూక్ష్మంగా చరిత.

ఎమర్జెన్సీ స్వతంత్ర భారత చరిత్రలో చీకటి అధ్యాయంగా విమర్శలకు గురైంది. అది విధించబడిన దినాన్ని ప్రతిఏటా గుర్తుచేసుకోవటంలో ఉద్దేశం పౌరస్వేచ్ఛలు హరించబడిన ఆ కాలం నుండి గుణపాఠాలు తీసుకుని ప్రజలకు అటువంటి దురవస్థ మళ్లీరాకుండా జాగ్రత్తలు తీసుకోవటం. కాని అది విధించిన కాంగ్రెస్ పార్టీని భూతంగా చిత్రించి, ఆ దాడినుండి రాజకీయ లబ్దిపొందేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది. అది గత పదేళ్ల పరిపాలనలో పాల్పడిన ప్రజాస్వామ్య, రాజ్యాంగ ఉల్లంఘనలను, రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలన్న దాని పేరాశను మొన్నటి ఎన్నికల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. సామాన్య ప్రజలకు సైతం రాజ్యాంగం ప్రాధాన్యత అర్థమయ్యేలా చేసింది. దాని పర్యవసానమే ప్రధాని నరేంద్రమోదీ 400 సీట్ల దురాశను ఓటర్లు 240కి కత్తిరించారు. ఇండియా కూటమి ఎంపిలు లోక్‌సభలో ప్రమాణస్వీకారం సందర్భంగా కూడా రాజ్యాంగ ప్రతిని చేబూని దాని పవిత్రతను చాటిచెబుతూ, బిజెపిని దెబ్బపొడిచారు. దీన్నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రధానమంత్రి లోక్‌సభ సమావేశాల ప్రారంభానికి ముందే ఎమర్జెన్సీపై, దాన్ని విధించిన కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. స్పీకర్‌గా రెండోసారి ఎన్నికైన ఓంబిర్లాచేత ఎమర్జెన్సీని ఖండిస్తూ ఏకంగా తీర్మానం ప్రవేశపెట్టించారు. ప్రధాని దాన్ని సమర్థిస్తూ ప్రసంగించారు. ప్రతిపక్షం ఆ అప్రస్తుతప్రస్తావనను సహజంగానే నిరసించింది.

కాంగ్రెస్‌పై దాడికి ఎమర్జెన్సీని ఒక అస్త్రంగా ఉపయోగించే ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ నియమబద్ధపాలన సాగిస్తున్నారా లేక అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తున్నారా ఆలోచించాల్సిన సందర్భం ఇది. ఎమర్జెన్సీనాటి వైపరీత్యాలనే –పత్రికా స్వేచ్ఛపై దాడి, అసమ్మతి వాదులైన పాత్రికేయులు, పౌరసమాజ బృందాలు, ప్రజారంగాల నాయకులపై నిరంకుశ చట్టాల అమలు, బెయిలు కూడా అవకాశంలేని ఉపా రాజద్రోహం కేసుల బనాయింపు, ప్రతిపక్షనాయకుల్లో ఎంచుకున్నవారిపై సిబిఐ, ఇడి, ఐటి దాడులు, అరెస్టులు వగైరా నిర్బంధకాండ అమలు చేయటంలేదా? ఇటువంటి నిరంకుశ పోకడలనే మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు శిక్షించారు. బిజెపిని 303 నుండి 240 సీట్లకు పరిమితం చేశారు. బుద్ధితెచ్చుకుని జాగ్రత్తగా నడుచుకోమని సంకీర్ణ ప్రభుత్వంగా మార్చారు. అయితే మోదీ ప్రవర్తన పాత ఆధిపత్య పెత్తందారీ ధోరణిలోనే సాగుతోంది. రాజకీయ నాయకులకన్నా ప్రజలు తెలివైనవారు, అవకాశం దొరికినప్పుడు గుణపాఠం చెబుతారనే స్పృహ లేకపోతే వారు చావుదెబ్బతింటారు. అందువల్ల చరిత్రలో జరిగిపోయిన తప్పులనుండి గుణపాఠాలు తీసుకుని ప్రజాస్వామ్య బద్ధంగా, రాజ్యాంగబద్ధంగా నడుచుకోకపోతే మాటలగారడీ, డంబాచారప్రచారం, వందిమాగధుల స్తోత్రపాఠాలు వారిని ఎంతో కాలం కాపాడవు.

# లోక్‌సభలో ప్రతిపక్ష నాయకునిపై గురుతర బాధ్యత



పి.డి.టి.ఆచారి
లోక్‌సభ
మాజీ సెక్రెటరీ జనరల్

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు చారిత్రాత్మకమైనవి. ఈ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో ప్రతిపక్షం లోక్‌సభలో ప్రవేశించింది. బహుశా సభ చరిత్రలోనే అతి పెద్దది కావొచ్చు. ప్రతిపక్షం 234 స్థానాలకు పైగా సాధించడంతో లీడర్ ఆఫ్ అపొజిషన్ (ప్రతిపక్ష నాయకుడు – ఎల్ఒపి) అనే చర్చ జీవం పోసుకుంది. గత 16, 17వ లోక్‌సభలలో ప్రతిపక్ష నాయకుడు లేరు. సభలో పార్టీని గుర్తించేందుకు 1950లలో స్పీకర్ ఇచ్చిన నిర్దేశం ప్రకారం కనీసం పది శాతం మంది సభ్యులు ఉండాలి (డైరెక్షన్ 121). పార్లమెంటులో కొన్ని వసతులు కల్పించే విషయంలో పార్లమెంటరీ పార్టీలను గుర్తించేందుకు, కేటగిరిలుగా విభజించేందుకు ఈ నిర్దేశం ఇచ్చారు. దీనికి ప్రతిపక్ష నాయకుడిని గుర్తించే విషయంతో సంబంధం లేదు. తదనంతరం ప్రతిపక్ష నాయకుని వేతనాలు, అలవెన్సుల చట్టం, 1977ను పార్లమెంటు తీసుకుచ్చింది. ఇందులో తొలిసారిగా ప్రతిపక్ష నాయకుడు అనే పదాన్ని నిర్వచించారు. ఇందులో ప్రతిపక్ష నాయకుడు అంటే 'సభలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే అత్యధిక సంఖ్యా బలం కలిగిన పార్టీ నాయకుడు. ఆ విధంగా కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ (రాజ్యసభ) చైర్మన్, హౌస్ ఆఫ్ పీపుల్స్ (లోక్‌సభ) స్పీకర్ గుర్తించాలి' అని పేర్కొనబడింది.

ఈ వివరణ ప్రకారం ఎల్ఒపిగా గుర్తించబడాలంటే రెండు షరతులను పరిపూర్తి చేయాలి. మొదటిది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షంలో అత్యధిక సంఖ్య గలది. రెండవది, ఆ పార్టీని స్పీకర్ పార్టీగా గుర్తించాలి. ముందు చెప్పుకున్నట్లుగా సభలో పది శాతం బలం ఉంటేనే పార్టీగా స్పీకర్ గుర్తిస్తారు. మరో విధంగా చెప్పాలంటే సభలో పది శాతం సంఖ్యా బలం ఉన్న పార్టీ ప్రతిపక్ష నాయకుడి పదవిని కోరవచ్చు. గతంలో స్పీకర్ నిర్దేశం ప్రకారం పది శాతం కంటే తక్కువ సంఖ్య కలిగిన పార్టీని గ్రూపుగా గుర్తిస్తారు. ఆ గ్రూపు ప్రతిపక్ష హోదాను కోరరాదు. 2019 లోక్‌సభలో 52 సభ్యులు కలిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీకి కేవలం ఇద్దరు సభ్యులు తక్కువ పడడంతో ప్రతిపక్ష నాయకుడి పదవి దక్కలేదు.

అయితే, పదవ షెడ్యూలులో చట్టం ప్రకారం పార్టీలను పార్టీలు, గ్రూపులుగా చైర్మన్, స్పీకర్‌లు కేటగిరిలుగా విభజించడం అసంబద్ధం. ఈ షెడ్యూలు ప్రకారం సభలో సభ్యులు సంఖ్యా బలంతో సంబంధం లేకుండా అన్ని పార్టీలను సభలో పార్టీలు అనే అంటారు. 'గ్రూపు' అనే పదాన్ని ఈ షెడ్యూలు గుర్తించదు. ఈ షెడ్యూలుతో పరిశీలించినప్పుడు, సభలో పది శాతం సభ్యుల సంఖ్యా బలంతో సంబంధం లేకుండా అతి పెద్ద ప్రతిపక్ష పార్టీకి నేతృత్వం వహించే వారిని ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ గుర్తించే విధంగా ప్రతిపక్ష నాయకుల చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఏదేమైనప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకుడే ప్రస్తుత 18వ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు.

## వెస్ట్ మినిస్టర్ విధానం

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుని పదవికి గొప్ప రాజకీయ ప్రాధాన్యత ఉంది. బ్రిటీష్ పార్లమెంటరీ సంప్రదాయంలో ఆ పదవిలో ఉన్న వ్యక్తిని ప్రైమ్ మినిస్టర్ ఇన్ వెయిటింగ్ (కాబోయే ప్రధాని) అని పిలుస్తారు. ప్రస్తుత ప్రభుత్వం కూలిపోతే ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఆయనే ఏర్పాటు చేసే అవకాశం ఉన్నందునే అక్కడ అలా పిలుస్తారు. అందుకే ఎల్ఒపి తన పార్టీ సహచరులతో షాడో క్యాబినెట్‌ను ఏర్పాటు చేస్తారు. వెస్ట్ మినిస్టర్ (బ్రిటీష్) ప్రభుత్వ విధానంలో ఇదొక ఆసక్తికర అంశం. షాడో క్యాబినెట్ ను ఏర్పాటు చేసుకునే ప్రతిపక్ష నాయకుడినే షాడో ప్రైమ్ మినిస్టర్ అని అంటారు. ఈ సంప్రదాయంలో ప్రభుత్వ విధానాలు, చర్యలను షాడో క్యాబినెట్ నిశిత పరిశీలన చేస్తూ, ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదిస్తుంది. వాస్తవ క్యాబినెట్‌లో ప్రతి మంత్రిని ప్రతిబింబంలా ఇంకో ప్రతిపక్ష సభ్యుడు వెన్నంటే పరిశీలిస్తాడు కాబట్టే షాడో క్యాబినెట్ అని అంటారు. షాడో క్యాబినెట్‌లోని ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వ కార్యకలాపాలను సంపూర్ణంగా అవగతం చేసుకొంటారు. వారు ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధిత సమాచారమంతటిని కోరవచ్చు. మనం వెస్ట్ మినిస్టర్ వ్యవస్థనే అనుసరిస్తున్నప్పటికీ పార్లమెంటులో లేదా శాసనసభలలో షాడో క్యాబినెట్ విధానం ఉనికిలో లేదు. భారతీయ పార్లమెంటులో 1977 నుండి ప్రతిపక్ష నాయకుడి (ఎల్ఒపి) పదవికి చట్టబద్ధత కలిగి ఉంది. సంప్రదాయంగా, సభలోని ప్రతిపక్షాలలో మంచి గౌరవం, విస్తృత ఆమోదం కలిగిన ప్రధాన ప్రతిపక్షంలోని సీనియర్ సభ్యుడే ఎల్ఒపి అవుతుంటారు.

> 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నిక రాజకీయ వాతావరణంలో, సభ సంఖ్యాబలంలోనూ పెను మార్పులను తీసుకువచ్చింది. లోక్‌సభలో ప్రతిపక్షానికి ఇంత పెద్ద సంఖ్యాబలం ఉండడం ఇదే తొలిసారి కావొచ్చు. ప్రతిపక్ష బెంచిలలో 234కు పైగా సభ్యులు ఉండడం ద్వారా సభ దాదాపు సరిసమానంగా విభజించబడింది. ఇది నిస్సందేహంగా ప్రతిపక్ష ధైర్యాన్ని అనేక ఇంతలు పెంచడమే కాకుండా, సభను నడిపించడంలో ప్రభావితం చేస్తామనే విశ్వాసాన్ని పెంచింది.

## 2024లో చోటుచేసుకున్న మార్పులు, సవాళ్ళు

భారత పార్లమెంటులో ప్రతిపక్షం ఏకరూపంలోనే, ఒకే పార్టీగానో ఉండదు. ప్రతిపక్షంలో వైవిధ్యమైన సిద్ధాంతాలు, కార్యక్రమాలు కలిగిన బహుళ పార్టీలు ఉంటాయి. కాబట్టి ప్రతిపక్ష నాయకుడి పాత్ర సవాళ్ళతో కూడుకున్నది. ఆయనకు అధికారం లేకపోవడమే అతి పెద్ద సమస్య. అధికారంలో ఉన్న పార్టీకి ఇతర పార్టీలు ఆకర్షితులవడం, అధికార పంపిణీ ద్వారా కూటమిని సమిష్టిగా ఉంచడం సులభం. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపై వ్యతిరేకతనే వారిని కలిపి ఉంచుతుంది. కొన్ని పరిస్థితులలో ప్రభుత్వాన్ని దింపేయవచ్చనే ఆశనే ప్రతిపక్షాల సంఘటితాంశంగా ఉంటుంది. నిజానికి సంప్రదాయంగా ప్రతిపక్ష పాత్ర అనేది ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం, విమర్శించడం, దాని స్థానాన్ని కైవసం చేసుకోవటం. గడిచిన పదేళ్ళలో ప్రభుత్వానికి గంభీరమైన సవాలు విసరలేని బక్కచిక్కిన ప్రతిపక్షాన్ని లోక్‌సభ చూసింది. అధికార పక్షం అనుభవించిన భారీ మెజారిటీ, దాని భయంకర విన్యాసాలతో భయపడిన ప్రతిపక్షం పలు మార్లు నిస్సహాయంగా ఉండిపోయింది. కానీ, 2024లో జరిగిన సాధారణ ఎన్నిక రాజకీయ వాతావరణంలో, సభ సంఖ్యాబలంలోనూ పెనుమార్పులను తీసుకువచ్చింది. లోక్‌సభలో ప్రతిపక్షానికి ఇంత పెద్ద సంఖ్యాబలం ఉండడం ఇదే తొలిసారి కావొచ్చు. ప్రతిపక్ష బెంచిలలో 234కు పైగా సభ్యులు ఉండడం ద్వారా సభ దాదాపు సరిసమానంగా విభజించబడింది. ఇది నిస్సందేహంగా ప్రతిపక్ష ధైర్యాన్ని అనేక ఇంతలు పెంచడమే కాకుండా, సభను నడిపించడంలో ప్రభావితం చేస్తామనే విశ్వాసాన్ని పెంచింది. ప్రశ్నలకు అనుమతించడం, సమాధానాలలో సమాచారం, బిల్లులపై చర్చలు, ధన్యవాద తీర్మానం వంటి సాధారణ చర్చలు, జీరో అవర్, వాయిదా తీర్మానాలు, బిల్లుల నిశిత పరిశీలన కోసం కమిటీలకు పంపడం వంటి అనేక అంశాలలో ప్రతిపక్ష సంఖ్యాబలం కచ్చితంగా ప్రతిబింబిస్తుంది.

ప్రతిపక్షంలోని నూతన భావన(మానసిక స్థితి)ని ప్రతిపక్ష నాయకుడు అందిపుచ్చుకొని సభలో తన అభిప్రాయాలను మరింత ప్రభావశీలంగా వ్యక్తీకరించాలి. పద్దెనిమిదవ లోక్‌సభలో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతిపక్షాల ఐక్యతను కొనసాగించాల్సిన గురుతర బాధ్యత ఆయనపై ఉంది. ప్రైమ్ మినిస్టర్ ఇన్ వెయిటింగ్ ( కాబోయే ప్రధాని)గా వాస్తవాల ఆధారంగా ప్రభుత్వ వైఫల్యాలను దేశానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష నాయకుడిలో ఉండాలి. సభా చర్చల్లో ఆయనకు ప్రాధాన్యత ఉంటుంది. ముందస్తు నోటీసు ఇవ్వకుండానే ఏదైనా అంశంలో జోక్యం చేసుకునేందుకు వీలుగా ప్రతిపక్ష నాయకుడిని స్పీకర్ అనుమతించే ఆమోదయోగ్యమైన పార్లమెంటరీ సంప్రదాయం కలిగి ఉన్నాము. గంభీరమైన అంశాలపై చర్చలు జరుగుతున్న సందర్భాలలో సభలో ప్రధానమంత్రి ఉండాలని ఆయన డిమాండ్ చేయవచ్చు. బ్రిటీష్ సంప్రదాయం ప్రకారం ప్రతిపక్ష నాయకుడికి కీలకమైన విధానాలపై ప్రధాన మంత్రి ముందస్తుగా సమాచారం ఇస్తుంటారు. తద్వారా ప్రధాన మంత్రి, ప్రతిపక్ష నాయకుడి మధ్య సమాచార వారధి ఎల్లప్పుడూ తెరిచే ఉంటుంది.

## గతకాలపు పాఠాలు ఉన్నాయి

భారతదేశంలో కూడా ఇలాంటి ఆరోగ్యకరమైన సంప్రదాయాలను అనుసరించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయవచ్చు. జవహర్‌లాల్ నెహ్రూ అలాంటి సంప్రదాయాలను సృష్టించారు. ప్రశ్నోత్తరాల సమయంలో దాదాపు ప్రతి రోజు సభకు హాజరవడం, మంత్రులు ఇచ్చే సమాధానాలు సమగ్రంగా లేవని భావించినప్పుడు ఆయనే స్వయంగా సమాధానం ఇవ్వడం వంటివి అవలంభించేవారు. ప్రతిపక్షాల నాయకులకు ఎక్కువ సమయం ఇవ్వాలని స్పీకర్‌ను స్వయంగా నెహ్రూ కోరడమే కాకుండా, వారి ప్రసంగాలను వినేందుకు సభలోనే కూర్చునేవారు. తనకు ప్రతిపక్ష సభ్యుల ద్వారానే దేశంలోని వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని, నిత్యం తనను పొగడడమే తప్ప వాస్తవాలు మాట్లాడని తన స్వంత పార్టీ సభ్యుల నుండి కాదని నెహ్రూ పలు మార్లు అంటుండేవారు. అలాంటి ప్రాథమిక దశల నుండి భారతీయ పార్లమెంటు ఎదిగింది. కొత్త పార్లమెంటేరియన్‌లు గతం నుండి నేర్చుకొనేందుకు, అనుసరించేందుకు ఎంతో ఉంది. గతాన్ని పరిత్యజించడం మనల్ని ఎక్కడికీ తీసుకెళ్ళ లేదు. అసమ్మతి పట్ల అసహనం అనేది ఎన్నడూ ఆ సంప్రదాయంలో భాగం కాదు. పార్లమెంటులో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించేందుకు రాజకీయ వర్గానికి భారతదేశ ప్రజలు ఒక గొప్ప అవకాశాన్ని కల్పించారు. పార్లమెంటును సాధారణ పరిస్థితుల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అధికార పక్షానికి నిరంతరం గుర్తు చేయడమే ప్రతిపక్ష నాయకుని ప్రధాన విధి.

> ప్రతిపక్షాల నాయకులకు ఎక్కువ సమయం ఇవ్వాలని స్పీకర్‌ను స్వయంగా నెహ్రూ కోరడమే కాకుండా, వారి ప్రసంగాలను వినేందుకు సభలోనే కూర్చునేవారు. తనకు ప్రతిపక్ష సభ్యుల ద్వారానే దేశంలోని వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని, నిత్యం తనను పొగడడమే తప్ప వాస్తవాలు మాట్లాడని తన స్వంత పార్టీ సభ్యుల నుండి కాదని ఆయన పలు మార్లు అంటుండేవారు. అలాంటి ప్రాథమిక దశల నుండి భారత పార్లమెంటు ఎదిగింది.

(ది హిందూ సౌజన్యంతో)

# సూడాన్‌లో ఆకలి కేకలు



ఖార్టూమ్: సూడాన్‌లో ఆకలి కేకలు పెరుగుతున్నాయి. తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొనడంతో, కనీసం 25 మిలియన్ల మందికిపైగా ప్రజలకు పస్తులు తప్పడం లేదు. మానవతా సాయం అందించాలని ఇక్కడ పర్యటించిన ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు నివేదికను సమర్పించాయి. ఇప్పటికే దేశం కరువు కోరల్లో చిక్కుకుందని, త్వరలోనే ఆకలి మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ఈ నివేదిక హెచ్చరించిది. తరచు రాజకీయ సంక్షోభం, అనిశ్చితి, తిరుగుబాటు, హింస, అంతర్యుద్ధాలతో అట్టుడికే సూడాన్‌లో ఉత్పత్తి రంగం దారుణంగా దెబ్బతిన్నది. వ్యవసాయం పడకేసింది. నిరుద్యోగం పెచ్చరిల్లింది. ఆదాయ వనరులు లేక, పేదరికం నుంచి బయటపడలేక లక్షలాది మంది అల్లాడుతున్నారు. గత సంవత్సరం ఏప్రిల్ మాసంలో సూడాన్ తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. సైన్యానికీ, పారా మిలటరీ దళాలకూ మధ్య సుమారు 14 నెలలపాటు పోరు కొనసాగింది. ఐక్యరాజ్య సమితి వెల్లడించిన వివరాల ప్రకారం కనీసం 14,000 మంది పౌరులు మృతి చెందారు. వేలాది మంది గాయపడ్డారు. అటు సైన్యం, ఇటు పారామిలటరీ కూడా ఆహారాన్ని ఆయుధంగా మార్చుకొని యుద్ధం చేయడంతో, కరువు పరిస్థితులు తప్పలేదు. కనీసం 11 మిలియన్ల మంది తమ ఇళ్లను వదిలి పారిపోవాల్సి వచ్చింది. మానవతా సాయాన్ని అందించడానికి ముందుకు వచ్చిన ఐక్యరాజ్య సమితి ప్రతినిధులనుగానీ, వివిధ దేశాల నుంచి వచ్చే సామాజిక కార్యకర్తలనుగానీ అనుమతించకపోవడంతో, ప్రజలకు సాయం లభించలేదు. కనీస అవసరాలు కూడా లభించక, ప్రజలు ఎదురుతిగడం, ప్రభుత్వం అడ్డుకోవడం నిత్యకృత్యమైంది. ఈ ఘర్షణ హింసాత్మక ఘటనలకు దారి తీసింది. సైన్యం, పారామిలటరీ దళాల మధ్య జరిగిన ఆధిపత్య పోరాటం సూడాన్ ప్రజలను ఆకలి కోరల్లోకి నెట్టేసింది. ఇప్పుడు అంతర్యుద్ధం సమాప్తంకాగా, ఆకలితో ప్రజలు యుద్ధం చేయాల్సిన దుస్థితి నెలకొంది. వారిని ప్రభుత్వం ఆదుకోవడం లేదు. నిత్యం చోటు చేసుకుంటున్నహింస కారణంగా అంతర్జాతీయ సాయం కూడా అంతంతమాత్రంగానే అందుకున్నది. సూడాన్‌కు వెళ్లాలంటే, భయపడే వాతావరణం నెలకొంది. ఇటీవల సూడాన్‌లో పర్యటించిన ఐక్యరాజ్య సమితి ప్రతినిధి బృందం తన నివేదికలో ఆందోళనకరమైన అంశాలను ప్రస్తావించింది. కోట్లాది మంది ప్రజలను ఆహార కొరత అల్లాడిస్తుందని ఆ నివేదిక స్పష్టం చేసింది. సాయం అందకపోతే, కరువు కోరల్లో చిక్కుకొని సూడాన్ ఉక్కిరిబిక్కిరవుతుందని, ఫలితంగా అంతర్యుద్ధం తలెత్తే ప్రమాదం ఉందని వివరించింది. మానవతా సాయాన్ని అందించాలని ఐక్యరాజ్య సమితిని కోరింది. మిలటరీ.. పారామిలటరీ... ప్రభుత్వం... వీటి మధ్య ఆధిపత్య పోరాటానికి ఆహారం ఒక అస్త్రంగా మారడం దారుణం. సూడాన్‌లో ఆకలి కేకలు మిన్నంటకూండా అంతర్జాతీయ సమాజమే ఆదుకోవాలి.

# పల్లెల్లో ప్రబలుతున్న అతిసార

ఆరోగ్యము మనిషి ప్రాథమిక హక్కు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యముగా ఉండాలి, ఆరోగ్యముగా ఉండడానికి ప్రయత్నించాలి, మంచి ఆరోగ్య పరిసరాలను కల్పించుకోవాలి. ఆరోగ్యంగా ఉండమని ఇతరులకు సలహా ఇవ్వాలి. అతిసార వ్యాధిని అంగ్ల భాషలో డయేరియా అంటారు. అతిసార వ్యాధి మామూలుగా వైరస్ వల్ల వస్తుంది. రెండు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలిగిన పిల్లలకు రోటా వైరస్ వల్ల వస్తుంది. ఇదే అతిసార వ్యాధితో పాటు నెత్తురు పడితే 'డీసెంట్రీ' అంటారు. పిల్లలో మృత్యువుకు ఇది అతి ముఖ్యమైన కారణం. డీసెంట్రి వివిధ రకాలైన బ్యాక్టీరియా, ప్రోటోజోవాల ద్వారా వల్ల వస్తుంది. కలరా కూడా ఒక రకమైన అతిసార వ్యాధి.రోగి బ్రతికితే డయేరియా చస్తే కలరా అంటారని సామెత. వరల్డ్ హెల్త్ ఆర్గనైసేషన్ ప్రకారం ఒక మనిషి రోజులో మూడు లేక అంత కంటే ఎక్కువ సార్లు వదులుగా వీరేచనాలు చేసుకుంటే దానిని అతిసారం అంటారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలలో మరణానికి అతిసార వ్యాధి రెండవ ప్రధాన కారణం. ప్రతి సంవత్సరం అతిసారం వలం 760 000 ఐదు సంవత్సరాల లోపు శిశువులు మరణిస్తున్నారు. అతిసార వ్యాధి సురక్షిత నీరు తాగుతూ, పరిశుభ్రత పాటించడం వలన నివారించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది దాదాపు 1.7 బిలియన్ అతిసార వ్యాధి కేసులు నమోదవుతున్నాయి. డయేరియా ఐదేళ్ల లోపు పిల్లల్లో పోషకాహార లోపానికి అతిసారం ప్రధాన కారణం అవుతుంది. రోటా వైరస్, అస్ట్రో వైరస్, నార్ వ్యాక్ వైరస్, పికోర్నా వైరస్ మాములుగా కల్గిస్తాయి. డీసెంట్రీ కలిగించే బాక్టీరియాలు, ఈ.కోలై ( హీమోరేజిక్ సబ్ స్పీసీస్ 0H 157), క్యామపైలోబ్యాక్టర్ జెజెనై, సాల్మొనెల్లా జాతులు, షిగెల్లా. ఇవన్నీ నీటి కలుశితాల ద్వారా సంక్రమిస్తాయి. శుద్ధి లేని నీటిలో ఈ విరస్లు వృద్ధి చెందుతాయి. డ్రైనేజీ కాల్వలు పొంగి పొర్లుతున్నాయి, నలభై శాతం రోడ్లు మురుగునీటితో తడిసి ముద్దవుతున్నాయి. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, శుచి శుభ్రతలేని రెస్టారెంట్లు, ఏండ్ల తరబడి శుభ్రం చేయని మంచి నీటి ట్యాంకులు, కలుషిత ఆహారం డయేరియాకు ప్రధాన కారణం. ప్రజలకు మంచి ఆహార అలవాట్లు, ఆరోగ్య అలవాట్లు లేకపోవడం. ఏ పద్ధతిలో ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలనే ప్రయత్నం చేస్తున్నారో అర్థం కాని ప్రభుత్వాలు పాలించడం గమనార్హం. ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేశామన్న ప్రకటన లు తప్ప ఆచరణ సాధ్యం కాలేదు. నేటికీ సగటు గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు, ఆర్థికంగా వెనక పడ్డ జిల్లాలు రాష్ట్రాలలో ప్రస్తుతం ప్రజల ఆరోగ్య ఎలా ఉంది వాళ్ళ అవసరాలు, నిధుల కేటాయింపు జరిగిన దాఖలాలు ఎక్కడా లేదు. పట్టణ ప్రాంతాలలో కార్పొరేట్ ఆసుపత్రుల లో వైద్యం పేదలకి అందని ద్రాక్ష, ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు లేక రోగిని వెక్కిరిస్తాయి. రోగికి వైద్యుడికి సంబంధం లేనట్టుగా ఉంటుంది. తాను చెప్పిందే వేదం అన్నట్లుగా తాను చేసింది వైద్యం అన్న చందంగా సాగిపోతోంది. అసలు రోగి సమస్య ఏమిటి ఏ వైద్యం చేస్తున్నారు, చికిత్స తరువాత రోగి స్థితి ఏమిటి అన్నదే ప్రశ్న? నిండు గర్భిణి వచ్చినా నొప్పులు పడుతున్న తమకు పట్టదన్నట్లు జిల్లా ఆసుపత్రి కి తీసుకు పోవాలని సూచిస్తారు, జిల్లా ఆసుపత్రికి వెళితే బెడ్లు లేవని వేరే ఆసుపత్రికి తీసుకు పోవాలని సూచిస్తారు. జిల్లా కేంద్రంలో వెలసిన సర్వజన ఆసుపత్రులలో గైనిక్ వార్డుల్లో ప్రతి మంచానికి ఇద్దరు గర్భిణీలు, ఇద్దరు బాలింతలు ఉంటున్నారు. గైనిక్ వార్డ్ సందర్శకులు తాకిడితో కిటకిట లాడుతున్నది. అడ్మిషన్ అయిన గర్భవతులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పేద ప్రజలు, వీరిలో చాల మందికి రక్తహీనత ఉంటున్నది. సిజరిన్ చేయడానికి వీరికి కావాల్సిన రక్తం చాల సందర్భాలలో అందుబాటులో ఉండడం లేదు. గత రెండు సంవత్సరాలుగా కళాశాలల్లో రక్త సేకరణ జరగక పోవడంతో బ్లడ్ బ్యాంక్ లో రక్తం కొరత ఉన్నది ప్రైవేటు బ్లడ్ బ్యాంకులే శరణ్యం. చాల బోధనాసుపత్రులల్లో డయాగ్నస్టిక్ యూనిట్లు లేవు. ఎంఆర్ఐ, సిటి స్కాన్ వసతి లేదు. గ్రామీణ ఏజెన్సీలలో పరిస్థితి మరీ దారుణం. సమయానికి వైద్యులు అందుబాటులో ఉండరు, మందులు ఉండవు. ముఖ్యంగా సీజన్ వస్తున్న దోమతెరలు ఇవ్వరు. రోడ్డు ప్రమాదాలు జరిగిన అత్యవసర వైద్యం లేదా శస్త్ర చికిత్స చేయడానికి వైద్యులు ఉండరు. కనీసం పురుడు పోయడానికి డాక్టర్స్ ఉండరు.అక్కడ ఆరోగ్య కేంద్రాలలో కనీస సౌకర్యాలు లేవని ఒక ఆరోగ్య కేంద్రానికి ఒకే డాక్టర్ ఉన్నారు. కనీసం మందులు కూడా లేవని కేంద్రానికి నివేదిక ఇచ్చినా చేసింది లేదు. పాండమిక్ తర్వాత అయినా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం పై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. కార్పొరేట్ కు దీటుగా ప్రభుత్వ ఆరోగ్య సేవలు మాటలకే పరిమితం అయ్యాయి. అటు ప్రభుత్వ ఆసుపత్రికి పోలేక ఇటు ప్రైవేట్ ఆసుపత్రులకు పోలేక సగటు మధ్య తరగతి ప్రజలకు మీరు చేసింది ఏమిటి? చేస్తున్నది ఏమిటి? చేయాలనీ అనుకున్నది ఏమిటి? రోగి కళ్యాణ్ సమితి (రోగి సంక్షేమ కమిటీ)/హాస్పిటల్ మేనేజ్మెంట్ కమిటీ ఒక సాధారణ సామర్థ నిర్వహణ వ్యవస్థ. ఈ కమిటీ, ఒక నమోదిత సంఘము. ఆస్పత్రులు మరియు వాటి వ్యవహారాలను చూసుకోవడానికి ట్రస్టీగా పనిచేస్తుంది. దీనిలో స్థానిక పంచాయతీ రాజ్ సంస్థలు, స్వచ్ఛంధ సంస్థలు, స్థానిక ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. వీరు ఆస్పత్రి/కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ల సరైన కార్యాచరణ మరియు నిర్వహణకు బాధ్యులుగా ఉంటారు. రోగి కళ్యాణ్ సమితి ద్వారా మందుల ఉత్పత్తి మరియు సులువైన పనితీరుకు అనుగుణంగా నిధులు పెంచడం మరియు వాటిని ఉపయోగించడం చేయగలరు. పాలక మండలి సమావేశాలు త్రైమాసికంలో కనీసం ఒకసారి చైర్పర్సన్ నిర్ణయించిన సమయం మరియు ప్రదేశంలో నిర్వహించాలి.

డాక్టర్. ఎం. సురేష్ బాబు,
అధ్యక్షులు, ప్రజా సైన్స్ వేదిక

# వానాకాలం.. జబ్బులతో జాగ్రత్త!?

మొన్నటి దాకా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేసి ఉడికించిన వేసవి కాలాన్ని తరిమేస్తూ చల్లటి చిరుజల్లులతో పలకరించే వానాకాలం ఉరుములు, మెరుపులతో వస్తుంటే! ఎవరికి మాత్రం ఆనందంగా ఉండదు. అయితే మనకే కాదు ఇది జబ్బులకూ ఆహ్లాదకరమైన కాలమే. కానీ ఈ కాలంలో డెంగ్యూ, న్యుమోనియా, మలేరియా, వాంతులు, విరోచనాలు, కామెర్లు వంటి ఎన్నో జబ్బులు విజృంభిస్తుంటాయి. చాలా వరకు ఇవి మామూలుగా తగ్గిపోయే సీజనల్ వ్యాధులే. అయినా కొందరికి ప్రమాదకరంగానూ మారొచ్చు. మధుమేహం, అధిక రక్తపోటు వంటి జబ్బులతో బాధపడే వారికి, వృద్ధులకు, పిల్లలకు, గర్భిణులకు కొన్నిసార్లు ప్రాణాంతకంగానూ పరిణమించవచ్చు. కాబట్టి వానాకాలంలో దోమలు విజృంభన, బెడద నుంచి బయట పడటానికి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత చాలా అవసరం. కనీస జాగ్రత్తలు తప్పనిసరి అవసరం. వ్యాధుల బారిన పడ్డాక భాదపడే కంటే సత్వరం స్పందిస్తే తీవ్రం కాకుండా చూసుకోవచ్చు. మిగతా కాలాలతో పోలిస్తే వర్షాకాలంలో రెండు రెట్లు ఎక్కువగా జబ్బుల బారిన పడుతుంటారు జనం. వయసుతో నిమిత్తం లేకుండా పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు ఎంతోమంది ఆస్పత్రుల్లో చేరటం చూస్తుంటాం. ఈ కాలంలో వాతావరణం మారటమే కాదు కలుషితమయ్యే నీరు, ముసురుకొచ్చే దోమల దండుతో వచ్చే జబ్బులు చాలా ఎక్కువ. అంతేనా! అప్పటికే ఉన్న కొన్ని జబ్బులు తీవ్రం కావచ్చు. ఎందుకంటే వర్షాకాలంలో వాతావరణం మారటం శ్వాసకోశ వ్యవస్థ మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. శ్వాస మార్గాలు సంకోచించడం వల్ల అలర్జీలు, ఆస్తమా, సైనసైటిస్, సీవోపీడీ వంటి సమస్యలు ఉధృతం అవుతాయి. అలాంటి సమస్యలతో బాధపడేవారు ముందే డాక్టర్ ను సంప్రదించి మందులు మోతాదులను సరిచేసుకోవాలి. మరో ముఖ్య విషయం ఆస్తమా, సైనసైటిస్ వంటి సమస్యలు ఉధృతమై చాలా మందికి జలుబు వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు రావటం జరుగుతుంది. ఈ ఇన్ఫెక్షన్లను నిర్లక్ష్యం చేస్తే, సరైన చికిత్స తీసుకోకపోతే తీవ్రమయ్యే ప్రమాదం ఉందని గమనించాలి. కాబట్టి ఈ వానాకాలంలో అకాల వర్షాలతో బయటికి వెళ్లి తడిసి రావడం మూలంగా, రోజుల తరబడి విరామం లేకుండా వర్షాలు కురుస్తుండడంతో వరద నీటి ద్వారా నీటి వనరులు కలుషితమౌతాయి. డ్రైనేజీ వ్యవస్థ స్తంభించడంతో మురుగు నీటిలో దోమలు పెరుగుతాయి. తాగునీరు కలుషితమవుతుంది. వర్షాకాలం ప్రవేశిస్తున్న తరుణంలో ఇలాంటి పరిణామాలు పరిపాటే?. అయినా ప్రభుత్వాలు, స్థానిక, పురపాలక, నగర(మహా)నగరపాలక సంస్థలు డ్రైనేజీ వ్యవస్థల్లో పూడికతీత(బ్లాకు)లు లేకుండా చేస్తూ, వర్షపు నీటి వరద సాఫీగా వెళ్లేలా(మురుగు నీరు నిల్వకుండా) చూడవలసిన అవసరం ఉంది. తాగునీరు కలుషితం కాకుండా చూడవలసిన బాధ్యత ఆయా సంస్థలపై ఉంది.

ముఖ్యంగా ప్రభుత్వాలు, వైద్య ఆరోగ్య, పారిశుద్ధ్య శాఖలు దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంది. అలాగే మరోవైపు ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖలను అప్రమత్త పర్చాల్సి ఉంది. ఎందుకంటే ఆ కలుషితమైన నీరు తాగడం, దోమల విజృంభించిన వాతావరణ పరిస్థితుల మూలంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఒక్కొక్కసారి గూడాలకు గూడాలే డెంగ్యూ ఫీవర్, గ్రామాలకు గ్రామాలే వ్యాధులతో మంచం పట్టిన రోజులు చాలా ఉన్నాయి. ఇవి జిల్లా కేంద్రాలకు దూరంగా ఉండటంతో నాణ్యమైన వైద్య సేవలు సత్వరమే అందించడం కష్టం. ముందస్తు జాగ్రత్త చర్యలే తక్షణ రక్షణ. గత అనుభవాల దృష్ట్యా చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం లేదని గమనించండి.

ప్రపంచవ్యాప్తంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు 85 దేశాలను పీడిస్తూ ఉన్నాయి. ఏటా 70 కోట్ల మంది వీటి బారిన పడుతున్నారు. అందులో 7.25 లక్షల మంది చనిపోతున్నారు. భారత దేశంలో దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ ,గున్యా, జికా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. మన దేశంలో ఏటా నాలుగు కోట్ల మంది దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల బారిన పడుతున్నారు. 4 లక్షల మంది ప్రాణాలు కోల్పోతూ ఉన్నారని అంచనా. ఇది వానాకాలం కావడంతో వర్షాలు మొదలు కాగానే దోమల తాకిడి పెరుగుతుంది. వీటి బెడదను వదిలించేందుకు రకరకాల ప్రయత్నాలు ప్రభుత్వాలు చేస్తుంటాయి. ఈ క్రమంలో భారత్ కు చెందిన ఒక అంకుర సంస్థ వినూత్న ఆలోచనతో ముందుకు వచ్చింది. నీటిలో దాగున్న దోమల లార్వాలను పసిగట్టేందుకు అధునాతన గూఢచర్య, నిఘా ఉపగ్రహ పరిజ్ఞానాన్ని ఉపయోగించింది. ఈ జీవులకు చౌకలో సమర్థంగా చెక్కు పెట్టడానికి ఇది ఉపయోగపడుతుందని, నిఘా ఉపగ్రహ పరిజ్ఞానంతో దోమలను లార్వా దశలోనే గుర్తించి మట్టు పెట్టడానికి ఇది ఉపయోగ పడుతుందని చెపుతున్నారు. ఎక్కడెక్కడ నిలిచి ఉండే నీటిలో దోమలు గుడ్లు పెట్టి వాటి సంతతిని పెంచి మానవుల్లోకి అనేక వ్యాధులను వ్యాప్తి చేస్తాయో, ఆ ప్రదేశాలను కాలువలు, చెరువులు, ట్యాంక్ లు మురుగు నీటి ప్రాంతాలను గుర్తించి కీటక నాశనాలను ప్రయోగిస్తే లార్వా దశలోనే దోమల వ్యాప్తి అరికట్టవచ్చు అంటున్నారు. ఇలా కోల్కతా కి చెందిన శశిధర్ రాడార్ అనే అంకుర సంస్థ యొక్క అధునాతన హైపర్ స్పెక్ట్రల్ ఇమేజింగ్ టెక్నాలజీ ఉపయోగ పడుతుందని అంటున్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ మాజీ డైరెక్టర్ తపన్ మిశ్రా దీనిని స్థాపించారు. ఆయనకు భారత నిఘా ఉపగ్రహ పితామహుడుగా పేరుంది. దోమల లార్వాలు నిర్దిష్టంగా ఎక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించి విస్తరణకు విరుగుడు చేయవచ్చు. తద్వారా మలేరియా, డెంగ్యూ మరణాలను తగ్గించుకోవచ్చు. దీనివల్ల బోలెడు ప్రయోజనాలు ఉన్నాయి. మరోవైపు ప్రస్తుతం దోమల నివారణకు మందులను విచక్షణా రహితంగా ఎక్కడపడితే అక్కడ పిచికారి చేస్తున్నారు. ఫలితంగా సంబంధిత నీటి వనరులు విషతుల్యమవుతున్నాయి.

మేకిరి దామోదర్,
9573666650

## నీట్ పరీక్షలను రద్దు చేయాలి




ప్రజాపక్షం/దేవరకొండ: కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢీల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొని పేపర్ లీకేజికి కేంద్ర విద్యశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని తెలంగాణ రాష్ట్రానికి చెందిన నల్గొండ పార్లమెంట్ సభ్యులు రఘువీర్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వంశీకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు శివసేనా రెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గౌని రాజా రమేష్‌యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్, కిన్నెర హరికృష్ణ, నాగరాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణం విధుల్లోకి కార్మికులు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులను ఇంచార్జీ పేర్లతో వచ్చిన అధికారులు అకారణంగా తొలగించడంపై కార్మికులు జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర కాళ్లమీద పడి సారూ తమను తొలగించి తమ పొట్టను కొట్టొద్దంటూ వేడుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గత 18 సంవత్సరాలకు పైగా పారిశుద్ధ్య, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విధులు నిర్వహిస్తూ చాలీ చాలని వేతనాలతో కుటుంబాలు గడుపుకుంటున్నామని ఆసుపత్రిలో విధుల నుంచి తొలగించడం వల్ల తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన ఆరుగురు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వేడుకొన్నారు. దీనికి స్పందించిన జెసి సంబంధిత అధికారులకు కార్మికులను తొలగించినవారిపై విచారణ జరిపి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తొలగించిన కార్మికులు డి.మల్లిక, కె.ప్రమీల, నస్రీన్, చంద్రకళ, కళమ్మ, బలరాంలున్నారు.

**తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : ఎఐటియుసి**

ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించేందుకు నియమించిన అధికారులు పారిశుద్ధ్య కార్మికులను కారణాలు చూపకుండా అకారణంగా తొలగించడం సరికాదని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆసుపత్రిలో తొలగించిన ఆరుగురు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## థర్మల్ పవర్ స్టేషన్ సందర్శన



ప్రజాపక్షం /దామరచర్ల (మిర్యాలగూడ ) : యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సందర్శించారు. పనుల పురోగతిపై ఆయన వైటిపిఎస్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. పనులు జరిగే ప్లాంట్‌కు వెళ్లి ప్రత్యక్షంగా పనులను పరిశీలించారు. థర్మల్ పవర్ స్టేషన్‌కు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తక్షణమే పరిష్కరించాలని మిర్యాలగూడ ఆర్‌డిఓ శ్రీనివాసరావును ఆదేశించారు. వైటిపిఎస్‌కు సంబంధించి భూసేకరణ బకాయిలు ఉన్నట్లయితే చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ఆర్డీవోను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌తో పాట వైటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ సమ్మయ్య, మిర్యాలగూడ ఆర్‌డిఓ శ్రీనివాసరావు, వైటిపిఎస్ డిఎస్‌పి తదితరులు ఉన్నారు.

**వేగవంతం ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి**

ధరణి, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం దామరచర్ల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ధరణి దరఖాస్తుల పరిష్కారంతోపాటు, ప్రజావాణి పిటిషన్ల పరిష్కారాన్ని పరిశీలించారు. అంతేగాక తహసిల్దార్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సంరక్షించడంలో తహసిల్దార్ చొరవను అభినందించారు. ముఖ్యంగా ఆరు కోట్ల రూపాయల విలువ చేసి ప్రభుత్వ భూమి చుట్టూ కంచవేసి రక్షణ చర్యలు చేపట్టడం పట్ల ఆయన అభినందించారు. జిల్లా కలెక్టర్ వెంట మిర్యాలగూడ ఆర్‌డిఓ శ్రీనివాసరావు, దామరచర్ల తాసిల్దార్ జవహార్ లాల్ తదితరులు ఉన్నారు.

## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక





ప్రజాపక్షం/ శాలిగౌరారం : శాలిగౌరారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని 2024–2025 సంవత్సరానికి గాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డెంకల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మారోజు వెంకటాచారి, కోశాధికారిగా వద్ల కొండ బిక్షం, ఉపాధ్యక్షులుగా చామల మహేందర్ రెడ్డి, రాపాక రాజు, సలహాదారులురామడుగు వెంకట్రామశర్మ, ఆకవరం అశోకచారి, నిమ్మల ఆంజనేయులు,లీడర్ షిఫ్ మెంబర్‌గా గుజిలాల్ శేఖర్ బాబు, మెంబర్ షిప్ మెంబర్‌గా చిర్రబోయిన శ్రీనివాస్, సర్వీస్ మెంబర్‌గా బచ్చు ఆంజనేయులు, మార్కెటింగ్ మెంబర్‌గా మురారిశెట్టి కరుణాకర్, ఎక్స్ టెన్షన్ మెంబర్‌గా యంగలి రామకృష్ణ, మహిళా ప్రతినిధిగా యారాల పద్మ , ఎల్సిఐఎఫ్ కోఆర్డినేటర్ గా మారం వేణుగోపాల్ రెడ్డిలు ఎన్నికయ్యారు.ఈ ఎన్నికల కార్యక్రమం లో లయన్స్ పెద్దలు ఎర్ర శంబులింగా రెడ్డి , రావిరాల అశోక్, బాణాల రాంరెడ్డి, గంట అంజిరెడ్డి, బుడిగె శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ చేపట్టాలి

ప్రజాపక్షం/మోటకొండూరు : జర్నలిస్టుల ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ చేపట్టాలని జర్నలిస్ట్ యూనియన్ మండల కమిటీ అధ్యక్షులు గట్టికొప్పుల శ్రీనివాస్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు పేరుకు మాత్రమే ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చి పంపిణీకి నోచుకోకపోవడం చాలా బాధాకరం అన్నారు. ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య వెంటనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తూ పంపిణికి శ్రీకారం చుట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కంది చంద్రకళ, జిల్లా కార్యదర్శి గుర్రాల నాగరాజు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ వర్సెస్ ప్రభుత్వ డాక్టర్లు



ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి : జిల్లా జనరల్ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులకు, జిల్లా కలెక్టర్‌కు వార్ నడుస్తుంది. ఆసుపత్రికొచ్చే పేదలకు మెరుగైన వైద్యం.. సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టిన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిపై ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, ప్రొఫెసర్లు, వైద్య సిబ్బంది తమపై పెత్తనం చెలాయించేందుకు క్యాడర్ లేని అధికారులను నియమించడం ఏమిటని వైద్యులు, వైద్య సిబ్బంది విధులను బహిష్కరించి గురువారం నిరసనకు దిగారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ గత ఐదు రోజుల క్రితం అకస్మికంగా తనిఖీ చేసి రోగులకు వైద్యులు అందించే వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కనీసం తాగడానికి నీళ్లు లేక రోగులు పడుతున్న ఇబ్బందులను చూసి మరుసటి రోజు వైద్యులు, ప్రొపెసర్లు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించేందుకు రోజుకొక అధికారి తనిఖీ చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై వైద్య అధికారులు తీవ్ర నిరసన తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గురువారం జిల్లా జనరల్ ఆసుపత్రిని సందర్శించడానికి వెళ్లడంతో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, ప్రొఫెసర్లు విభాగాల అధిపతులతో మాట్లాడారు. కేవలం ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పన సేవలపై మాత్రమే జిల్లా అధికారులు పరిశీలన చేసి సమాచారం ఇచ్చేందుకు జిల్లా యం త్రాంగం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, అంతేకానీ డాక్టర్లు, ప్రొఫెసర్ల పనితీరు వారి వృత్తిపై కాదని ,అలాగే వారిపై ఎలాంటి నియంత్రణ అధికారాలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఓపి, స్పెషాలిటీ వార్డులకు సంబంధించి డాక్టర్ల హాజరు రిజిష్టర్ల పరిశీలన మాత్రమే చేయమని ఉత్తర్వులలో పేర్కొనడం జరిగిందని, డాక్టర్లకు సంబంధించి వారి వృత్తికి సంబంధించి వారిపై ఎలాంటి ప్రశ్నలు అడగడం, లేదా ఇతర నియంత్రణకు ఎవరికి అధికారం ఇవ్వలేదని పేర్కొన్నారు. జిల్లా అధికారులకు ఇచ్చిన ఉత్తర్వులు సైతం కేవలం వీటన్నిటి పై పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ప్రొఫార్మా డిజైన్ చేసి చెక్ లిస్ట్ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. డాక్టర్ల గదు లు వారి సేవలపై ఎలాంటి తనిఖీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. హాజరు విషయం తప్ప డాక్టర్స్‌పై తనిఖీకి ఉత్తర్వులలో ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిత్యానంద, డిసిహెచ్‌ఓ డాక్టర్ మాతృ నాయక్ ఉన్నారు.

## పాత గుట్ట అభివృద్ధికి ప్రభుత్వ విప్ సహకారం



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంతో రోడ్డు అభివృద్ధికి తన యందు సహకారం పూర్తిగా ఉంటుందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. యాదగిరిగుట్టలో హరి నివాసంలో సిపిఐ, ఎఐటియుసి టాంగా కార్మికులతో కలిసి సంయుక్తంగా గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అదేవిధంగా స్వామివారిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు ప్రయాణం సులభతరంగా ఉండేందుకు తాత్కాలికంగా రోడ్డుపై మట్టి పోయిస్తానన్నారు. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ విప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు బండి జంగమ్మ, జిల్లా కమిటీ సభ్యుడు బబ్బూరి శ్రీధర్, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, మహిళ సమాఖ్య మండల అధ్యక్షురాలు ఆరె పుష్ప, పార్టీ మండల కార్యవర్గ సభ్యులు మాటూరి మల్లయ్య, రాయిగిరి బాలకిషన్, టాంగా కార్మిక సంఘం అధ్యక్షులు కళ్ళం కాటం, గుండు అంజయ్య, కొన్ని ముత్యాలు, నోముల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి కల్వర్టుతో వరద నీరు

**నేరుగా వ్యవసాయ బావిలోకి వెళ్లేలా నిర్మించిన వైనం**

**వరద నీటికి కూలిన వ్యవసాయ బావి**




ప్రజాపక్షం/శంకరపట్నం : కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామ శివారులో నిర్మించిన జాతీయ రహదారి కల్వర్టు నిర్మాణంతో వరద నీరు వ్యవసాయ బావులకు చేరుతోంది. ముందస్తుగా సరైన ప్లాన్ లేకుండా నిర్మించడంతోనే నష్టం జరుగుతోందని బాధిత రైతులు వాపోతున్నారు. ఈ మేరకు జాతీయ రహదారి కల్వర్టు నిర్మాణంతో నేరుగా వ్యవసాయ బావిలోకి వరదనీరు చేరి కూలిపోయిందని గ్రామ రైతులు హుజురాబాద్ ఆర్డీవో రమేష్‌కు ఫిర్యాదు చేశారు. కొత్తగట్టు గ్రామ శివారులోని సాయిని కుంట వద్ద సర్వే నెంబర్ 231లో నీలం నాగయ్య, నీలం రాజయ్య, నీలం కనకయ్య, నీలం సమ్మయ్య, నీలం సారయ్య అనే అన్నదమ్ములకు 8 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 231 సర్వే నెంబర్లు జాతీయ రహదారి పక్కనే భూమి ఉండగా ఇందులో ఈ అన్నదమ్ములకు వ్యవసాయ బావి ఉంది. 5 గురు కలిసి రెండు వ్యవసాయ మోటార్లు బిగించి కనెక్షన్ తీసుకున్నారు. కొన్నేళ్లుగా ఈ బావి నుంచి 8 ఎకరాలకు సాగునీరు అందిస్తూ పంటలు పండించుకుంటున్నారు. జాతీయ రహదారి నిర్మాణ సంస్థకు చెందిన అధికారులు, కాంట్రాక్టర్ ముందు చూపు లేకుండా బావిలోకి వరద చేరే విధంగా కల్వర్టును నిర్మాణం చేశారు. ఇటీవల కురిసిన వర్షం దాటికి బావిలోకి వరద చేరి కూలిపోయింది. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తిరిగి వరద నీరు చేరి బావి కూలడంతో పాటు వ్యవసాయ బావిలో ఉన్న మోటార్లు మట్టిలో కూరుకుపోయాయి. సుమారు రెండు వ్యవసాయ మోటార్లకు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. వరద నీరు రాకుండా కల్వర్టును వేరే ప్రాంతంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. బావిని, విద్యుత్ మోటార్లకు మరమ్మత్తు చేసుకునేందుకు పరిహారం ఇప్పించాలని ఆర్డీవోను వేడుకున్నారు.

## 1 నుండి అమల్లోకి నూతన చట్టాలు




ప్రజాపక్షం/నల్లగొండ : దేశ వ్యాప్తంగా జులై ఒకటో తేదీ నుండి అమలులోకి రానున్న నూతన చట్టాల పట్ల ప్రతి ఒక్క పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. నూతన చట్టాలపై జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి దశల వారీగా నిర్వహించిన శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జులై 1వ తేది నుండి దేశవ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకు అనుగుణంగా కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహి, భారతీయ నాగరిక్ సురక్ష సంహి,భారతీయ సాక్ష్యా అధినియం 2023 పూర్తి అవగాహన కలిగి ఉన్నపుడే సమర్ధవంతంగా విధులు నిర్వహించగలమని పేర్కొన్నారు. కొత్త చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన రావాలంటే ప్రతి ఒక్కరిలో నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రాములు నాయక్, ఎస్‌బి డిఎస్‌పి రమేష్, నల్లగొండ డిఎస్‌పి శివ రాంరెడ్డి, డిసి ఆర్‌బి డిఎస్‌పి సైదా, సిఐలు రాఘవరావు, కరుణాకర్, మహాలక్ష్మయ్య, సైదులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



## అల్ఫోర్స్ ఇ టెక్నోలో హౌస్ ఎలక్షన్స్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : నగరంలోని కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ ప్రాంగణంలో పాఠశాల హౌజ్ ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఏర్పాటు చేసిన హౌజ్ ఎలక్షన్స్ ప్రక్రియ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం లాంటి ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు కీలకంగా వ్యవహరిస్తాయని, ఎన్నికల ద్వారానే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు పర్చగలుగుతామని, ప్రజలకు కావాల్సిన అభివృద్ధి ఫలాలను చాలా సులభంగా అందజేయవచ్చన్నారు. ఎన్నికల వాతావరణం తలపించే విధంగా పాఠశాలలో పోలింగ్ స్టేషన్, పోలింగ్ కేంద్రం, పోలింగ్ ఆఫీసర్, ఓటింగ్ యంత్రం, రిటర్నింగ్ అధికారి, తదితర అంశాలను తెలియపరిచారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికై ప్రతి సంవత్సరం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలోని తేజస్, సరస్, ధృవ, లక్ష్య విభాగాలకు విద్యార్థులకు వేర్వేరుగా ఎన్నికల పోటీలను నిర్వహించడం జరిగిందని తెలుపుతూ విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని నింపడానికై, శక్తి సామర్థ్యాలను పెంపొందించడానికి ప్రత్యేకంగా సామాజిక స్పృహను కల్పించడానికి ఎన్నికలను అట్టహాసంగా నిర్వహించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది ఔత్సాహికులు వారి ఉత్సాహాన్ని ప్రదర్శించి పోటీలో పాల్గొని కేటాయించిన గుర్తులను ప్రచారం చేసుకుని ఓట్లను అభ్యర్థించారు. ప్రత్యేకంగా వారు ప్రదర్శించిన ఓటు విలువైన హక్కు , ఓటు వేయకపోతే కోల్పోతాం మన హక్కు నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఓట్లను లెక్కించడం జరుగుతుందని, గెలుపొందిన వారికి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రమాణ స్వీకారం చేయించడం జరుగుతుందని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విధ్యార్థులున్నారు.

## అందుబాటులోకి ఎనర్జీ ఛార్జెస్ కాలుక్యులేటర్

**నెలవారీ విద్యుత్ బిల్లులపై విద్యుత్ శాఖ చర్యలు**

**టిఎస్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖి**




ప్రజాపక్షం/హైదరాబాద్ : నెలవారీ విద్యుత్ బిల్లుల జారీకి విద్యుత్ శాఖ పలు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎనర్జీ ఛార్జెస్ కాలుక్యులేటర్‌ను ఇక అందుబాటులోకి తెస్తోంది. దీని ప్రకారం నెల రోజులకు మీటర్ రీడింగ్ నమోదు చేసి జారీ చేయాల్సిన విద్యుత్ బిల్లు కొన్ని సందర్భాల్లో రెండు మూడు రోజుల ఆలస్యంతో రీడింగ్ తీయడం కారణంగా పలు సమస్యలు ఎదురవుతున్నాయి. అలా ఆలస్యంగా బిల్లులు తీస్తున్న కారణంగా ఆ నెలలో వినియోగించిన యూనిట్లు పెరిగి స్లాబ్ రేటు మారడంతో అధిక బిల్లులు వస్తున్నాయని కొందరు వినియోగదారుల్లో అపోహ ఉంది. నెల రోజులకే విద్యుత్ శాఖ అధికారులు దాదాపు 99.5 శాతం బిల్లులు ఇస్తుంటారు. అలా కాని పక్షంలో వినియోగదారులు నష్టపోవద్దనే ఉద్దేశంతో రీడింగ్ తీసిన రోజులతో సంభంధం లేకుండా కేవలం నెల రోజులకే బిల్లులు జారీ చేసేలా స్పాట్ బిల్లింగ్ మెషిన్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. గృహ వినియోగదారుల విద్యుత్ వాడకం బిల్లుకు సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకునేందుకు గాను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ టిజి ఎస్‌పిడిసిఎల్ తమ వెబ్ సైట్ టిజి సౌతర్న్ పవర్. ఓఆర్‌జి వెబ్ సైట్ ( https://tgsouthernpower.org ) లో ఎనర్జీ ఛార్జెస్ కాలుక్యులేటర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ కాలుక్యులేటర్ లో తమ బిల్లులో పొందుపరిచిన రీడింగ్ తీసిన తేదీలు, మీటర్ రీడింగ్ వివరాల నమోదు ద్వారా బిల్లింగ్ రోజులు, టారిఫ్ వంటి వివరాలు పొందవచ్చు. విద్యుత్ వినియోగదారుల సహాయార్థం సంస్థ వెబ్ సైట్ www.tgsouthernpower.org hotlinksలో ఎనర్జీ ఛార్జెస్ కాలుక్యులేటర్‌ను డొమెస్టిక్ ఛార్జెస్‌ను పొందు పరిచాం. దీనితో పాటు సంస్థ మొబైల్ యాప్‌లో కూడా ఈ సదుపాయం పొందుపరచనున్నామని, దక్షిణ తెలంగాణ పంపిణి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖి ఐఏఎస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లోని రెండు పంపిణి సంస్థల టారిఫ్ ఒకేలా ఉంటుందని వెల్లడించారు. కావున ఉత్తర డిస్కం వినియోగదారులకు సైతం ఉపయోగ పడుతుందని ముషారఫ్ ఫరూఖీ ప్రజాపక్షంకు తెలిపారు. ఎనర్జీ ఛార్జెస్ కాలుక్యులేటర్ ఇక అందుబాటులోకి వచ్చిక క్రమంలో వినియోగదారులు ఇక అపోహలు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ విధానం వల్ల విద్యుత్ బిల్లులు కరెక్టుగా వస్తాయని తెలిపారు. వేసవి ముగిసి వర్షాకాలం వస్తున్న క్రమంలో ఇప్పటికే నిరంతర విద్యుత్ సరఫరాపై ఫోకస్ పెట్టామని తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు సహా అన్ని రకాల మరమ్మతు కార్యక్రమాలను చేపడుతున్నామని వెల్లడించారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సరఫరా విషయంలో ఇప్పటికే తమ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, అటు వినియగోదారులు కూడా తమ శాఖకు పూర్తిగా సహకరించాలని కోరారు.

# ఐదెకరాల ప్రభుత్వ భూమి హాంఫట్!

**ఒకే కుటుంబంలో**

**రెండు నుండి ఐదారుగురికి స్థలాల కేటాయింపు**

**భూ కేటాయింపులపై కలెక్టర్ సీరియస్**



ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి: తలదాచుకునేందుకు గజం స్థలం లేక ఏళ్ళ తరబడి నుండి నిరుపేదలు తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా ఏ నాడు పాలకులు కనికరించలేదు. నాటి నుండి నేటి వరకు పాలకపక్ష ప్రజాప్రతినిధులు పేదలను విస్మరిస్తూ తమకు అనుకులమైన వారికి అక్రమ మార్గంలో ప్రభుత్వ ఆస్తులను కట్టబెడుతున్నారు. ఇలాంటి యదార్థ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడలో చోటు చేసుకుంది. రూ. 25కోట్ల విలువైన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని జీవో నెంబర్ 58,59ని అడ్డం పెట్టుకోని ఏకంగా 90 మందికి అధికారులు అనర్హులకు కట్టబెట్టారు. గత ప్రభుత్వ పెద్దల అండదండతోనే ఇలా చేసినట్లు తెలింది. ఒకే కుటుంబంలో రెండు నుండి ఐదారుగురికి స్థలాలు కేటాయించారు. ఇంత కాలం గోప్యంగా ఉన్న ఈ విషయం బయటకు పొక్కడంతో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ దీనిపై సీరియస్ అయ్యి అధికారులను విచారణకు ఆదేశించారు.

సూర్యాపేట జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని కుడకుడ 126 సర్వే నెంబర్‌లో మొత్తం 90 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంత భూమిని స్వాతంత్ర సమరయోధులకు అధికారులు కేటాయించారు. ఎంతో మంది పేదలు తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఏళ్ళ తరబడి నుండి పాలకులకు మొరపెట్టుకుంటున్నారు. వారు ఏ మాత్రం కనుకరించకపోవడంతో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పలుమార్లు కుడకుడలోని 126 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ స్థలంలో గుడిసేలు వేశారు. అయిన వారికి ఇవ్వలేదు. ఈ లోపు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావడంతో పాటు సూర్యాపేట జిల్లా కేంద్రం కావడం చకచకా జరిగిపోయాయి. సూర్యాపేట పట్టణం హైద్రాబాద్ విజయవాడ ప్రధాన రహదారికి సమీపంలో ఉండడంతో ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఏ మాత్రం పనికి రాకుండా పడావుపడ్డ భూములు కూడా ఎకరానికి కోట్ల రూపాయల ధర పలుకుతుంది. పేదలకు ఈ భూమిని పంపిణీ చేసేందుకు పానం ఒప్పని పాలకులు దానిపై కన్నేసి తాము అనుకున్న వారికి ఐదు ఎకరాల భూమిని 90 మందికి అప్పనంగా కట్టబెట్టారు. ఇదంతా జరిగి ఏడాది అవుతున్నా పాలకులు, అధికారులు దీనిని బయటికి పొక్కకుండా జాగ్రత్త పడ్డారు.

**జీవోలను అడ్డం పెట్టుకోని**

**అనర్హులకు కేటాయింపు**

58, 59 జీవోలను అడ్డం పెట్టుకోని నాటి అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు అధికారులు వారు సూచించిన వారికి స్థలాలు కేటాయించినట్లు బట్టబయలైంది. అధికారులు ఈ రెండు జీవోల ప్రకారం వారికి రెగ్యూలరైజేషన్ చేసినట్లుగా చెబుతున్నారు. ఈ జీవోలు ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన స్థలాలలో ఇండ్ల నిర్మాణం చేసుకోని ఇంటి నెంబరు పొంది విద్యుత్ మీటరు ఉన్న వాటిని క్రమబద్ధీకరించాల్సి ఉంది. కాని ఇక్కడ అధికారులు మాత్రం ప్రభుత్వ నిబంధనలు ఏ మాత్రం పట్టించుకోకుండా ఖాళీ స్థలాలనే రెగ్యూలరైజేషన్ చేయడం గమనార్హం. అధికారులు కేటాయించిన 90 మందిలో అత్యధికంగా బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలే ఉన్నారు. 59 జీవో ప్రకారం ఒక్కోక్కరికి దాదాపు 300 గజాల నుండి 400 గజాల వరకు అప్పనంగా కట్టబెట్టారు. జీవో నెంబర్ 58 ప్రకారం 120 గజాలను ప్రభుత్వ అధికారులు ఇవ్వడం జరిగింది. అధికారులు చేసిన స్థలాల కేటాయింపులో కోట్లకు పడగలెత్తిన కుడకుడ గ్రామానికి చెందిన ఓ బిఆర్ఎస్ నాయకుడు(రియల్ ఎస్టేట్ వ్యాపారి) తన తండ్రి పేరున స్థలం తీసుకున్నాడు. ఓ ప్రజాప్రతినిధి ఇంటి వద్ద కుక్కలా కాపలా కాసిన సూర్యాపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన చోటా కార్యకర్తకు రెండు స్థలాలు కేటాయించారు. తాను వ్యక్తిగతంగా పెట్టుకున్న ప్రైవేట్ పిఆర్ఓకు పెన్‌పహాడ్ మండల కేంద్రంతో పాటు కుడకుడ 126 సర్వే నెంబర్‌లో స్థలాన్ని కట్టబెట్టారు. ఇది ఇలా ఉంటే చివ్వెంల మండలంలోని ఓ రేషన్ డీలర్ తన సతీమణి గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఆమెకు కూడా స్థలాన్ని కేటాయించారు. ఆ ప్రజా ప్రతినిధికి స్వంత బంధువు అయిన నల్గొండ జిల్లాకు చెందిన వ్యక్తికి కూడా ఇక్కడ స్థలం కేటాయించడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. కొంత మంది ప్రజాప్రతినిధులు బయటపడకుండా అక్రమ మార్గంలో తమకు అనుకులమైన వారి పేరున స్థలాలను పొందారు. ఇది ఇలా ఉంటే తనకు అనుకులమైన మీడియా ప్రతినిధులకు కూడా అక్రమమార్గంలో లక్షలు విలువ చేసే భూములను అప్పనంగా కట్టబెట్టాడు. బిఆర్ఎస్ స్వంత పత్రికకు చెందిన పలువురు పాత్రికేయులు, తనకు అనుకూలంగా వార్తలు రాసే వారికి 59 జీవో ప్రకారం స్థలాలను కేటాయించడం గమనార్హం. వీరంతా గతంలో ఇందిరమ్మ కాలనితో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వం నుండి భూములు పొందిన వారే. మరో పాత్రికేయుడు ఏకంగా రెండు స్థలాలు పొందడంతో పాటు తమ స్వంత అక్కకు రెండు, బాబాయికి ఒకటి, పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న తన బావకు ఒక స్థలాన్ని అధికారులు కేటాయించడం ఏలా సాధ్యమైందని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

**భూ కేటాయింపులపై కలెక్టర్ సీరియస్**

**విచారణ చేపట్టిన అధికారులు**

అధికారులు ఇన్ని రోజులు దాచిపెట్టిన భూ కేటాయింపుల వివరాలు సోషల్ మీడియాలో వెలుగు చూశాయి. దీంతో ప్రతి ఒక్కరు ఆశ్చర్యానికి గురి చేసింది. శాసన సభ ఎన్నికల ముందు లబ్ది చేకూరాలనే ఆశతో బిఆర్ఎస్ నేతలు ఈ స్థలాల కేటాయింపులు జరిపి గోప్యంగా ఉంచినట్లు తెలుస్తుంది. దీనిపై నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సీరియస్ అయ్యారు. ఈ విషయమై తక్షణమే విచారణ చేపట్టాలని ఆర్‌డిఓ వేణుమాధవ్‌ను ఆదేశించారు. దీంతో ఆయన ఆయా మండలాల సర్వేయర్లను తీసుకోని 126 సర్వే నెంబర్‌లోని భూమిని సందర్శించి సమగ్ర విచారణ నిర్వహిస్తున్నారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా విచారణ కొనసాగుతుందని ఇది ముగియగానే కలెక్టర్‌కు తమ నివేదికను అందిస్తామన్నారు.

# సాకారం కానున్న దశాబ్దాల కల

### భూ తల్లిని ముద్దాడిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అనేక దశాబ్దాల కల, ఎన్నో సమరశీల పోరాటాలు గోదారమ్మ నీళ్ల కోసం ఎదురు చూసిన ఉమ్మడిజిల్లా భూ తల్లి ఎట్టకేలకు కల సహకార మయ్యే దశలో మొదటి అడుగు విజయవంతమైంది. గోదారమ్మ నీళ్లు కాలువల్లోకి పరుగులు పెట్టాయి. సీతారామ ప్రాజెక్టు మొదటి పంపు ట్రయల్ రన్ గురువారం విజయవంతమైంది. మోటార్ ఆన్ చేయగానే ఒక్కసారిగా గోదారి నీళ్లు పంపు హౌజ్ నుంచి కాలువల్లోకి ఎగిసిపడ్డాయి. అశ్వాపురం మండలం మొండికుంట గ్రామ పంచాయితీ భీముని గుండం కొత్తూరు (బిజి కొత్తూరు) వద్ద ఏర్పాటు చేసిన మోటర్లలో మొదటి మోటార్‌ను ఆన్ చేసి నీళ్లను వదిలారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ట్రయల్ రన్ నిర్వహించారు. ట్రయల్ రన్ సక్సెస్ కావడంతో ఉమ్మడి ఖమ్మంజిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో ఆనందం ఉప్పొంగింది. దుమ్ముగూడెం వద్ద ఎత్తిపోతల పథకాన్ని ఏర్పా టు చేసి ఉమ్మడి ఖమ్మంజిల్లాకు సాగు నీటిని అందించాలన్నది దశాబ్దాల కల. దుమ్ముగూడెం వద్ద ప్రాజెక్టును నిర్మించాలని భారత కమ్యూనిస్టు పార్టీ దుమ్ముగూడెం సాధన కోసం అనేక దశాబ్దాల పాటు పోరాడింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దుమ్ముగూడెంకు శంకుస్థాపన చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తదనంతర పరిణామాల నేపథ్యంలో సీతారామ పేరుతో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. అశ్వాపురం మండం దుమ్మొగూడెం ఆనకట్ట సమీపంలో కుమ్మరిగూడెం నుంచి గ్రావిటి ద్వారా గోదావరి జలాలను నాలుగు కిలో మీటర్ల దూరంలోని బిజి కొత్తూరుకు తరలించారు. బిజి కొత్తూరు వద్ద పంపు హౌజ్‌ను ఏర్పాటు చేసి అక్కడి నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఒక్కొక్కటి 250 హెచ్‌పి గల ఆరు మోటార్లను ఏర్పాటు చేశారు. తొలి మోటార్‌ను ఆన్‌చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ ఏడాది సీతారామ ద్వారా తొలి దశలో 1.50 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ట్రయల్ రన్ విజయవంతమైన విషయం తెలియగానే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బిజి కొత్తూరుకు చేరుకుని ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. గోదావరి నీళ్లు కాలువలోకి ఎగిసి పడుతున్న సమయంలో ఆయన గోదావరి జలాలకు నమస్కరించి అక్కడి భూతల్లిని ముద్దాడారు. తుమ్మల మాట్లాడుతూ అనేక దశాబ్దాల ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజల కల అతి త్వరలో నెరవేరబోతుందనిఆనందం వ్యక్తం చేశారు. గోదావరి జలాలను సాగు భూములకు అందించాలనేది అనేకదశాబ్దాలుగా సాగుతున్న వ్యవహారమని సీతారామ రూపంలో విజయవంతమైందనితెలిపారు. ట్రయల్ రన్ విజయవంతమైన సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా తదితరులు బిజి కొత్తూరు పంపు హౌజ్‌ను పరిశీలించారు.

## జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** టియుడబ్ల్యుజె (ఐజేయూ) రాష్ట్ర నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షునిగా గాడిపల్లె మధు, కార్యవర్గ సభ్యులుగా కంకణాల సంతోష్, పెండెం వేణుమాధవ్ లకు చోటు దక్కిన సందర్భంగా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) వరంగల్, హన్మకొండ జిల్లా, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సంయుక్తంగా గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీలో మన జిల్లా నుంచి ప్రాతినిధ్యం దక్కటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ పటిష్టతకు కృషి చేయాలని, జర్నలిస్టుల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందించాలని, జర్నలిస్టులకు అందుబాటులో ఉండాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు పీవీ మదన్‌మోహన్, గడ్డం కేశవమూర్తి, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు సంగోజు రవి, కొండం రవీందర్‌రెడ్డి, నార్లగిరి యాదగిరి, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రాంచందర్, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, యూనియన్ నాయకులు సాయిరాం, దుర్గాప్రసాద్, అల్లం రాజేష్‌వర్మ, పొడిశెట్టి విష్ణువర్ధన్, నయీంపాషా, మంచాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళాశక్తి దిశగా జనగామ అడుగులు

### కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** జనగామ జిల్లా మహిళా శక్తి దిశగా ఎదిగి ఆదర్శవంతంగా నిలవాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో అన్ని మండలాల సిసిలు, ఎపిఎంలు, వీఓలకు మహిళా శక్తి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ మహిళలకు జీవనోపాధి కల్పించాలి, వారిని మరింత శక్తివంతులుగా తీర్చిదిద్దడానికి ప్రోత్సహించడానికే ప్రభుత్వం మహిలా శక్తి పథకాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లాలోని 12 మండలాల్లో 466 మంది విఓలు, 11వేల 201 స్వయం సహాయ సంఘాలు, లక్షా 25వేల 716 మంది స్వయం సహాయ సభ్యులు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు వివిధ రంగాల్లో ఉపాధి కల్పనలో అభివృద్ధి సాధించిన సిసిలు వీఓలను కలెక్టర్ అభినందించారు. ప్రధానంగా ఏ లబ్ధిదారులైనా మహిళా సంఘంలో తప్పనిసరిగా సభ్యులుగా ఉండాలని, ఏ పథకంలో అయినా సరే బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు మంజూరు అవుతాయన్నారు. మైక్రో ఎంటర్‌ప్రైస్ యూనిట్ల ఏర్పాటు కింద ప్రతి ఒక్కక వీఓ లక్ష్యాల వారిగా 25 మందిని గుర్తించి మూడు రోజుల్లోగా నివేదికను సమర్పించాలని ఆదేశించారు. అలాగే స్వయం సహాయక సంఘాల అకౌంటింగ్ యాప్ లోనూ సబంధిత పూర్తి వివరాలను నమోదు చేయాలని, దీనికి రెండు లక్షల రుణం వరకు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా శక్తి పథకం కింద సంఘంలో లేని 1800 మంది మహిళలను లక్ష్యాల వారిగా స్వయంగా సహాయ సంఘాల్లో చేర్పించాలన్నారు. డిఆర్‌డిఓ మొగులప్ప, డివిహెచ్‌ఓ ఎస్‌ఎల్ మనోహర్, ఏపిడి శ్రీనివాసరావు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు, ఎపిఎంలు, డిపిఎంలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** ప్రసాద్ స్కీంలో భాగంగా మంజూరైన ఇంటర్ ప్రేటేషన్ సెంటర్ పనులలో వేగం పెంచాలని సంబంధిత టూరిజం శాఖ ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర ఆదేశించారు. గురువారం వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని ప్రసాద్ స్కీంలో మంజూరైన ఇంటర్ ప్రేటేషన్ సెంటర్ నిర్మాణ పనులను, రామప్ప దేవాలయ ఈస్ట్ రోడ్డు, మెయిన్ రోడ్డు, రిజర్వాయర్ బండ్ లను జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరితగతిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. రామప్ప దేవాలయం తూర్పు ద్వారం ఎదురుగా 10 ఎకరాల స్థల విస్తీర్ణంలో 61.99 కోట్ల రూపాయలతో గ్లాస్ వర్క్‌తో కూడిన ఫుడ్ కోర్టు అలంకారాలతో కూడిన సావనీర్ స్టాల్స్ (9 స్టాల్స్) టాయిలెట్ బ్లాక్ 2, సెక్యూరిటీ క్యాబిన్ 2, కాంపౌండ్ వాల్, అలంకార గేట్లు పరికరాలతో ఫౌంటెన్ నిర్మాణం, అలంకారంతో వంపు(కాకతీయ శైలి) సంప్ నిర్మాణం పనులలో వేగం పెంచాలని టూరిజం శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ రామప్ప సరస్సును సందర్శించి నీటి నిల్వ సామర్థ్యం ఆయకట్టు తదితర అంశాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల ప్రత్యేకాధికారి శ్రీపతి, నీటి పారుదలశాఖ డిఈ రవీందర్‌రెడ్డి, టూరిజం శాఖ డిఈ రామకృష్ణ, ఏఈ విజయ్, తహసీల్దారు సదానందం, ఎంపిడిఓ రాజు, ఎంపిఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/మహబూబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో కృష్ణ కాలనీలో లండన్ కిడ్స్ స్కూల్ దగ్గర నుండి శ్రీ చైతన్య స్కూల్ దగ్గర వరకు నిర్మిస్తున్నడ్రైనేజీ పనులను నేడు కౌన్సిలర్లు బి.అజయ్ సారధి రెడ్డి, బి.నీరజారెడ్డి ధర్మన్న పరిశీలించారు.సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధిరెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్ బి.నీరజారెడ్డిమాట్లాడుతూ మురుగునీరు వర్షంతో వచ్చే వరద నీరును నియంత్రించడానికి సీసీ డ్రైవర్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణకోసం 36వ వార్డులో సీసీడ్రైనేజీలుఏర్పాటు చేపిస్తున్నట్టు తెలిపారు. 36వ వార్డులో అభివృద్ధి అదేవిధంగా సంక్షేమపథకాలు ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్టుపేర్కొన్నారు. మెతుకు కుమార్ కార్తీక్, మహిపాల్‌రెడ్డి, యాకుబ్ సోమేశ్వర్, ఐలయ్య, దామోదర్ రెడ్డి, కాంట్రాక్టర్ రాజేష్, పెరుగుకుమార్ ఉన్నారు.

## వరంగల్ సమగ్రాభివృద్ధికి కృషి

### రాష్ట్ర అటవీ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

### సీఎం వరంగల్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** గత బీఆర్‌ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన వరంగల్ సమగ్రాభివృద్ధికై సీఎంకు పలు సమస్యలను నివేదిస్తామని రాష్ట్ర అటవీ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గురువారం హన్మకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. అంతకుముందు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులతో జిల్లాలో సీఎం పర్యటన సందర్భంగా తీసుకుపోవాల్సిన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం విలేఖరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి అయిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి తొలిసారి వరంగల్ పర్యటనకు వస్తున్న సందర్భంగా పెండింగ్ పనులతో పాటు కొత్తగా చేపట్టాల్సిన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళతామన్నారు. ముఖ్యంగ వరంగల్ నగరానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజి సిస్టం అమలు, నూతన మాస్టర్ ప్లాన్,స్మార్ట్ సిటీ కింద చేపట్టాల్సిన పనులు, మామునూరు ఏయిర్‌పోర్టు విషయం, నగరానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజి సిస్టంతో పాటు అండర్ గ్రౌండ్ కేబుల్, వాటర్ సిస్టం విషయాలను తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అలాగే వరంగల్ జిల్లా గీసుకొండలో చేపడుతున్న మెగా టెక్స్‌టైల్ పార్కును సీఎం తొలుత సందర్శించనున్నారని, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించనున్నారని తెలిపారు. అలాగే వరంగల్ నగరంలో చేపడుతున్న 24 అంతస్తుల అతిపెద్ద ఆసుపత్రి పనులను కూడా పరిశీలించి, దాని డిజైన్, వివరాలను అడిగి తెలుసుకుంటారని, వాస్తవానికి ఆ ప్రాంతంలో నిభందనల ప్రకారం 12 అంతస్తుల భవనం మాత్రమే నిర్మించాల్సి ఉన్నా 24 అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని, అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు. కాళోజి కళాక్షేత్రం పనులను తనిఖీ చేసి దానికి అవసరమైన పెండింగ్ నిధులను విడుదల చేసేందుకు జరుగుతున్నపనులను పరిశీలిస్తారని తెలిపారు.గతంలో వరంగల్ మునిసిపాలిటీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏట 300కోట్ల నిధులు ఇస్తామన్నమాట నిలబెట్టుకోలేదని, తమ ప్రభుత్వంలో నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సీఎంను కోరతామని చెప్పారు. నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.

## 'జయశంకర్'ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జిల్లాను అభివృద్ధిలో అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో మీడియాతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా, ప్రజలు, ప్రజాప్ర తినిధులు, ప్రభుత్వ సిబ్బంది సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి కృషి చేస్తానని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యా ప్రమాణాలు పెరుగుదలకు పాఠశాలలపై పర్యవేక్షణ పెంచుతామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చేపట్టిన పనులు పూర్తయ్యేలా చొరవ చూపుతామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను బలోపేతం చేసి పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి వైద్యంపై ప్రజలకు నమ్మకం పెంపొందిస్తామని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో తెలంగాణ దయాగ్నోస్టిక్స్ ద్వారా ఉచిత వైద్య పరీక్షలు ప్రజలు వినియోగించు కునేలా అవగాహన కల్పిస్తామని అన్నారు.వర్షాకాలంలో వరద ప్రభావిత ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి మండల వారిగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నామని తెలిపారు. పాత్రికేయులు కలెక్టరేట్ ముందుకేటాయించిన స్థలాల్లో ఇండ్లు నిర్మాణానికి విద్యు త్ సౌకర్యం కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో పాత్రికేయుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని, అర్హులైన పాత్రికేయులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిపిఆర్వో శ్రీనివాస్, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## 23 లక్షల మంది విద్యార్థులకు అండ




**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** దేశ రాజధాని ఢిల్లీలో 23 లక్షల విద్యార్థులకు అండగా పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బివి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్రంలో బిజేపీ ప్రభుత్వం అనేక అవకతవకలకు పాల్పడుతోందని, నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో బిజేపీ ఎంపీలు, ఎంఎల్ఎల కుటుంబ సభ్యులకోసం లీక్ చేసినందుకు నిరసనగా బుధవారం జంతర్ మంతర్‌లో మహా ధర్నా నిర్వహించి, అనంతరం పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు జనగామ నియోజకవర్గయుత్‌కాంగ్రెస్ అధ్యక్షులు చెట్కూరి కమలాకర్ పేర్కొన్నారు. ధూల్మిట్ట మండలానికి చెందిన వ్యక్తిగా పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గోనడం గర్వంగా ఉందని చెట్కూరి కమలాకర్ అన్నారు.తెలంగాణరాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బనుక శివరాజ్‌యాదవ్ పాల్గోన్నారు.

## విత్తనాలు, ఎరువులకు కొరత లేదు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** మెదక్ జిల్లా చిలిపి చేడు మండలంలోని అగ్రో రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఎరువుల దుకాణాన్ని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్‌ను, గోదాంలోని ఎరువుల నిలువలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులకు కావలసిన ఎరువులు విత్తనాలుఅందుబాటులో ఉన్నాయని, కొరత లేదని తెలిపారు. జిల్లావ్యాప్తంగా యూరియా 10168 మెట్రిక్ టన్నులు, డి ఏ పి 704 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 4417మెట్రిక్ టన్నులు, పొటాష్ 373 మెట్రిక్ టన్నులు, సూపర్ ఫాస్ఫేట్ 285మెట్రిక్‌టన్నులుఅన్నీ కలిపి 15947 మెట్రిక్ టన్నులఎరువులు జిల్లావ్యాప్తంగా ఉన్నాయన్నారు. ఎరువులను ప్రాథమిక సహకార సంఘాలు అగ్రో రైతుసేవా కేంద్రాలు డిసిఎంఎస్ కేంద్రాలు మరియు ప్రైవేటు దుకాణాల ద్వారా ఉన్నాయని తెలిపారు. ప్రతి రైతు దగ్గర నుండి ఆధార్ కార్డు వివరాలను సేకరించి మాత్రమే ఎరువుల విక్రయాలు జరపాలని ఆదేశించారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో రైతులకు ఎరువుల కొరత లేకుండా అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ గోవింద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు పిల్లలకు 50శాతం ఫీజు రాయితీకి వినతి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టు పిల్లలకు ప్రవేట్ స్కూల్ లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కలెక్టర్ రాహుల్ శర్మకు గురువారం కలెక్టర్ కార్యాలయంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా టియుడబ్ల్యూ జేఐజేయు అధ్యక్షుడు క్యాతం సతీష్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ, ప్రజా సంక్షేమం కోసం మన జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు మన జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేటర్ పాఠశాలలో ఫీజు 50 శాతం రాయితీ కల్పించే విధంగా సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేయాలని వారు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఐజెయు జిల్లా కమిటీ తరుపున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి చింతల కుమార్ యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వీరభద్రస్వామి, రాష్ట్ర నాయకులు సామల శ్రీనివాస్, జిల్లా నాయకులు సట్ల మురళి, రజనీకాంత్, లక్ష్మణ్, రమేష్ రవితేజ, సమ్మయ్య గౌడ్, రవి, సతీష్, నరేందర్ చిన్న పత్రిక ల సంఘం జిల్లా అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రాన్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఆకుల పెంటయ్య సేవలు అపూర్వం



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** గ్రేన్ మార్కెట్ హమాలీ యూన్ కార్మిక నాయకుడు ఆకుల పెంటయ్య ఆశయాలను కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగళంపల్లి జనార్ధన్, పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య పిలుపునిచ్చారు. ఆకుల పెంటయ్య 12వ వర్ధంతి గురువారం జనగామ పట్టణంలోని షాప్స్, గ్రేన్ మార్కెట్ హమాలీ యూన్ కార్యాలయంలో మోటే శ్రీశైలం అధ్యక్షతన జరగగా ఆకుల పెంటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మంగళంపల్లి జనార్ధన్, చొప్పరి సోమయ్య మాట్లాడుతూ ఆకుల పెంటయ్య తన జీవితాన్ని కార్మిక ఉద్యమానికి దారపోశాడన్నారు. జనగామలో షాప్స్, గ్రేన్ మార్కెట్ హమాలీ యూనియన్ ఏర్పాటు చేసి కార్మికుల హక్కులు, కూలి రేట్లు తదితర సమస్యలపై పోరాటం చేశాడన్నారు. ఆయన కార్మికులకు దూరమై 12 ఏండ్లు అవుతున్నా ఆయన ఆశయాలు మాత్రం ఇంకా మిగిలే ఉన్నాయన్నారు. చామకూర యాకూబ్, నగేస్, వీరస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తా..



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** ఏజెన్సీ ప్రాంతంలో దట్టమైన అడవుల మధ్యలో జీవనం కొనసాగిస్తున్న గుత్తికోయ గుంపు ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా జిల్లా ఎస్‌పి గురువారం మంగపేట పరిధిలో గల ముసలమ్మ గుట్ట గుత్తికోయ గుంపును సందర్శించారు. ముసలమ్మ గుట్ట గుత్తికోయ ప్రజలతో మాట్లాడిన ఎస్‌పి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకోగా వర్షాకాలంలో వారు ప్రదానంగా త్రాగునీరు, దోమల బెడద వంటి సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ఎస్‌పి తెలుపగా త్రాగునీరు సమస్య తీర్చేలాగున వెంటనే చర్యలు చేపడుతానన్నారు. అక్రమంగా అడవిని ఎవరు నరకవద్దని ఎస్‌పి తెలిపారు. అనుమానిత వ్యక్తులు తమ గూడాలకు వస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు. అనంతరం పిల్లలకు చాక్లెట్, బిస్కెట్స్, అరటి పండ్లు పంచి పెట్టారు. పిల్లలను చదివించే దిశగా కృషి చేయాలని దానికి తగినంత ప్రోత్సాహాన్ని పోలీస్ శాఖ ద్వారా అందిస్తానని ఎస్‌పి తెలిపారు. ఏఎస్‌పి ఏటూరునాగారం మహేష్ గితే, ములుగు డిఎస్‌పి రవీందర్, ఏటూరునాగారం సిఐ శ్రీనివాస్, మంగపేట ఎస్‌ఐ టివి సూరి, ఏటూరునాగారం స్పెషల్ పార్టీ ఎస్‌ఐ తాజుద్దీన్, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాల్సిందే



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీసీపీ రాజమహేంద్రనాయక్ గురువారం ఆకస్మికంగా సందర్శించి పోలీస్‌స్టేషన్ రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. అక్కడి పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఎస్‌ఐ డీసీపీకి వివరించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, వారానికి ఒకసారి శ్రమదాన కార్యక్రమం నిర్వహించాలని ఎస్‌ఐకి, సిబ్బందికి సూచించారు. గ్రామ పోలీస్ అధికారులు తరచు గ్రామాలను సందర్శించాలని, సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, భరోసా సెంటర్, షీ టీమ్ గురించి అవగాహన కల్పించాలన్నారు.పోలీస్ సిబ్బంది రాజు, యాదగిరి, నర్సిరెడ్డి, రాకేష్, జమాల్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు సదుపాయాలు కల్పించాలి



**ప్రజాపక్షం/తొర్రూరు :** ఆసుపత్రులలో రోగులకు సరైన సదుపాయాలు కల్పించాలని తొర్రూరు డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ మురళీధర్ అన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి ఆదేశాల మేరకు తొర్రూరు డివిజన్ కేంద్రంలోని పలు ప్రయివేటు ఆసుపత్రులలో గురువారం తనిఖీలు నిర్వహించారు. డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ ఆసుపత్రులలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వ ఆనుమతులు ఉన్నా ప్రతి పరీక్షను రో గులకు భారం కాకుండా నిర్వహించాలన్నారు. నోద ఆసుపత్రి, సుప్రిత ఆసుపత్రి, విజయలక్ష్మి క్లినిక్ అండ్ డయాగ్నస్టిక్స్, మాతృశ్రీ డయాగ్నస్టిక్స్‌లను తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మాస మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎండు గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/ పటాన్‌చెరు :** ఎండు గంజాయిని పట్టుకున్నట్టు ఎన్‌ఫోర్సుమెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె. శ్రీనివాసరావు తెలిపారు. గురువారం అక్రమంగాఎండు గంజాయి చేపడుతున్నట్లు నమ్మదగిన సమాచారం అందింది. గ్రాండ్ ఫార్మా కంపెనీ పాశమైలారం దగ్గర వాహన తనిఖీలు చేశారు. అనుమానాస్పద వ్యక్తి ఎండు గంజాయితో పాటు పట్టుబడ్డారు. అతని ద్విచక్ర వాహనంను తనిఖీ చేయగా 350 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైనట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అనంతరం సదరు పట్టుబడిన వ్యక్తి వివరాలు రాజ్ కుమార్‌సింగ్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వాడని ప్రస్తుతం పాశమైలారం గ్రామంలో నివసిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సి.హెచ్ చంద్రశేఖర్, సి.ఐ, బి.యాదయ్య ఎస్.ఐ, ఎండి. అలీమ్ హెడ్ కానిస్టేబుల్ , ఎం గోపాల్ కానిస్టేబుల్ ,రామారావు కానిస్టేబుల్ సతీష కానిస్టేబుల్ అమ్మతుల్ కరీమ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

## 33మంది జైలుకు తరలింపు

**ప్రజాపక్షం/చిట్యాల:** చిట్యాల సర్కిల్ పరిధిలో గల చిట్యాల, రేగొండ, మొగులపల్లి టేగులపల్లి, ఘనపూర్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో గల వివిధ కేసులలో నేరాఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు భూపాలపల్లి కోర్టులో వాయిదాలకు సరియైన సమయంలో హాజరుకాని వారిపై మేజిస్ట్రేట్ నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేయనైనది. గురువరాం భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ కారే ఆదేశాల మేరకు భూపాలపల్లి డిఎస్‌పి ఏ.సంపత్ రావు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయిన నింధితులని 33 మందిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ ఎన్.రామచంద్రా రావు ఉత్తర్వుల ప్రకారం వారిని ఖమ్మం జైలుకు తరలించనైనదని చిట్యాల సిఐ డి.మల్లేష్ తెలియజేసినారు. ఇప్పటికైనా నిందారోపణలు ఎదుర్కొంటున్న ఉన్న వారు ఎవరైనా కోర్టు నిర్దేశించిన సమయానికి కోర్టులో హాజరు అయ్యి కోర్టు విచారణకి తప్పనిసరిగా సహకరించాల్సిందిగా లేనియెడల నాన్ బెయిలబుల్ వారంటీ జారీ అయితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇట్టి స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్న చిట్యాల సీఐ డి.మల్లేష్, ఎస్ఐ శ్రావణ్ కుమార్, ఘన్పూర్ ఎస్సై సాంబమూర్తి, రేగొండ ఎస్సై రవికుమార్, మొగుల్లపల్లి ఎస్సై అశోక్ ,ఎస్సై ప్రసాద్, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# విద్యపై 'కేంద్రం' చిన్నచూపు

జాతీయ నూతన విద్యావిధానం రద్దుకు సమరశీల పోరాటం

ఎఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజన్

ముగిసిన రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు

**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి :** బడుగు, బలహీన వర్గాలలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యనందించే విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఎఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజన్ విమర్శించారు. కార్పొరేట్ మాయలో ఉన్నతవర్గాలకే ఉన్నత విద్యను అందించేందుకు ప్రాధాన్యతనిస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న నీట్ పరీక్ష సామాజిక న్యాయానికి వ్యతిరేకమన్నారు. కరీంనగర్‌లో మూడు రోజులుగా నిర్వహించిన ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఆఖరి రోజు ముఖ్యఅతిధిగా హాజరైన దినేష్ రంగరాజన్ మాట్లాడుతూ మార్క్సిజం సిద్ధాంతాల మేరకు శాస్త్రీయ విద్యావిధానం అమలు చేస్తే సమాజంలో మనుగడ సాధ్యమన్నారు. దేశంలో అటువంటి విద్యాబోధన అమలు జరగడం లేదన్నారు. కేవలం ఉద్యోగాల కోసమే చదువు అన్న రీతిలో విద్యాబోధన సాగుతోందని, సమాజాన్ని చదివి జ్ఞానాన్ని సంపాదించుకున్నవారే మనుగడ సాధిస్తారన్నారు. స్వతంత్ర భారతదేశంలో బడుగు, బలహీనవర్గాలలో దారిద్ర్యరేఖకు దిగువన పేద మధ్యతరగతి కుటుంబాలకు సరైన విద్యనందించక కేవలం ఐటిఐ, డిప్లొమో వంటి వాటితో కార్పోరేట్ సంస్థల్లో చిన్న ఉద్యోగాలకే పరిమితం చేస్తున్నారని, ఉన్నతవర్గాలు ఇంజనీరింగ్, డాక్టర్లుగా ఉద్యోగాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. అందుకు నిదర్శనం మోదీ ప్రభుత్వం తీసుకున్న వచ్చిన నూతన జాతీయ విధానం 2020 అమలు చేయడమేనన్నారు. ఢిల్లీ కేంద్రంగా నిర్ణయం తీసుకుంటుండడం విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో టీచర్ల కొరత, కనీస మౌలిక వసతుల లేమితో ఉన్నత విద్యను సాధ్యపడకుండా ప్రభుత్వమే చేస్తుందన్నారు. వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల యూనివర్సిటీలలో ఉన్నత విద్యకు కామన్ ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించేందుకు మోదీ ప్రభుత్వం సంసిద్ధమవుతోందన్నారు. జాతీయ విద్యావిధానం, నీట్, క్యూట్ పరీక్షలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడుతూ విద్యావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. నిర్మాణాత్మకంగా ఎఐఎస్ఎఫ్ మరింత బలోపేతమవ్వాలని పిలుపునిచ్చారు. రాజకీయంగా సమాజంలో మార్పు కోసం యువత కంకణం కట్టుకోవాలన్నారు. భగత్‌సింగ్, చేగువేరా వంటి మహనీయుల స్ఫూర్తితో సమ సమాజ స్థాపనకు పోరాడాలన్నారు. ఇండియా కూటమిలోని కాంగ్రెస్ అలయన్స్ ప్రభుత్వాలతో పాటు ప్రత్యేకంగా రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సర్కార్ అసెంబ్లీలో జాతీయ విద్యావిధానం, నీట్ పరీక్షను వ్యతిరేకిస్తూ తీర్మాణించి కేంద్రానికి నివేదించాలని ఆయన కోరారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి యూనివర్సిటీలను బలోపేతం చేయాలని కోరారు.



రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలి

తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు



భ్రష్టుపట్టిన రాజకీయ వ్యవస్థలో మార్పుకు నిరంతరం శ్రమించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. యువతతోనే రాజకీయాల ప్రక్షాళన సాధ్యమన్నారు. స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడిచినా ప్రభుత్వ లెక్కల ప్రకారం నాలుగున్నర కోట్ల బాలలు కార్మికులుగా పనిచేస్తుండడం బాధాకరమన్నారు. దేశంలో ప్రతిబిడ్డకు విద్యనందించడమే లక్ష్యంగా, విద్యా వ్యతిరేక విధాలపై నిరంతరం పోరాడాలన్నారు. శిక్షణ తరగతుల ను సద్వినియోగం చేసుకుని, మేధావులు చెప్పిన బాటలో నడవాలన్నారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ గ్యార క్రాంతి, రాజు, కాసోజు నాగజ్యోతి, రఘు రాం, లెనిన్, మచ్చ రమేష్, వెంకటేస్, మద్దుపల్లి లక్ష్మణ్, జనార్ధన్, ప్రీతం, శరత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాలతోనే రాటుదేలుతారు : చాడ వెంకట్‌రెడ్డి



దేశంలో బిజెపి సెంటిమెంట్ రాజకీయాలకు పాల్పడుతోందని, మతాల పేరుతో అంతరాలు పెంచుతోందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. రాముడు సంక్షేమ రాజ్యాన్ని స్థాపిస్తే, దానిని హిందుత్వ ఎజెండాగా బిజెపి మార్చిందని, పేద వాడు పేదవాడిగా, ధనవంతుడు మరింత ధనవంతుడిగానే ఎదుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో జరుగుతున్న ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులలో చాడ ప్రసంగించారు. దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లలో బడుగు, బలహీన వర్గాల ఆర్థిక స్థాయి పెరగడం లేదన్నారు. బిసిలకు సామాజిక న్యాయం దక్కడం లేదన్నారు. ఈ క్రమంలో విద్యార్థులు రాజకీయ పాత్ర లేకుంటే భవిష్యత్తు ప్రమాదకరమని హెచ్చరించారు. చదువుతూ జ్ఞానం పెంచుకోవాలని, దిన పత్రికలను చదవాలని సూచించారు. ఉద్యమంలో లాఠీదెబ్బలే మరింత చైతన్యవంతం చేస్తాయని, ప్రశ్నించే గొంతుకైతేనే తగిన గుర్తింపు వస్తుందన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదలకు పోరాడాలన్నారు. సామాజిక చైతన్యంతో లోతైన అధ్యయనం ఉన్న విద్యార్థి యువకులు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. నీట్ పరీక్ష కుంభకోణం వెనుక జాతీయ కుట్ర దాగి ఉందని మాజీ టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ ఘంటా చక్రపాణి ఆరోపించారు. భారతదేశంలో విద్యారంగం సవాళ్లు అనే అంశంపై ఆయన మాట్లాడారు. 75 ఏళ్ళ స్వాతంత్ర్య దేశంలో పరీక్షలను నిష్పక్షపాతంగా ఎందుకు నిర్వహించలేకపోతున్నారని ప్రశ్నించారు.

## పేదవాడి సొంతింటి కల నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే : సిపిఐ



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మి , ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సిపిఐ అనుబంధ సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజలు ఆ ప్రభుత్వాన్ని గద్దెదింపి కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల వాగ్దానాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. పోడు రైతులకు పట్టాలిచ్చి రైతు భరోసా, రైతు భీమా పథకాన్ని వర్తింప చేయాలన్నారు. దేవాలయ భూముల రైతులకు సాధారణ రైతులకు ఇస్తున్న అన్ని రకాల రాయితీలు కల్పించాలన్నారు. రూ.2లక్షల రుణమాఫీని ఆగస్టు 15 కల్లా పూర్తి చేయాలని, ప్రతి మహిళకు రూ.2500ల ఆర్థిక సహాయం అందించడంతో పాటు పెన్షన్ రెట్టింపు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కొమ్రరాజు వెంకట్, గంటి నరసమ్మ పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎఐటియుసి



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి సంస్థలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే యూనియన్ ప్రధాన ధ్యేయమని ఎఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా అన్నారు. గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో నాయకులు ఆర్‌కె 7 గనిని సందర్శించి, కార్మికుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గనిలో కోల్ కట్టర్‌ల కొరత, వెంటిలేషన్ సమస్యలు ఉన్నట్లు కార్మికుల తమ దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. సమస్యలను గని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, గనిలో నూతన వర్కింగ్ ప్లేస్ లను తయారు చేసుకోవడానికి తమకు కావలసినంత మ్యాన్ పవర్ లేదని గని మేనేజర్ గుర్తింపు సంఘం నాయకులకు తెలుపగా, వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సరిపడా మ్యాన్ పవర్ వచ్చే విధంగా చూస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొట్టె కిషన్‌రావు, బిర రవీందర్, ప్రతాప్, రాజేందర్, రవితేజ, యాదగిరి, అన్వర్, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులు ఎత్తివేయాలి

సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారధిరెడ్డి

**ప్రజాపక్షం/మహబూబాద్ ప్రతినిధి :** బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధనకు చేసిన ఉద్యమంలో నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి డిమాండ్ చేశారు. విభజన చట్టంలో ఉన్న బయ్యారం లో ఉక్కు పరిశ్రమను సాధనకు నాటి ఉద్యమ కేసుల్లో సిపిఐ, కాంగ్రెస్ నేతలు బి.అజయ్‌సారధిరెడ్డి, శంతన్, రామరాజు మిరియాల మల్లికార్జున్ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అజయ్ సారధిరెడ్డి మాట్లాడుతూ విభజన చట్టంలో ఉన్న బయ్యారం ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించాలన్నారు. 2014లో బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ప్రారంభిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బిజెపి సహకరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన నాటి బిఆర్ఎస్ ఇద్దరు తోడుదొంగలై పదేళ్లపాటు ఉక్కు పరిశ్రమ ప్రారంభించ లేదన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ప్రారంభించి ఈ ప్రాంతం నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో 8 ఎంపి స్థానాలు రెండు కేంద్ర మంత్రి పదవులు ఉన్న బిజెపి, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## భూనిర్వాసితులకు రుణమాఫీ వర్తింప చేయాలి : సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/గజ్వేల్ :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితులకు రుణమాఫీ వర్తింప చేయాలని సిపిఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రిజర్వాయర్‌లో భాగంగా నిర్వాసితుల దగ్గర 2016 సంవత్సరంలో భూసేకరణ చేసే సమయంలో అప్పటి ప్రభుత్వం భూమి తీసుకున్నందున ప్రభుత్వమే రుణమాఫీ చేస్తుందని హామీ ఇచ్చి, తర్వాత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో పాత రుణాలు మాఫీ కాకపోవడంతో బ్యాంకర్లు కొత్త రుణాలు ఇవ్వడానికి నిరాకరించారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఇందులో భాగంగానే 2018 డిసెంబర్ 12 నుండి 2023 డిసెంబర్ 9 వరకు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తింప చేస్తామని ప్రకటించిందని, కాని ప్రాజెక్టులో భాగంగా 2016లో భూములు కోల్పోయి అంతకుముందు రుణాలు తీసుకున్న నిర్వాసితులకు రుణమాఫీ వర్తించడం లేదని దీన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక జీఓతో రుణమాఫీ చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు పోచయ్య, రవి, రాజయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

ఎన్నికలప్పుడే రాజకీయాలు..

మిగతా సమయం ప్రజాభివృద్ధికి కృషి

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను త్వరలో మంజూరు చేస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, మిగతా సమయం ప్రజాఅభివృద్ధి కోసం పాటుపడుతామన్నారు. సిద్దిపేట జిల్లా రెడ్డి సంక్షేమ సంఘంలో జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం గురువారం జెడ్‌పి చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ జడ్పిటిసిలు, ఎంపిపిలు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాను అన్నిరంగా ల్లో అగ్రగ్రామిగా నిలిపేందుకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు కృషిచేస్తుందన్నారు. రైతుల రుణమాఫీ చేసేందుకు కేబినేట్ నిర్ణయం తీసుకుందన్నారు. విద్య, వైద్య, రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. గతంలో జిల్లా మంత్రిగా తన్నీరు హరీష్‌రావు కృషిచేశారని,. ప్రస్తుతం జిల్లామంత్రిగా తాను అన్నివిధాల కృషిచేస్తానన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ, వైస్‌చైర్మన్ రాజిరెడ్డితో పాటు జడ్పిటిసిలు, ఎంపిటీసిలను మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రఘోత్తంరెడ్డి, దేశపతిశర్మ, యాదవరెడ్డిలను ఘనంగా సన్మానించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను జిల్లా పరిషత్ పక్షాన జడ్పి చైర్‌పర్సన్ రోజాశర్మ సన్మానించారు.

## 'యశస్విని'లో తెలంగాణకు అధిక ప్రాధాన్యత

కేంద్రమంత్రి జితన్ రామ్ మాంఝీకు

మంత్రి శ్రీధర్‌బాబు వినతి



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో లక్ష మంది మహిళలను ఎంపిక చేసి శిక్షణతో పాటు, ఉత్పాదన సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్రం ప్రారంభించిన 'యశస్విని' పథకం కింద తెలంగాణా రాష్ట్రానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని కేంద్రమంత్రి జితన్‌రామ్ మాంఝీని రాష్ట్ర ఐటి పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. హైదరాబాద్ లోని జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ లో మహిళా ఔత్సాహికులకు సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు మరిన్ని నిధులు కేటాయించి, ప్రస్తుత మార్కెట్ అవసరాలకు తగినట్టు ఆధునీకరించాలని కోరారు. తెలంగాణాలోని ఎంఎస్ ఎంఈలకు కేంద్రం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలను తక్షణం విడుదల చేయాలని కోరారు. తెలంగాణాలో నమోదైన ఎంఎస్ ఎంఈల ద్వారా 3.64 లక్షల మంది ప్రత్యక్ష ఉపాధి పొందుతున్నారని శ్రీధర్‌బాబు కేంద్ర మంత్రికి వివరించారు. అంతర్జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల దినోత్సవం సందర్భంగా ఆశాఖ కేంద్ర మంత్రి జితన్‌రామ్ మాంఝీని రాష్ట్ర ఐటి పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణా ప్రభుత్వం మహిళా వికాసానికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల చిరు వ్యాపారులు, సూక్ష్మ పరిశ్రమల నిర్వాహకులు గరిష్టంగా ప్రయోజనం పొందుతున్నారని శ్రీధర్‌బాబు తెలిపారు. ఎంఎస్ ఎంఈలో శిక్షణ, ప్రోత్సాహకాలను ఐటి రంగానికి కూడా విస్తరించాలని సూచించారు. ఐటి, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సులో ఇంజనీరింగ్, డిప్లొమా పట్టా పుచ్చుకున్న యువత లక్షల సంఖ్యలో ఉన్నారని వివరించారు. వారి ఉపాధిని దృష్టిలో ఉంచుకుని నూతన శిక్షణా కార్యక్రమాలను రూపొందించాలని కోరారు. తెలంగాణాను సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను స్వయంగా వీక్షించాలని శ్రీధర్‌బాబు చేసిన అభ్యర్థనకు కేంద్ర మంత్రి స్పందించారు. నెల రోజుల్లో తను తెలంగాణను సందర్శిస్తానని హామీ ఇచ్చారు. శ్రీధర్‌బాబుతో పాటు ధర్మపురి ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ లక్ష్మణ కుమార్ కూడా కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## వాస్తవ సాగుదారులకే రైతుభరోసా

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధానకార్యదర్శి పశ్య పద్మ డిమాండ్




**ప్రజాపక్షం/కోదాడ :** వాస్తవసాగుదారులైన రైతులకు, కౌలు రైతులకు రైతు భరోసా వర్తింప చేయాలని, 2011 కౌలుదారు చట్టాన్ని అనుసరించి కౌలు రైతులను గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కోదాడ నియోజకవర్గ పరిధిలోని చిలుకూరు మండల కేంద్రంలో రైతు వేదికహాల్‌లో కౌలు రైతుల సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు కొండా వెంకయ్య అధ్యక్షతన జరిగిన కౌలు రైతుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ, రెవిన్యూ, ఇతర ప్రభుత్వశాఖలు, గ్రామసభల ద్వారా వాస్తవ సాగుదారులైన రైతులు, కౌలు రైతులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. రూ.2లక్షల రుణమాఫీకి ఎలాంటి కటాఫ్ తేదీలు గానీ, ఆంక్షలు గానీ పెట్టకుండా ఒకేసారి ప్రభుత్వం రుణమాఫీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 14 రకాల పంటల మద్దతు ధరలు ఆశాస్త్రీయంగా ఉన్నాయని, డా.స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం పెట్టిన పెట్టుబడికి 50 శాతం మద్దతు ధర కలిపి ఇవ్వాలన్నారు. పంటలకు మద్దతు ధర గ్యారెంటీల పథకాన్ని అమలు చేసి చీడ,పీడలు, ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని ఆమె అన్నారు. రూ.2లక్షల రుణమాఫీతో పాటు వ్యవసాయ పనుల సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు రైతుభరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రరైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లు ప్రసాద్, రైతు సంఘం మండల అధ్యక్ష,కర్యాదర్శులు ముక్కా వీరబాబు, రామిశెటి కోటయ్య, పిల్లుట్ల కనకారావు, బెల్లంకొండ నాగయ్య, ప్రభాకర్, రవీంద్రరెడ్డి, మాతంగి ప్రసాద్, భుజంగరావు, ఎస్.శ్రీను, కేతిరెడ్డి నాగిరెడ్డి పాల్గొన్నారు.

## వారం రోజులు మోస్తరు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉపరితలగాలులు వీస్తాయన్నారు. శుక్రవారం నుంచి శనివారం పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో ఉపరితల గాలులువీస్తాయన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

## భారత్ హిందూ రాజ్యం కాదు

(మొదటి పేజీ తరువాయి)

కాదని తేలిపోయిందని బుధవారం ఇక్కడి నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక బెంగాలీ న్యూస్ చానల్‌తో మాట్లాడుతూ అమర్త సేన్ అభిప్రాయపడ్డారు. బుధవారం సాయంత్రం ఆయన అమెరికా నుంచి ఇండియా చేరుకున్నారు. ప్రతి ఎన్నిక తర్వాత ఏదో మార్పు జరుగుతుందని మనం ఆశిస్తామని, అయితే గతంలో జరిగినట్లుగా విచారణ లేకుండా ప్రజలను జైళ్లలో పెట్టడం, పేదలకు, సంపన్నులకు మధ్య ఎడం పెరగడం వంటివి ఇంకా కొనసాగుతున్నాయని, అవి ఆగాలని 90 ఏళ్ల ఆర్థిక వేత్త అన్నారు. భారత్ లౌకిక దేశం కావడం, లౌకి రాజ్యాంగం ఉండడం వంటివి దృష్టిలో ఉంచుకుని రాజకీయంగా కొంత విశాల దృక్పథం అవసరమని ఆయన చెప్పారు. భారత్‌ను హిందూ రాష్ట్రంగా మార్చాలన్న ఆలోచన తన దృష్టిలో సరైనది కాదని ఆయన చెప్పారు. కొత్తగా ఏర్పడిన కేంద్ర క్యాబినెట్ పాత దానికి కాపీగా ఆయన అభివర్ణించారు. మంత్రులు అవే శాఖలను నిర్వహిస్తున్నారని, కొద్దిపాటి మార్పు ఉన్నప్పటికీ రాజకీయ శక్తిమంతులు ఇప్పటికీ శక్తిమంతులేనని యన వ్యాఖ్యానించారు. తన చిన్నతనంలో బ్రిటిష్ పాలనలో ప్రజలను ఎటువంటి విచారణ లేకుండా జైళ్లలో ఉంచేవారని ఆయన గుర్తు చేసుకున్నారు. తన చిన్నతనంలో తన బంధువులు పలువురిని ఎటువంటి విచారణ లేకుండా జైళ్లలో ఉంచారని, భారత్‌లో ఇటువంటివి ఉండవని తాను ఆశించానని, ఇది ఆగకపోవడానికి కాంగ్రెస్‌ను కూడా నిందించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ దీన్ని మార్చలేదని, ప్రస్తుత ప్రభుత్వంలో ఇది మరింత ఎక్కువగా ఉందని అమర్త సేన్ విమర్శించారు.

## జ్యుడీషియల్ విచారణ చేస్తే తప్పేముంది

(మొదటి పేజీ తరువాయి)

కావాల్సి ఉన్నది. దీనిని పరిగణనలోకి తీసుకుని కమిషన్ ఇచ్చిన గడువు తేదీని ఒక రోజు పొడిగించేలా చూడాలని, అప్పటివరకు స్టే విధించాలని కెసిఆర్ తరపున హాజరైన న్యాయవాది ఆదిత్య సొంధి హైకోర్టును కోరారు. కానీ ఇందుకు హైకోర్టు నిరాకరించింది. జ్యుడిషియల్ ఎంక్వయిరీ పూర్తయిన తర్వాత ఎలాగూ రిపోర్టు వస్తుందని, దాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తర్వాత చర్చించొచ్చు కదా అని కోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరపు న్యాయవాది కోరిన ఒక రోజు స్టేకు సమ్మతించని హైకోర్టు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలతో పాటు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్రాజెక్టుల నిర్మాణాల నిర్ణయాల్లో జరిగిన లోపాలపై రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల కెసిఆర్‌కు కమిషన్ ఇచ్చిన నోటీసును సవాలు చేస్తూ హైకోర్టులో కెసిఆర్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌కు రిజిస్ట్రీ నంబరింగ్ ఇవ్వకపోవడంతో హైకోర్టును ప్రత్యేకంగా కోరగా విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా కెసిఆర్ తరపు న్యాయవాది వాదిస్తూ ఈఆర్‌సి ఇచ్చిన తీర్పు ప్రకారమే ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేశామని, ఈఆర్‌సి ఆమోదాలపై జ్యుడీషియల్ కమిషన్ ద్వారా ఎంక్వైరీ చేయకూడదని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం దానికి విరుద్ధంగా జస్టిస్ నర్సింహారెడ్డి నేతృత్వంలో కమిషన్‌ను నియమించిందని కెసిఆర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

## ప్రైవేటీకరించేందుకే బొగ్గు గనులు వేలం

(మొదటి పేజీ తరువాయి)

గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో పాటు మాజీ ఎంఎల్‌ఎలు, బొగ్గు గనుల కార్మిక సంఘం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కేంద్రంతో ముఖ్యమంత్రి కుమ్మక్కయ్యారని, లాభసాటిగా ఉన్న సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణి నష్టాల్లో ఉందంటూ పెట్టుబడుల ఉపసంహరణకు సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. సకల జనుల సమ్మె సమయంలో సింగరేణి ప్రాధాన్యతను దేశం గుర్తించిందని, సమ్మె కాలంలో ఐదు దక్షిణాది రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయని కెటిఆర్ గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతమనేది తమ పార్టీ విధానమన్నారు. విద్యుత్ ప్రాజెక్టులను కట్టే బాధ్యతలను బిహెచ్‌ఈఎల్‌కు అప్పగించామన్నారు. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రెండు బొగ్గు గనులను ప్రైవేట్ సంస్థలకు కేటాయించినప్పటికీ, తట్టెడు తెలంగాణ బొగ్గును ఎత్తకుండా విజయవంతంగా అడ్డుకున్నామన్నారు.

**జూలై 1 నుంచి నిరసన కార్యక్రమాలు: టిబిజికెఎస్**

సింగరేణి సంస్థ ఉనికి కోల్పోయేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని టిబిజికెఎస్ నాయకులు విమర్శించారు.వేలాన్ని ఆపాలని నిరసిస్తూ జూలై 1నుంచి దశలవారిగా నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిబిజికెఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కప్పు కృష్ణ,నాయకులు నూనె కొమురయ్య, ఎం.రామ్మూర్తి, కె.సురేందర్ రెడ్డి మాట్లాడుతూ జూలై 1న నల్ల బ్యాడ్జీలతో నిరసన, 3 వ తేదీన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం, 6వ తేదీన జి.ఎం.ఆఫీసుల మందు ధర్నా ,9 వ తేదీన గోదావరిఖనిలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రెండవ దశలో భాగంగా అసెంబ్లీ సమావేశాల్లో కోల్ బెల్ట్ ఎంఎల్‌ఎలకు వినతిపత్రాలను అందజేస్తామని,ఆ తర్వాత ఇందిరాపార్క్ వద్ద ధర్నా, పార్లమెంట్ సమావేశాల సమయంలో ఢీల్లి జంతర్ మంతర్ వద్ద కూడా ధర్నా నిర్వహిస్తామని వారు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com



టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.దామోదర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ సి.చంద్రశేఖర్

ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ — రంగారెడ్డి
ఖమ్మం | శుక్రవారం | 28 జూన్, 2024


## నీటి సరఫరా పునరుద్ధరించిన జలమండలి



ప్రజాపక్షం/హైదరాబాద్ : కోదండాపూర్ పంప్ హౌజ్‌లో మరమ్మతులకు గురైన రెండో పంపు ఎన్‌ఆర్‌వి వాల్వ్ పనులు ఈ ఉదయం వరకు పూర్తయ్యాయని జలమండలి అధికారులు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టిన అధికారులు, వాటిని వేగంగా పూర్తి చేశారు. ఆ తర్వాత నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో కృష్ణా డ్రింకింగ్ వాటర్ సరఫరా ఫేజ్2 పరిధిలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా యథావిధిగా జరుగుతోందని చెప్పారు.

## కార్మిక చట్టాలు అమలయ్యేలా చర్యలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో లేబర్ కమిషనర్ కృష్ణ ఆదిత్యతో కలిసి పలు కార్మిక సమస్యలను వివరించారు. కార్మికుల హక్కులను అమలు చేయడంతోపాటు చట్టాలు సైతం అందుబాటులోకి వచ్చే విధంగా చూడాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న పరిశ్రమల్లో స్థానికుల కంటే స్థానికేతరులకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. దాంతో స్థానిక యువత నిరుద్యోగులుగా మారిపోతున్నారని లేబర్ కమీషనర్ దృష్టికి తీసుకువెళ్ళారు.

## బోనాలకు నిధులు : మధుయాస్కీ

ప్రజాపక్షం/వనస్థలిపురం : అత్యంత వైభవంగా నిర్వహించే బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20కోట్ల నిధులు మంజూరు చేసిందని టిపిసిసి ప్రచార కమిటి చైర్మన్, ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మధుయాస్కీగౌడ్ గురువారం ఒక పత్రిక ప్రకటనలో ఆయన తెలిపారు. ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని దేవాలయ కమిటీల ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ సహాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యతోపాటు ఆరోగ్యం ముఖ్యం

డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మీ



ప్రజాపక్షం/షాద్‌నగర్: విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని షాద్‌నగర్ డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ అన్నారు. గురువారం ఫరూక్‌నగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నియంత్రణకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు, ఇన్‌చార్జి హెచ్‌ఎం శంకర్, ఏఎన్‌ఎం స్వప్న, పిపి యూనిట్ ఆశ వర్కర్లు ఉన్నారు.

## పనుల నాణ్యతలో రాజీపడొద్దు

కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : నాణ్యత విషయంలో రాజీ పడకుండా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఆదేశించారు. గురువారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ గోపన్ పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను,రాజీవ్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న భుగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులను కాలనీ వాసులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలో గా ఆయా పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో హనుమంతు నాయక్, శ్రీనివాస్, ప్రభాకర్, మురగ, మన్నేరమేష్, రంగస్వామి, చిన్న శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లై ఓవర్ నిర్మాణాలు చేపట్టాలి

కార్పొరేటర్లు నవజీవన్‌రెడ్డి, నరసింహారెడ్డి



ప్రజాపక్షం/వనస్థలిపురం : విజయవాడ జాతీయ రహదారి విస్తర్ణలో భాగంగా వనస్థలిపురం పనామా వద్ద నిర్మాణం చేస్తున్న అండర్ పాస్‌కు బదులుగా పిల్లర్‌తో కూడిన ఫ్లై ఓవర్ మాత్రమే నిర్మాణం చేయాలని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి అన్నారు. గురువారం పనామా చౌరస్తా వద్ద బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిషత్‌లో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బి అధికారులకు వారు సూచించారు. హయత్ నగర్‌లో అండర్ పాస్ నిర్మాణం చేపడుతున్నారని, అండర్ పాస్ వల్ల వ్యాపారులు నష్టం పోతున్నారని, ఈ విషయంపై మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లాతామని, అండర్ పాస్ నిర్మాణం చేస్తే అడ్డుకుంటామని వారు హెచ్చిరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండారి భాస్కర్, కొత్త రవీందర్ గౌడ్, విజయ్‌కుమార్, ప్రభాకర్, పారంద మహేష్ తదితరులు ఉన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ఉల్లాసం



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: ఆధ్యాత్మికత కార్యక్రమాలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, యజ్ఞయాగాది క్రతువులు, జప, తపములు, ప్రవచనములు, భజనలు మనలో ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి అన్నారు. గురువారం బాలాపూర్ మండలం నాదర్గుల్‌లో కటికరెడ్డి శ్రీరాంరెడ్డి స్వగృహంలో సర్వసౌబాగ్య దేవీ త్రయ గీతాజ్ఞన యజ్ఞానికి నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాదర్గుల్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని, ఆ ఒక్క భగవంతుడిని కోరుకున్నానన్నారు. కార్యక్రమంలో భక్తులు, స్థానిక పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వారం రోజులు మోస్తరు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రాగల వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. పలుజిల్లాల్లో భారీవర్షాలతో పాటు ఉపరితల గాలులు వీస్తాయన్నారు. పలుజిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 30నుంచి 40కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో బలమైన ఉపరితలగాలులు వీస్తాయన్నారు. శుక్రవారం నుంచి శనివారం పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్,




నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో ఉపరితల గాలులువీస్తాయన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

### నగరంలో కురిసిన వర్షం

నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొన్నిప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. హైటెక్ సిటీ, కొండాపూర్, మాదాపూర్, హఫీస్ పెట్, పరిసర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడని వర్షంపడింది. ముషీరాబాద్, ఒయు, తార్నాక, సరూర్ నగర్, హయత్ నగర్, ఎల్.బి.నగర్, శేరిలింగంపల్లి, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్, చార్మినార్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లపై వరద నీరు చేరడంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయింది. శుక్రవారం కూడా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, మరికొన్నిచోట్లు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## కాజీపేట, వరంగల్ స్టేషన్ల తనిఖీ

ప్రజాపక్షం /హైదరాబాద్ : రాష్ట్రంలో పురోగతిలోనున్న కాజీపేట బైపాస్ లైన్ పనులతో పాటు కాజీపేట — వరంగల్ స్టేషన్‌ల పునరాభివృద్ధి పనులను గురువారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తనిఖీ చేశారు. సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయన ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. జోన్‌లో రైళ్ల రాకపోకలను సులభతరం చేయడానికి ప్లాన్ చేసిన ప్రధాన బైపాస్ లైన్లలో కాజీపేట బైపాస్ లైన్ ఒకటి. దక్షిణ మధ్య రైల్వేలో కాజీపేట ప్రధాన జంక్షన్ స్టేషన్ కావడం, ఈ జంక్షన్ సికింద్రాబాద్ న్యూఢిల్లీ, సికింద్రాబాద్ న్యూఢిల్లీ చెన్నై సహా సికింద్రాబాద్ హౌరా మధ్య రైళ్లను కలుపుతుంది. ఈ సెక్షన్ లో సంవత్సరాల తరబడిగా రైళ్ల రాకపోకలలో స్థిరమైన వృద్ధి నమోదు చేసుకొంది. తద్వారా ఈ సెక్షన్‌పై విపరీతమైన ఒత్తిడి నెలకొంది . దీని ప్రకారం ఈ క్లిష్టమైన విభాగంలో రైలు కదలికలను మరింతగా సులభతరం చేయడానికి , రైలు కదలికల సామర్థ్యాన్ని పెంచడానికి బైపాస్ లైన్ చేపట్టబడింది. 125 కోట్ల రూపాయలకు పైగా అంచనా వ్యయంతో 21.47 రూట్ కిలోమీటర్ల నిడివితో బైపాస్ లైన్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రైలు కింద రైలు (ఆర్. యూ. ఆర్ ), 3 ప్రధాన వంతెనలు 31 చిన్న వంతెనల నిర్మాణం ఉంటుంది. పూర్తయిన తర్వాత, ఇది అన్ని వైపులా రైలు కదలికలను సులభతరం చేస్తుంది. ముఖ్యంగా హసన్‌పర్తి రోడ్ — వరంగల్, హసన్‌పర్తి రోడ్ — కాజీపేట స్టేషన్లు మధ్య రైళ్ల కదలికలను సులభతరం చేస్తుంది. ఈ సందర్భంగా జిఎం



అరుణ్ కుమార్ జైన్ ఈ ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించేందుకు అన్ని శాఖల బృందంతో విస్తృతంగా సమీక్షించారు . అంతకుముందు అరుణ్ కుమార్ జైన్ సికింద్రాబాద్ నుండి కాజీపేట సెక్షన్ వరకు గల రైలు మార్గాన్ని లోకో క్యాబిన్‌లో ప్రయాణిస్తూ తనిఖీ చేశారు. కాజీపేట వరంగల్ రైల్వేస్టేషన్‌ల పునరాభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ స్టేషన్‌లను వ్యాపార పరంగా స్థానిక వృద్ధి కేంద్రాలుగా అభివృద్ధి పరిచేందుకు సౌందర్య నిర్మాణాలతో ఆధునిక ప్రయాణీకుల సౌకర్యాలను అందించడానికి పునరాభివృద్ధి చేస్తున్నారు. కాజీపేట స్టేషన్‌లోని క్రూ బుకింగ్ లాబీ రన్నింగ్ రూమ్‌ను కూడా పరిశీలించారు. లోకో పైలట్‌లతో ఆయన సంభాషించారు. లోకో రన్నింగ్ సిబ్బంది గార్డులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, మరింతగా మెరుగు పర్చాల్సిన అంశాలను వారితో అడిగి తెలుసుకున్నారు.

## పదోన్నతుల జాబితా ప్రకటించాలి

తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. 317 జిఒ పై త్వరగా నిర్ణయం తీసుకుని బాధిత నర్సింగ్ ఆఫీసర్స్‌కు న్యాయం చేయాలని,పదోన్నతుల సీనియర్టీ లిస్ట్‌ను త్వరగా ప్రకటించి,ఆన్‌లైన్‌లో పెట్టాలని, ప్రతి జిల్లాకు ఒక డిస్ట్రిక్ట్ నర్సింగ్ ఆఫీసర్ పోస్టును క్రియేట్ చేయాలని విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ ఆడ్ హాక్ కమిటీ సమావేశం హైదరాబాద్‌లో గురువారం జరిగింది. సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు సుజావతి, అధ్యక్షురాలు జయమ్మ, ప్రధాన కార్యదర్శి మరియమ్మ, వైస్ ప్రెసిడెంట్ అది లక్ష్మి, లలిత, జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్ రుడావత్, కోశాధికారి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. ఏడి(నర్సింగ్), డిడి (నర్సింగ్) పోస్టులను బలోపేతం చేస్తూ ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, పెరిగిన బోధన వైద్యశాలలో,టివివిపిలో క్యాడర్ స్ట్రెంత్ అమలు చేయాలని, బోధన వైద్యశాలలో పెరిగిన పడకల సంఖ్య ఆధారంగా నర్సింగ్ ఆఫీసర్లు, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులను పెంచాలని తీర్మానం చేశారు. 2021లో ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన నర్సింగ్ ఆఫీసర్ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, హెల్త్ కార్డులివ్వాలని వారు డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ ఎడ్యుకేషన్ లో అబ్బాయిలకు కూడా ఉన్నత విద్యకు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నర్సింగ్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించేందుకు గతేడాది వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని వారు కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు నర్సింగ్ ఆఫీసర్లు సోమేష్, పాండు, రవి నాయక్ పాల్గొన్నారు.

## మంథన్' విద్యార్థుల ఔధార్యం



ప్రజాపక్షం/హైదరాబాద్: 'మంథన్' విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. హైదరాబాద్‌లోని గౌలిదొడ్డిలోని కేశవ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రాజెక్ట్ ప్రజ్ఞా పేరుతో వారు విద్యా వ్యాప్తి కార్యక్రమం చేపట్టారు. కేంబ్రిడ్జ్ బోర్డులోని తొమ్మిదవ తరగతి చదువునన్న 10 మంది విద్యార్థులతో పాటు ఐదుగురు ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్, సైన్స్, గణితం, శారీరక విద్య బోధనపై దృష్టి సారించారు. పాఠశాలలో విద్యార్థులకు స్టేషనరీ కిట్‌లు, నోట్‌బుక్‌లు, బోధనా సామగ్రి అందించారు. గ్రంథాలయానికి అనేక పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు, సిబ్బందికి శానిటైజర్లు, పరిశుభ్రత ఉత్పత్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంథన్ స్కూల్ ప్రిన్సిపాల్ సుర్జీత్ సింగ్ మాట్లాడుతూ ఐఎఎస్‌పి మద్దతుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

## అదనపు బస్సులు నడపండి..

ప్రజాపక్షం/యాచారం : అర్టీసి అధికారులు ప్రయాణికులకు తగ్గట్టుగా బస్సులను నడుపుతున్నామని గొప్పలు చెపుతున్న అవి అచరణలో అమలుకు నోచుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దీంతో ప్రయాణికులు గత్యంతరం లేని పరిస్థితిలో బస్సుల్లో ప్రయాణం చేస్తూ నరకం అనుభవిస్తున్నారు. యాచారం–కందుకూరుకు వెళ్ళే బస్సులో నిల్చోవడానికి వీలులేకుండా ప్రయాణం సాగిస్తున్నారు. మహిళలకు ఫ్రీబస్సు సౌకర్యం ప్రభుత్వం ప్రకటించి ఆసాకూను చూపిస్తు అదనపు బస్సులు నడుపడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని పలువురు అరోపిస్తున్నారు. వృద్దులు, వికలాంగులు బస్సులు ఎక్కాలంటేనే భయపడుతున్నారు. తక్షణమే అధికారులు అదనపు బస్సులు నడపాలని పలువురు కోరుతున్నారు.

## చట్టాలపై మహిళలకు అవగాహన తప్పనిసరి

రంగారెడ్డి సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి



ప్రజాపక్షం/యాచారం : చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి పి.శ్రీదేవి అన్నారు. గురువారం యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలకు అండగా రాజ్యాంగం ఎన్నో హక్కులు కల్పించిందన్నారు. అ చట్టాలు తెలియక మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి పురుషుడికి, ప్రతి మహిళకు గౌరవ పధంగా రాజ్యాంగం హక్కు కల్పించిందన్నారు. బాలల చట్టాలు, లీగల్ సర్విసేస్ చట్టం గురించి వివరించారు. అంతకుముందు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్ళి ఉపాధ్యాయులతో మాట్లాడారు. మధ్యాహ్న బోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి మొరుగు శివలీలా రమేశ్, సహకారసంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప శ్రీనివాస్, ఎస్ఐ కిషన్, ఫ్యారలీగల్ వాలంటీర్లు బోడ కృష్ణ, బోడ అబ్బయ్య, పప్పి, సబిత, ఎవిజి పౌండేషన్ చైర్మన్ అడాల గణేశ్, మహిళా సంఘాల సభ్యులు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా స్థితిపై సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో విద్యుత్ సరఫరా స్థితిగతులపై ప్రభుత్వ ఇంధన శాఖ కార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి రోనాల్డ్ రోస్ సమీక్షించారు. గురువారం సోమాజీగూడలోని విద్యుత్ సౌధలో ట్రాన్స్‌కోలో కొనసాగుతున్న పనులను సమీక్షించారు. రాష్ట్రంలోని 400 కెవి , 220 కెవి, అలాగే 132 కెవి స్థాయి ప్రస్తుత ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌లో జరుగుతున్న పనులను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించి ఆయా అన్నిరకాల పనులను సకాలంలో పూర్తి చేయడానికీ, ఈహెచ్‌వి లైన్ పనులతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న ఈహెచ్‌వి సబ్‌స్టేషన్ పనులను వేగవంతం చేయడానికి డైరెక్టర్, ప్రాజెక్ట్‌లు, డైరెక్టర్, ట్రాన్స్‌మిషన్‌నకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. తగినంత బొగ్గు నిల్వలతో అన్ని ఉత్పాదక కేంద్రాలు సాధారణంగా పని చేస్తున్నాయని ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్ ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన , విశ్వసనీయమైన విద్యుత్ సరఫరాను నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, కష్టపడి పనిచేయాలని అన్ని విద్యుత్ వినియోగాలను సెక్రటరీఎనర్జీలను ఆదేశించారు.

## ఒయులో బొజ్జ తారకం జయంతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : అంబేద్కర్ ఆశయసాధనలో అణగారిన ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు బొజ్జతారకం అని అల్ మాల స్టూడెంట్ అసోసియేషన్( అంసా )ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు నామ సైదులు అన్నారు. అంసా ఆధ్వర్యంలో బొజ్జా తారకం జయంతిని ఒయు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించించారు. బొజ్జ తారకం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎం శ్రీకాంత్ యాదవ్, చంద్రశేఖర్, భూతం రఘు, సాయి, నగేష్, గోపి, కార్తీక్ , సదానందం, తరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పాఠశాలలో కనీస వసతులు ఉండేలా చర్యలు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన కనీస వసతులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ, పాఠశాలల మర్మమతులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ, పట్టణ, మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు ఒక జత యూనిఫామ్స్ అందించడం జరిగిందని, రెండో జత యూనిఫామ్స్ త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని పిడి డిఆర్‌డిఎను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులైన తాగునీరు సౌకర్యం, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, తరగతి గదులలో చేపట్టవలసిన మరమ్మతులు, విద్యార్థులు ఆడుకునే ఆట స్థలములలో కావలసిన వసతులు కల్పించాలని తెలిపారు. పాఠశాలల్లో వసతులు చేపట్టడానికి కేటాయించిన నిధులను సద్వినియోగం చేస్తూ పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీర్లకు,జిల్లా విద్యాశాఖ అధికారికి, ఎంఇఒలకు సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



### డ్రగ్ రహిత ఉద్యమంలో అందరం భాగస్వాములమవుదాం




డ్రగ్‌రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న ఉద్యమంలో అందరం భాగస్వాములవుదామని కలెక్టర్ కె.శశాంక పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఫ్యాబ్ సిటీ ఆవరణలో జిల్లా పోలీస్, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖాలు సంయుక్తంగా నిర్వహించిన వాక్ తాన్ కార్యక్రమంలో కలెక్టర్ శశాంక, రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. డ్రగ్స్‌రహిత సమాజం కోసం సమాజంలోని అన్నివర్గాలు సమిష్టిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ తెలిసి, తెలియక మత్తు పదార్థాల బారిన పడడం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, డ్రగ్స్‌మీద పోలీసులు చేస్తున్న పోరాటంలో యువత తమవంతు భాధ్యత నిర్వహించాలని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతో పాటు, తమదృష్టికి వచ్చే నిషేధిత డ్రగ్స్ సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో కందుకూర్ ఆర్‌డిఒ సూరజ్‌కుమార్, మహిళా శిశుసంక్షేమశాఖ అధికారి పద్మజా రమణ, మహేశ్వరం డిసిపి సునీతరెడ్డి, క్రైమ్ డిసిపి అరవింద్‌బాబు, ఉమెన్ సేఫ్టీ డిసిపి ఉషావిశ్వనాథ్, ఎసిపి నరేందర్‌గౌడ్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** చిన్నచింతకుంట మండలంలో జిల్లా కలెక్టర్ బి.విజయేందిర బోయి గురువారం పర్యటించారు. తొలుత ఎంపిడిఓ కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేసి ప్రజాపాలన సేవ కేంద్రం ద్వారా ప్రజా పాలన దరఖాస్తులలో సవరణ తీరును పరిశీలించారు. కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేసి ధరణి పెండింగు దరఖాస్తులు పై సమీక్షించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం తనిఖీ చేశారు. వైద్య సేవలు గురించి ప్రజలతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అగ్రో రైతు సేవ కేంద్రం 2 తనిఖీ చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. రైతులతో విత్తనాలు ఎరువులు లభ్యత గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. విత్తనాలు, ఎర్బుల కొరత లేదని తెలిపారు. తర్వాత కెజిబివి ని తనిఖీ చేశారు. కెజిబివిలో విద్యార్థిని లతో మాట్లాడారు. ఆహార నాణ్యత మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులు ఉన్నారు.



## ఖాతాదారుల సంక్షేమం కోసం పని చేయాలి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ఖాతాదారుల సంక్షేమం కోసం పనిచేయాలి అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో ది పాలమూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఏవిధమైన ఒడిదుడుకులు లేకుండా ఖాతాదారులకు సేవలందిస్తున్న మిమ్మల్ని అభినందిస్తున్నాను అని ఆయన చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే ని కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కండె కుమారస్వామి, కొండా చక్రధర్ గుప్త, నాగయ్య, గుండ వెంకటేశ్వర్లు, కన్నయ్య శెట్టి, నాగజ్యోతి, రామగిద్ద జ్యోతి, పుల్లా శ్రీనివాస్, బెజ్జుగం రాఘవేందర్, రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## నష్టపరిహారం చెక్‌ల పంపిణీ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** విద్యుత్ షాక్ ద్వారా మృతి చెందిన గొర్రెలకు బర్రెలకు సంబంధించి వాటి యజమానులకు విద్యుత్ శాఖ నుంచి వచ్చిన నష్టపరిహారాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు చెక్‌లను అందజేశారు. ఎమ్మెల్యే నుండి విద్యుత్ శాఖ నుండి వచ్చిన నష్టపరిహారాన్ని అందుకున్నవారు జమిస్తాపూర్ సత్తయ్యకు రూ.7000 ఒబులాయపల్లి నర్సింహులుకు రూ.40000 క్రిష్టయ్యకు 14000 ల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎడిఇ మద్దిలేటి ఇంచార్జి ఎఇ రూరల్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు



**ప్రజాపక్షం/నర్వ :** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఎం.మల్లేష్ ఎస్జిటికి తెలంగాణ ప్రభుత్వ బుధవారం కల్పించిన ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఎస్సే మ్యాతమేటిక్స్ గా పదోన్నతి లభించింది. ప్రస్తుతం మల్లేశ్ నర్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంతకుముందు ఉట్కూర్ మండలం బిజ్వార్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై నర్వకు వచ్చారు. నర్వలో ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి పాఠశాలలో వివిధ రకాల కార్యక్రమాలు, కొత్త కొత్త పద్ధతుల ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు కృషి చేసి విద్యార్థులను తీర్చిదిద్దారు. విద్యాబోధనలో తనకంటూ ఓ గుర్తింపును తెచ్చుకున్నాడు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో ఎంతో కృషి చేశారు. ప్రతి విద్యార్థి ఇంటి దగ్గరకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలకు తీసుకొచ్చేవారు నర్వ పాఠశాలలో విధులు నిర్వహించి మంచి పేరును సంపాదించారు. ముఖ్యంగా పాఠశాలలో, నర్వ గ్రామంలో తనకంటూ ఓ ముద్ర వేసుకుని స్కూల్ అసిస్టెంట్ గా ప్రమోషన్ పొందడంతో పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలిపారు.




## బస్సు ప్రారంభం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి సతీమణి కూచుకుళ్ల సౌభాగ్యమ్మ పేరుపై మెడికల్ కళాశాలకు బస్సును అందజేశారు. మెడికల్ కళాశాలకు అందజేసినబస్సును మంత్రి జూపల్లికృష్ణారావు ప్రారంభించారు. కూచుకుళ్లఫౌండేషన్ మెడికల్ కళాశాల విద్యార్థులసౌకర్యార్థం కోసం బస్సును ఉచితంగా అందజేశామని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డినారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు గౌరవమైన పాలన



### జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి నిధులద్వారా రూ.50లక్షలు
### ఇకపై ప్రతిరెండునెలలకు ఒకసారి సమీక్ష : మంత్రి జూపల్లికృష్ణారావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రజల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఈప్రజాప్రభుత్వంలో ప్రజలకు గౌరవంతమైన పాలన అందించేందుకు అధికారులు జవాబుదారితనంగా పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటకశాఖమంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా ఐడిఓసి సమావేశమందిరంలో జిల్లా అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధ్యక్షతన శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, గోరేటివెంకన్న, అచ్చంపేట ఎంఎల్ఏ డాక్టర్ వంశీకృష్ణ , కల్వకుర్తి ఎంఎల్ఏ కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంఎల్ఏ రాజేష్‌రెడ్డిలతో కలిసి నీటిపారుదల రెవెన్యూ, వైద్య ఆరోగ్య, మెడికల్ కళాశాల, విద్యుత్, పౌరసరఫరాలు, మిషన్‌భగీరథశాఖలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగామంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు జవాబుదారితనంతో పనిచేయాలన్నారు. ప్రజలకు మెరుగైనసేవలు అందించి ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకంకలిగేలా అధికారుల చర్యలు ఉండాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ సమస్యలపై ప్రజలకు అధికారులు గౌరవిస్తూనే వారి సమస్యల పరిష్కారానికి చొరవచూపాల్సిన బాద్యత అధికారులపైనే ఉంటుందని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచారహక్కుచట్టంతో పనిలేకుండానే ప్రతి ఒక్కరికి కావాల్సిన సమాచారాన్ని అందించాలన్నారు. ఇది ప్రజాప్రభుత్వమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఇందిరమ్మపాలన అందించాలని కృతనిశ్చయంతో ప్రభుత్వం పనిచేస్తుందని, అధికారులు అదేవిధంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని రైతులందరికి సాగునీరు అందించేందుకు జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అభివృద్ధికి నిధులకు ఎలాంటి కొదవలేదని, ఆయాశాఖల అధికారులు తమశాఖల్లో అభివృద్ధిపనుల పురోగతిలో వేగం పెంచాలన్నారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని వేగవంతంగా పూర్తిచేసేందుకు కావాల్సిన భూసేకరణ పనులను అధికారులు వెంటనే పూర్తి చేయాలని అందుకు అనుగుణంగా రానున్న ఆరుమాసాల్లో ప్రాజెక్టును పూర్తిచేసి ఆయకట్టుపరిధిలోని ప్రతి ఎకరానికినీరు అందించేలా అధికారులు కృషిచేయాలన్నారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఇప్పటికే అధికభాగం పనులు పూర్తయినందున మిగిలిపోయిన పనులు పూర్తిచేసేందుకు ఆయకట్టుపరిధిలోని ప్రతి రైతు పొలానికి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కాల్వల్లో జనుము, చెత్త తొలగించేందుకు ఇంజనీరింగ్ అధికారులతో కావాల్సిన ఎస్టిమేషన్ నివేదికలను రూపొందించాలన్నారు. అదేవిధంగా ధరణి సమస్యల పరిష్కారానికై ప్రతి గ్రామంలోని రైతులనుండి వివరాలను స్వీకరించేందుకు ప్రత్యేక ప్రొఫార్మాలను రూపొందించి భూయజమానిపేరు, భూమి అతనికి ఎలా వచ్చింది పూర్తిస్థాయి వివరాలను నమోదుచేసి ధరణి సమస్యల పరిష్కారానికి నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రానికి ఓరోల్‌మోడల్‌గా నిలిచేలా ధరణి సమస్యల పరిష్కారం జరగాలన్నారు. జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి తన నిధులనుండి 50లక్షల రూపాయలను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో కావాల్సిన మౌలిక సదుపాయాలతో పాటు సిబ్బంది వసతులకుకావాల్సిన పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సీతారామారావు, చీర్ల శ్రీనివాసులు, జిల్లా అటవిశాఖ అధికారి రోహిత్‌గోపిడి, శాఖల జిల్లా అధికారులు, ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు అండగా ప్రభుత్వం
### మంత్రి జూపల్లికృష్ణారావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** దివ్యాంగులకు రాష్ట్రప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఆసరా ఫించన్‌తోపాటు బ్యాటరీ ట్రైసైకిళ్ళ,వీల్‌చైర్లువంటి ఉపకరణాలు అందజేస్తూవారికి రాష్ట్రప్రభుత్వం ప్రోత్సహాన్ని అందిస్తున్నదని రాష్ట్ర ఎక్సైజ్‌పర్యాటకశాఖమంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా మహిళా శిశు, దివ్యాంగ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జూపల్లికృష్ణారావు లబ్దిదారులైన దివ్యాంగులు 3 బ్యాటరీవీల్‌చైర్లు , 8 మూడుచక్రాల స్కూటర్లు, 7హియరింగ్ పరికరాలు, 5ట్రైసైకిళ్లు, 14జిస్మార్ట్‌ఫోన్, మూడు చేతికర్రలను లబ్దిదారులకు పంపిణీచేశారు. 30మంది లబ్దిదారులకు దాదాపుగా 20లక్షల రూపాయల పరికరాలను దివ్యాంగులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, ఎమ్మెల్సీ కూచుకుళ్లదామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డినారాయణరెడ్డి, జిల్లా మహిళాశిశుసంక్షేమశాఖ అధికారిణి రాజేశ్వరి పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశం పాల్గొన్న చిన్నారెడ్డి

**ప్రజాపక్షం / శ్రీరంగాపురం :** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ గాయత్రి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్న రెడ్డి మాట్లాడుతూ మండలంలో జరిఇగిన అభివృద్ధి నిధుల కేటాయింపు సమస్యల పైన అధికారులను అడిగి తెలుసుకోవడం జరిగింది. మండలంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రత్యేక దృష్టి కేటాయించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సమావేశంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, జడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ , ఎమ్మార్వో మురళిగౌడ్ , ఎంపీడీఓ రవీందర్ , స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలలు సిద్ధం చేయాలి

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం ఉదయం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతి, విద్యార్థుల ఏకరూప దుస్తుల పంపిణీ మీద ఇంజనీరింగ్ , విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 329 పాఠశాలలన ఎంపిక చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కింద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పనులు ప్రారంభించి ఇప్పటికే పనులు పూర్తి అయిన వాటికి మండలానికి మూడు చొప్పున ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మరికొన్ని పాఠశాలల్లో పనులు కొనసాగుతున్న వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యిందని, ఏ పాఠశాల ఏ తేదీన పూర్తి చేసి ఇస్తారో లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని కార్య నిర్వహక ఇంజనీర్లను ఆదేశించారు. పనులు పూర్తి అయిన వాటిని మండల విద్యా అధికారులు పరిశీలించి ప్రధానోపాధ్యాయునీ తో కలిసి పని సంతృప్తికరంగా పూర్తి అయినట్లు ధృవీకరణ పత్రం సమర్పించాల్సిందిగా ఆదేశించారు.

## బాధితుడికి నష్టపరిహారం చెక్కు అందజేత

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో గొర్రె పిల్లలు మృతి చెందడంతో బాధితుడికి విద్యుత్ శాఖ అధికారులు నష్ట పరిహారం చెక్కును అందజేశారు. మండల పరిధిలోని కాల్వరాల గ్రామానికి చెందిన పోచమోని వెంకటస్వామి చెందిన నాలుగు గొర్రె పిల్లలను గత సంవత్సరం మేతకు తీసుకువెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మరణించడం జరిగింది. గొర్రె పిల్లలు మృతి చెందిన విషయాన్ని బాధితుడు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అధికారులు పోచమని వెంకటస్వామికి మృతి చెందిన గొర్రె పిల్లలకు నష్టపరిహారం రూ. 28వేల చెక్కును అందించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు చక్ర వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ గౌడ్ , రాముడు, శ్రీను ఉన్నారు.

## హెచ్‌సియువిసి దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో హెచ్‌సియూ వి.సి. దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం. ఆది మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో వీసీ గెస్ట్ హౌస్ ముందు స్టూడెంట్స్ యూనియన్ హక్కుల కోసం నిరసన తెలియజేసినందుకు విద్యార్థుల చేత ఎన్నుకోబడ్డ స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్ , మాజీ విద్యార్థి సంఘం నాయకులను ఎస్ఎఫ్ఐ నాయకులను మొత్తం ఐదుగురిని క్యాంపస్ నుంచి సస్పెండ్ చేస్తూ మరో ఐదు మంది విద్యార్థులకు పదివేల ఫైన్ వేస్తున్నట్లుగా యూనివర్శిటీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ నిరసన తర్వాత విద్యార్థులపైన పోలీసులు కేసులు పెట్టడమే కాకుండా విద్యార్థులను యూనివర్శిటీ నుంచి వెలివేస్తూ సస్పెన్షన్ నిర్ణయం తీసుకుంది. ఈ సస్పెన్షన్ తో వారి చదువులు , స్కాలర్‌షిప్ అన్ని ప్రశ్నార్థకంలో పడనున్నాయి. తక్షణమే సస్పెన్షన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ప్రజాస్వామ్యవాదులందరూ దీనిని తీవ్రంగా ఖండించి జరగబోయే ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి, జిల్లా కమిటీ సభ్యులు భఅత్ , సాయికుమార్ , స్వాములు, వెంకటేష్ , మహేష్ పాల్గొన్నారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలి
### హైకోర్టులో వాదనలు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా ప్రజాక్షేత్రంలో గెలిచి కాంగ్రెస్ చేరిన ఖైరతాబాద్, భద్రాచలం, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, కడియం శ్రీహరిలపై పార్టీ పిరాయింపుల చట్టం కింద చర్యలు తీసుకోవాలంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్ వేసిన వ్యాజ్యాలను గురువారం హైకోర్ట విచారించింది. తదుపరి విచారణ జులై 3న చేస్తామని జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి గురువారం ప్రకటించారు. సీనియర్ అడ్వొకేట్ సి. ఆర్యమ సుందరం వాదన చేయరాదని ఎజి ఎ.సుదర్శన్‌రెడ్డి కోరారు. అందుకు న్యాయమూర్తి నిరాకరించారు. సుందరం వాదిస్తూ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్పీకర్‌కు ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా స్పీకర్ చర్యలు తీసుకోవాలన్నారు. స్పీకర్‌కు గత మార్చి 18న ఫిర్యాదు చేశామని, ఆ తర్వాత నెల 10వ తేదీన హైకోర్టులో రిట్ పిటిషన్ వేశామని, ఇప్పటి వరకు స్పీకర్ పార్టీ పిరాయింపుదారులకు నోటీసు కూడా ఇవ్వలేదని చెప్పారు. స్పీకర్ స్థానంలో ఉన్న వాళ్లు రాజ్యాం విధులను నిర్వహించాలన్నారు. హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ అందినట్లు నిర్ధారణ అయిన 3 నెలలు దాటాకు కూడా నోటీసు ఇవ్వలేదన్నారు. అసెంబ్లీ రూల్ 6 ప్రకారం స్పీకర్ తన ముందున్న ఫిర్యాదుపై చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల ఓటుతో వెలువరించిన తీర్పును ఎమ్మెల్యేలు కాలరాశారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పులో స్పీకర్‌కు పిటిషన్ అందిన మూడు నెలల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని చెప్పిందని, ఈ విధంగా చేయనిపక్షంలో తిరిగి కోర్టు తలుపులు తట్టేందుకు వీలుకల్పించిందని చెప్పారు.

## వడ్డీల పేరుతో మోసం ... లబోదిబోమంటున్న బాధితులు

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** బావ బామ్మర్దులు ఇరువురు కలిసి వడ్డీ వ్యాపారం పేరుతో ప్రజలను మోసం చేసి ఉన్న ఆస్తులను అమ్ముకొని ఐపి దాఖలు చేసి గ్రామం నుంచి ఉడాయించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన బొలమోని ఆంజనేయులు పెబ్బేర్ పట్టణానికి చెందిన అతని బావమర్ది గోనెల సురేష్ ఇరువురు కలిసి పెబ్బేర్ పట్టణంలో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నట్లు బాధితులు తెలిపారు. బొల్ల మౌని ఆంజనేయులు స్వగ్రామమైన గోవర్ధనగిరి లో రైతులతో వ్యవసాయ కూలీలతో తాము దాచుకున్న డబ్బులను తమ ఫైనాన్స్ లో పెడితే అధిక వడ్డీ వస్తుందని నమ్మబలికి వారి నుంచి అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు బాధితుల్లో కొందరు ఆకుల మోని విజయ్ కుమార్ , నాగన్న, చిన్న మద్దిలేటి, బొర్రెల్లి చంద్రమ్మ, బిసన్న, మధుగం, కురుమయ్య, కోల కృష్ణయ్య, తెలుగు మంగమ్మ, ప్రతాప్ రెడ్డి, వెంకటేశ్వర్లుతో పాటు మరో 12 మంది బాధితులు తాము సుమారు 90 లక్షల వరకు వడ్డీ రూపకంగా ఇచ్చి మోసపోయామని వాపోయారు. వడ్డికి ఇచ్చిన డ్బబులను ఇవ్వమని అడుగగా పొలం, ఇల్లు అమ్మి ఇస్తానని చెప్పాడని వాపోయారు. బొలెమోని ఆంజనేయులు గ్రామంలో తన పేరుతో ఉన్న సర్వే నంబర్ 313లో మూడు ఎకరాల 20 గుంటల భూమిని, పెబ్బేర్ పట్టణంలో ఉన్న సొంత ఇంటిని కోట్ల రూపాయలకు ఇతరులకు అమ్ముకొని ఐపి దాఖలు చేసి బావ బామ్మర్ది ఇద్దరు ఉండయించారని బాధితులు తెలిపారు. న్యాయం చేయాలని డిప్యూటి తహసీల్దార్ కృష్ణమూర్తికి బాధితులు వినతి పత్రం అందజేశారు.



## నేడు బిజెపి లోక్‌సభ సభ్యుల ఇళ్ల ముట్టడి
### పిలుపునిచ్చిన విద్యార్థి ఐక్యకార్యాచరణ కమిటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా నేడు తెలంగాణ విద్యార్థి ఐక్యకార్యాచరణ సమితి(విద్యార్థి జెఏసి) బిజెపి లోక్‌సభ సభ్యుల ఇళ్ల ముట్టడికి పిలుపునిచ్చింది. నీట్ పరీక్ష సమస్యపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ నిర్లక్ష్యపు వైఖరిని విద్యార్థి జెఏసి నేతలు తీవ్ర స్థాయిలో విమర్శించారు. నీట్ విద్యార్థుల సమస్యలపై ఇప్పటి వరకు మాట్లాడని తెలంగాణ రాష్ట్ర బిజెపి లోక్‌సభ సభ్యులు తీరును నిరసిస్తూ యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నేడు బిజెపి లోక్‌సభ సభ్యుల ఇళ్ల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఐక్యకార్యాచరణ సమితి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ను ఎంఎల్‌సి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మూర్తి (ఎస్ఎఫ్ఐ), డి. రామ కృష్ణ, మహేష్ (పిడిఎస్‌యు), ఎం.డి. జావీద్ (డివైఎఫ్ఐ), కల్లూరు ధర్మేంద్ర, నెర్లకంటి శ్రీకాంత్ (ఎఐవైఎఫ్), కె.ఎస్.ప్రదీప్ (పివైఎల్) హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎంపి ఇళ్ల ముట్టడి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నీట్ బాధిత విద్యార్థులతో కలిసి నిర్వహిస్తున్నామని ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తుపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. గత 10 సంవత్సరాలుగా బిజెపి హయాంలోనే టెస్టింగ్ ఏజెన్సీలు పరీక్ష నిర్వహణలో పూర్తిగా వైఫల్యం చేదాయని మండిపడ్డారు. వాటి మూలంగానే విద్యార్థుల బంగారు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పచెప్పి, మళ్లీ పరీక్షను నిర్వహించాలని నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర గవర్నర్‌ను కలిసేందుకు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సమయం కోరామని, గవర్నర్ పిలుపుకోసం వేచి చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ శ్రీకర్, ఎస్ఎఫ్ఐ అశోక్ రెడ్డి,రజినీకాంత్, పిడిఎస్‌యు, సాయి కృష్ణ, శ్రీహరి, అనీల్, ఎఐవైఎఫ్ శ్రీమాన్, షేక్ మహమూద్, మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, అనీల్ కుమార్, బాలు, డివైఎఫ్ఐ, హష్మీబాబు, పివైఎల్, బి.ఎస్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కొందరు పార్టీని వీడినంత మాత్రానా ఏమీ తేడా రాదు
### బిఆర్ఎస్ ఎవరికి అవకాశమిస్తే.. వారే సిపాయిలు : కెసిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొందరు పార్టీని వీడినంత మాత్రాన బిఆర్ఎస్‌కు ఎటువంటి తేడా రాదని బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. బిఆర్ఎస్ ఎవరికి అవకాశమిచ్చినా వారు సిపాయిలుగానే మారుతారన్నారు. ఆర్మూర్,హుజూరాబాద్ నియోజక వర్గాలకు చెందిన నాయకులు,కార్యకర్తలు ఎర్రవెల్లిలోని కెసిఆర్ ఫామ్‌హౌజ్‌కు గురువారం వచ్చారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం వచ్చి ,తమకు కాంగ్రెస్ ద్వారా జరిగిన మోసాన్ని గుర్తించి, తిరిగి బిఆర్ఎస్‌ను ఆదరిస్తారని, అప్పటి వరకు ఓపికతో ప్రజాసమస్యలపైన దృష్టి సారించాలని, పట్టుదలతో ప్రజల నడుమనే జీవించాలని కార్యకర్తలకు సూచించారు. పదేళ్ల అనతి కాలంలోనే తెలంగాణలో అద్భుతమైన ప్రగతిని సాధించుకున్నప్పటికీ ఇటువంటి కీలక సమయంలో వచ్చిన ఎన్నికల్లో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారని, కొన్ని,కొన్ని సార్లు ఇటువంటి తమాషాలు జరుగుతుంటాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి ప్రజలు అనూహ్యంగా మోసపోయారని, పాలిచ్చే బర్రెను వదిలి దున్నపోతును తెచ్చుకున్నట్టు అయిందని ప్రజలు బాధపడుతున్నారని కెసిఆర్ అన్నారు. తెలంగాణ కోసం సాగిన 25 ఏళ్ల సుధీర్ఘ ప్రయాణం ఆగలేదని, అయిపోలేదని, నాడు ఎన్‌టిఆర్‌ను తిరిగి ప్రజలు ఎలా గద్దె మీద కూర్చోబెట్టారో ,అంతకన్నా గొప్పగా బిఆర్ఎస్‌ను ప్రజలు తిరిగి ఆదరిస్తారని బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. రెట్టింపు మద్దతుతో బిఆర్ఎస్‌ను గద్దె మీద కూర్చుండ బెట్టే రోజు త్వరలోనే వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, హుజురాబాద్ ఎంఎల్ఏ పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎంఎల్ఏలు జీవన్ రెడ్డి, కందాల ఉపేందర్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జహంగీర్, దుండిగల రాజేందర్, చైర్మన్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల చదువుతో రాజకీయాలువద్దు
### ఎంఎల్ఏ రాజేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** విద్యార్థుల చదువులో రాజకీయాలు చేయకూడదని ఎంఎల్ఏ డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. తాడూరు మండలంలోని కుమ్మెర, సిర్సవాడ గ్రామాల్లో నిర్మించిన పాఠశాలలను గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకోసం పాఠశాలల్లో కొత్త సంస్కరణలు తీసుకొస్తుందన్నారు. వచ్చే డిఎస్సిద్వారా ఖాళీగాఉన్న ఉపాధ్యాయపోస్టులను భర్తీచేస్తామని తెలిపారు. విద్యార్థులకు కుల,మతాలకు అతీతంగా చదువులుసాగేలా సిఎం రేవంత్‌రెడ్డి సంస్కరణలు తీసుకొస్తున్నారని తెలిపారు. ప్రభుత్వవిద్యను బలోపేతంచేసేందుకు విద్యాశాఖనుకూడా సిఎం స్వయంగా పర్యవేక్షిస్తున్నారని వివరించారు. సిర్సవాడ జడ్పిహైస్కూల్ ప్రభుత్వ నిధులద్వారా వెచ్చించి నిర్మించడం జరిగిందన్నారు. మాజీ ఎంఎల్ఏ ఈస్కూల్‌కాంపౌండ్‌గోడ నిర్మాణానికి 60లక్షలబిల్లు చేయించుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వబిల్లులు చేయించుకొని సొంతంగా ట్రస్టుద్వారా నిర్మించానని ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులుబాగాచదివి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి రోహిణిగోవర్దన్‌రెడ్డి, ఎంపిటిసి మల్లయ్య, మండలప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కోట్ల గౌతమ్‌కు అవార్డు ప్రదానం



**ప్రజాపక్షం/వంగూర్ :** ప్రముఖ విద్యావేత్త ,రచయిత, కవి హెలెన్‌కెల్లర్ 144వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్‌భవన్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్‌పిఆర్‌డి వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట్లగౌతమ్‌కు గురువారం రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యవర్మ సహారా డైరెక్టర్ రామ్‌తాగూర్ చేతులమీదుగా రామీజాబి అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, ప్రధాన కార్యదర్శి ఆడివయ్య, హెలెన్‌కెల్లర్ విద్యా సంస్థల యాజమాన్యం , వివిధ జిల్లాల ఎన్‌పిఆర్‌డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్ మేళా

**ప్రజాపక్షం/మేడ్చల్ :** జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో వివిధ సంస్థల్లో ఉద్యోగ నియామకాల కోసం ఈ నెల 28న ఉ:11 నుండి మ: 2 గంటల వరకు జిల్లా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎంవై నిర్మల తెలిపారు. బిగ్ బాస్కెట్ సంస్థలో వేర్ హౌస్ అసోసియేట్, యురేకా సంస్థలో సర్వీస్ టెక్నీషియన్, సీనియర్ సర్వీస్ టెక్నీషియన్, సిఆర్‌ఓ, డీమార్ట్ సంస్థలో క్యాషియర్/జిఆర్ఎన్ ఎక్జిక్యూటివ్, ఎల్&టి సంస్థలో లోన్ ప్రాసెసింగ్ ఎక్జిక్యూటివ్, జెప్టో సంస్థలో స్టోర్ ఎక్జిక్యూటివ్, షిఫ్ట్ ఇన్‌చార్జి పోస్టులు ఖాళీలు ఉన్నాయని, రూ., 15 నుండి 25 వేల వరకు నెలసరి వేతనం ఉంటుందన్నారు. పదో తరగతి కానీ ఇంటర్ కానీ ఉత్తీర్ణులైన ఆసక్తి గల నిరుద్యోగులు www.nic.gov.in.portal ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాల కోసం తమను 73 86809422 ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

## మల్కాజిగిరిలో కెసిఆర్ వెంటే బిఆర్ఎస్ శ్రేణులు



**ప్రజాపక్ష/మల్కాజిగిరి:** మల్కాజిగిరి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులంతా కెసిఆర్‌కు అండగా ఉంటారని స్థానిక ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి అన్నారు. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో స్థానిక నేత మేకల రాము యాదవ్ తదితరులు పార్టీ అధినేత కెసిఆర్‌ను కలిసారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా బిఆర్ఎస్ వెంటే ఉన్నారని, కెసిఆర్ పాలనలో కొనసాగిన అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకా కుంటు పడ్డాయన్నారు. కేవలం మాటలు తప్ప కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క హామీ నెరవేర్చలేక పోతున్నారని ఆయన విమర్శించారు.

## సారెగూడెంలో బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవాలు:ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/దుండిగల్ :**దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని సారెగూడెంలోని బంగారు మైసమ్మ తల్లి ఆలయ 5వ వార్షికోత్సవ బోనాల పండుగ జాతరలో ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారి మహేందర్ యాదవ్, కోలా సాయి యాదవ్, బౌరంపేట్ పాక్స్ చైర్మన్ మిద్దుల బాల్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ వార్డ్ సభ్యులు శ్రీశైలం, వీరాస్వామి, నాగార్జున, రామ్ బాబు,పాక్స్ డైరెక్టర్లు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షులు మచ్చేందర్, అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా బోధనా చేయాలి

ఆహ్లాదకరమైన వాతావరణంలో

జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్






**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మున్సిపల్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివారెడ్డి పెట్ ,యుపిఎస్ ఉర్దూ మీడియం స్కూల్ , మండల పరిషత్‌ప్రాథమిక పాఠశాల ఎన్నెపల్లి , అంగన్‌వాడీ కేంద్ర 1 ,జిల్లా పరిషత్ ప్రాథమికపాఠశాల వికారాబాద్ ,ఎంపిపిఎస్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలు బాగుండి, సరిఅయిన విద్యాభధనా ఉంటేనే పిల్లలు భాగా చదువుకోగలుగుతారని అన్నారు. అంగన్వాడీ కేంద్రము ప్రాథమిక పాఠశాలల నుండి పిల్లలకు ఇంగ్లీష్ పోయమ్స్ ఎబిసిడిలు చదివించారు. పిల్లలకు నోట్స్ బుక్స్ ,పెన్నులు అందజేశారు. అన్ని స్కూల్స్ లో అమ్మ ఆదర్శపాఠశాల క్రింద చేపట్టిన పనులకు పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనలో భాగంగా పాఠశాలలో మౌలిక వసతులు కల్పనలో భాగంగా పాఠశాలలో చేపట్టిన త్రాగునీరు, టాయిలెట్స్ ,మైనర్ మేజర్ రిపేర్లు ,బాలికల కోసం టాయిలెట్స్ ,విద్యుద్దీకరణ పనులు ఇప్పటివరకు ఎన్నిక పూర్తి అయినవి ,ఇంకా ఎన్నిపనులు పూర్తి చేశారు. ఇంకా చేయల్సిన పనులు పూర్తి చేశారు. ఇంకా చేయాల్సిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్కూల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ జాకీర్ అమ్మద్ ,మండలవిద్యాదికారి , బాబు సింప్ల పాఠశాలల ప్రధనోపాధ్యాయులు అనంత్‌రెడ్డి యునూష్ ,శ్రీశైలం సంబంధిత శాఖ అధికారులు పాల్గోన్నారు.

## మార్కెట్ యార్డును పరిశీలించిన జాయింట్ డైరెక్టర్



**ప్రజాపక్షం / కొడంగల్:** కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును గురువారం మార్కెట్ యార్డు జాయింట్ డైరెక్టర్ పద్మహర్ష పరిశీలించారు. సిఎం రేవంత్‌రెడ్డి సోంత నియోజకవర్గంలో మార్కెట్ యార్డు విస్తరణ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు గాను తన అధికార బృందంచే పలు కొడంగల్‌లో పర్యటించినట్లు అధికారులు పేర్కొన్నారు. గత పాలకుల పాలనలో అభివృద్ధికి అమడదూరంలో ఉన్న కొడంగల్ వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డు నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చోరవతో అభివృద్ధి వైపు అడుగులేస్తుంది. ఒకప్పుడు మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతులకు సరైన సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఉండేది. నేడు అన్ని వసతులతో పాటు గిట్టుబాటు ధర కల్పిస్తు గోదాములను ఏర్పాటు చేసే దిశగా పయనించడం అభినందనీయన్నారు. మార్కెట్ యార్డు నూతన కార్యాలయం, పచ్చదనం, పరిశుభ్రత వంటి అనేక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. వీరితో పాటు ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## వినయ్‌కు గ్లోబల్ ఇన్‌స్పైర్ అవార్డు




**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** గత కొద్ది సంవత్సరాలుగా వికలాంగుల సంక్షేమ కార్యక్రమాలను స్వచ్ఛందంగా చేస్తున్న మేడ్చల్ జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎస్ వినయ్‌ను గ్లోబల్ ఇన్‌స్పైర్ అవార్డు సత్కారం లభించింది. గురువారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర తొలి స్పీకర్ మధుసుధనాచారి ఈ అవార్డును అంద చేశారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజి, టాలీఉడ్ నటి హర్షిత, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ దినేష్ మాట్లాడుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లాలోని వికలాంగుల హక్కుల కోసం పోరాటం చేస్తుండటంతో పాటు అవసరమైన అర్హత కలిగిన వికలాంగులకు రైల్వే, బస్ పాసులను పొందటంలో కొనసాగించిన సేవలను గుర్తించి ఈ అవార్డును అందించామన్నారు.

## చేవెళ్ల అభివృద్ధికి తోడ్పాటు : స్పీకర్



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ఎమ్మెల్యే కాలే యాదయ్య కోరినట్లు చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి ఎప్పుడూ నా సహాయ సహకారాలు ఉంటాయని ప్రభుత్వం తీసుకున్న భూముల్లో కచ్చితంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్లో తహసీల్దార్ జయరాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరైయ్యారు.ఎమ్మెల్యే కాలే యాదయ్య,కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ భీం భరత్ తో కలిసి 87 చెక్కుకు రూ.87లక్షల 10 వేల 92 సంబంధించిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శాసన సభ సభపతి గడ్డం ప్రసాద్ కుమార్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు మేనిఫెస్టోలో ఉన్న ఆరు గ్యారెంటీలను ప్రతి గడపకు అందిస్తామన్నారు. ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.ఒక శాసనసభ స్పీకర్ గా ఈ అవకాశం రావడం గొప్ప వరంగా భావిస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా వికారాబాద్ జిల్లా వాసినే కావడం వల్లన మన జిల్లాకు అనేక సంక్షేమ అభివృద్ధి పనులుతీసుకువస్తానని చెప్పుకొచ్చారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కోరినట్లు గాని చేవెళ్ల నియోజకవర్గంలో ఆగిపోయినటువంటి బ్రిడ్జిలను మంజూరు చేసి నిధులు తీసుకోవచ్చి చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడుతానని హామీ ఇచ్చారు. పార్టీలు వేరైనాప్పటికీ చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యకు అభివృద్ధిలో పూర్తిగా నా మద్దతు ఉంటుందని అన్నారు.

**కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ కార్యక్రమం తీసుకువచ్చిందే బిఆర్ఎస్ ప్రభుత్వం: చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**

భారతదేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో 13 వంతెనలకు టుమారో 6 నుండి 7 మాత్రం పూర్తయ్యాయని మిగిలినవన్నీ పెండింగ్లోఉన్నాయని అన్నారు. పెండింగ్లో ఉన్నటువంటి వంతెనలకు నిధులు మంజూరు చేసి ప్రజల సమస్యను పరిష్కరించాలని చెప్పారు. శంకర్పల్లి నుండి మర్పల్లి వరకు గుంతలుగా ఏర్పడిన రోడ్డును నూతనంగా నిర్మించాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ని కోరారు. ఆర్డివో, ఎంపిడివో అనురాధ,పిఎసిఎస్ చైర్మన్ రాం రెడ్డి, ఎంపీటీసీల మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డి, ఎంపీటీసీలు యాదయ్య,విజయ్ కుమార్,బి బ్లాక్ అధ్యక్షులు మధుసుధన్ రెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు నాగిరెడ్డి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్స్ సామ వెంకట్ రెడ్డి, కొండల్ యాదవ్, ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శివప్రసాద్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి గణపురం ప్రసాద్, నాయకులు మల్లారెడ్డి, రావుగారి వెంకట్ రెడ్డి, ప్రభాకర్, ఆనంద్ రెడ్డి, రంగారెడ్డి, రఫి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సిఎం కెసిఆర్ సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి



**ప్రజాపక్షం/నవాబుపేట్:** తెలంగాణ లో మాజీ సిఎం కెసిఆర్ చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్థాయని నవాబ్ పేట్ మండల బిఆర్ఎస్ నాయకులు శాంతకుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు శాంతకుమార్ మాజీ సిఎం కెసిఆర్‌ని ఎర్రవల్లిలోని ఆయన ఫామ్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ సీఎం మండల నాయకులను వారి సమాచారాన్ని, వారు పార్టీకి అందించిన సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మండల నాయకుడు శాంతకుమార్ మాట్లాడుతూ మాజీ సీఎం,ఉద్యమ నేత కేసీఆర్ ని కలవడం ఆనందంగా ఉందని అన్నారు. తెలంగాణలో మాజీ సిఎం కెసిఆర్ చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్థాయని చెప్పారు. బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఎంతో బాగుపడిందని, రైతులకు, ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా కేసీఆర్ చూసుకునేవారని అన్నారు. కాంగ్రెస్ పథకాలను నమ్మి ప్రజలు ఓటు వేసి మోసపోయారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులు తమ పంటలను సాగు చేసే ముందు పెట్టబడి కోసం వారి ఖాతాల్లో రైతు బంధు పైసలు జమచేసేది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవుతున్నా నేటికీ రైతులం దరికీ రైతుబంధు డబ్బులు జమ చేయలేదని తెలిపారు.

## కుత్బుల్లాపూర్‌లో మీ సేవలు మరువలేనివి




**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** ఐడిపిఎల్ లోని వాటర్ వర్క్స్ కార్యాలయంలో నిర్వహించిన జిఎం శ్రీధర్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనేది తప్పదని నిత్యం ప్రజలకు సేవ చేయాలనే మీలాంటి ఉద్యోగి పదవీ విరమణ పొందడం కొంత బాధాకరమైన కుత్బుల్లాపూర్ లో మంచినీటి సమస్య పరిష్కారానికి మీరు చేసిన సేవలు మరువలేవన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఎర్ర శంకరయ్య, జలమండలి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ వాహనాలు వద్దు.. ఆర్‌టిసి బస్సులు ముద్దు



**ప్రజాపక్షం / కొడంగల్ :** ప్రైవేట్ వాహనాలు వద్దని.. ఆర్‌టీసీ బస్సులే ముద్దు అంటు తాండూర్ డిపో మెనెజర్ సమత అన్నారు. గురువారం కొడంగల్ ఆర్‌టీసీ బస్టాండ్‌లో ఆర్‌టీసీ బస్సు ప్రయాణాలపై కళాకారుల బృం దాలచే ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత ఆర్‌టీసీ బస్సు ప్రయాణాన్ని కల్పించడం ఎంతో సంతోషకరమని అందుకు ప్రతి ఒక్కరు కూడా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. విద్యార్థులకు, జర్నలిస్టులకు, వికలాంగులకు, రాయితీ బస్సు పాసులు కల్పించడం జరిగిందన్నారు. కళాకారుల ఆటపాటలతో బస్టాండ్‌లో హోరెత్తించారు. అసిస్టెంట్ మెనెజర్ నిర్మాల, కంట్రోలర్ చారి, నవీన్, మోధిన్, శేఖర్‌లతో పాటు సిబ్బంది తదితరులున్నారు.

## స్పీకర్ ప్రోగ్రాంలో ప్రోటోకాల్ రచ్చ!



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ పట్టించలేదని రచ్చ కు దారితీసింది. చేవెళ్ల నియోజకవర్గం నవాబ్ పేట్ మండలంలో శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పర్యటన నేపథ్యంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గురువారం వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర శాసన సభపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరైయ్యారు. ముందుగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ఎలాంటి పదవులు లేకుండా కాంగ్రెస్ నాయకులు వేదిక మీద కూర్చోవడంతో ఎమ్మెల్యే కాలే యాదయ్య అసంతృప్తితో పాటు ఆగ్రహానికి లోనయ్యారు. అధికారిక కార్యక్రమంలో ఎలా మెలగాలో అనేది రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఉన్న మీకంటే ఎక్కువ నాకు తెలియదు అని అధికారులకే తెలుసని ఏదేవా చేశారు. సీఐ ఆంజనేయులు, ఎస్సై భరత్ భూషణ్ తన సిబ్బందితో కలిసి ఎలాంటి ఘటన జరగకుండా అటు బిఆర్ఎస్,ఇటు కాంగ్రెస్ నాయకులను శాంతింప చేసి కార్యక్రమం ముందుకు సాగేలా చేశారు.

## నివాస ప్రాంతంలో సెల్ టవర్ తొలగించాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** తిరుమలనగర్ కాలనీలోని పిఎన్ క్లాసిక్ అపార్ట్‌మెంట్ పై ఏర్పాటు చేసిన జియో సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని స్థానికులు గురువారం జిహెచ్ఎంసి ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. నివాసప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ సెల్ టవర్ ద్వారా వెలువడే రేడియేషన్ వల్ల ఇటీవలి కాలంగా స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారని వారు తెలిపారు. డబ్బుల కోసమే కాకుండా అపార్ట్‌మెంటు యాజమాన్యం స్థానికుల ఆరోగ్యం గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తిరుమలనగర్ ప్రాంతానికి చెందిన బాలరాజు, శ్రీపాద మల్లేష్, బ్రహ్మచారి, స్వయంప్రకాష్, పిఎస్ఆర్ మూర్తి తదితరులు జోనల్ కమిషన్‌ర్‌ను కల్సిన వారిలో ఉన్నారు.

## పట్టణ రోడ్లకు మరమ్మతులు చేపట్టండి

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణంలో రోడ్ల నిర్మాణం పనులతో పాటు మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని ఆర్అండ్‌బి డీఈ శ్రీనివాస్ తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ కోరారు. గురువారం చైర్‌పర్సన్ తన కార్యాలయంలో ఆర్అండ్‌బి డిఈ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. పట్టణంలో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని, వాటిని వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని, అందుకు గాను అధికారులు సహకరించాలని అధికారులకు సూచించారు. పట్టణాభివృద్ధిలో అధికారుల సహకారం అవసరమన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్వాహకం

బాలికలచేతా బెంచీలు మోయించిన వైనం

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్వహకంతో కళాశాలకు వచ్చే బాలికలచే బేం జీలు మోయించారు. కళాశాలకు చదువుకోవడానికి వచ్చే విద్యర్థులకు విద్యబుద్దులు నేర్పించాల్సిన అద్యాపకులే విద్యార్థినులచే బేంచిలు మో యించడం చర్చనీయాంశంగా మారింది. అయితే పాత భవనంలో స్థా నంలో నూతన కళాశాల భవనం నిర్మించిన విషయం తెలిసిందే. ఇటీవ లే కళాశాల నూ తన భవనాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. కళాశాల భవనం ప్రా రంభించినప్పటికి తళాలను అప్పగించక పోవడంతో తరగతులు కొనసాగ లేదు. ఇటివల పలు విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టడంతో కళాశాలను తెర్చారు. తరగతి గదులను ప్రారంభించినప్పటికి అందులో నేటి వరకు బేంచీలు వేయించక పోవడం గమనర్హాం. గురువారం కళాశాలకు వచ్చిన విద్యర్థినులైన బాలికచేత ప్రిన్సిపల్ బేంచీలను మోయించాడు. దీంతో బాలికలు పడరాని పాట్లు పడ్డారు.. ఇది చూసినవారు ప్రిన్సిపాల్ నిర్వహకం పట్ల శాపనార్థలు పెట్టారు.

## ఆగిన పనులను వెంటనే పూర్తి చేయాలి

జలమండలి జిఎంకు కార్పొరేటర్ వినతి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** వినాయకనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలకు సంబంధించి నిలిచి పోయి ఉన్న పలు పనులను వెంటనే పూర్తి చేయాలని వినాయకనగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి జలమండలి జనరల్ మేనేజర్ వి.అశోక్‌ను కోరారు. జలమండలి జిఎంగా నూతనంగా బాధ్యతలు తీసుకొన్న ఆయనను కార్పొరేటర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఓంప్రకాష్, గోపాల్, శ్రీకాంతయాదవ్, జగదీష్ చారిలతో గురువారం కల్సి శాలువాతో సత్కరించారు.డ్రైనేజి సంబంధిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఎక్కడా మురికి నీరు పారకుండా చూడాలని, మ్యాన్‌హోల్స్ మూతలు సరిగ్గా ఉండేట్లు చూడాలని ఆమె కోరారు.

## 29న క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలల్లో నాలుగవ తరగతిలో ప్రవేశాలకు గాను ఈ నెల 29న శనివారం హకీంపేటలోని తెలంగాణా స్పోర్ట్స్ స్కూల్ ప్రాంగణంలో ప్రవేశ పోటీలు నిర్వహిస్తున్నామని మేడ్చల్ జిల్లా యువజన క్రీడల శాఖాధికారి జి.వి. గోపాలరావు పేర్కొన్నారు. ఎత్తు, బరువు, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, షటిల్, పరుగు, బాల్ త్రో, 800 మీటర్ల పరుగుల క్రీడా సంబంధిత పోటీలు ఉంటాయన్నారు. 8నుండి 9సంవత్సరాల మధ్య ఉన్న మేడ్చల్ జిల్లాకు చెందిన తమ కుల, వయస్సు, మూడవ తరగతి ప్రోగ్రెస్ రి పోర్టు, తాజాగా తీయించుకొన్న ఐదు పాస్ పోర్టు ఫొటోలు, ఆధార్ కార్డులు వెంట తీసుకొని రావాలని ఆయన సూచించారు.

## బిసి కులాల అభివృద్ధి కోసం పాటుపడాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** బిసి కులాల అభివృద్ధి కోసం పాటుపడుతున్న బిసి కులాల ఐక్యవేదిక మల్కాజిగిరి నియోజకవర్గ కార్యదర్శి పిట్టల భాస్కర్ మరింత సేవలందించాలని సంఘ ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి అన్నారు. భాస్కర్ జన్మదిన వేడుకలు గురువారం నాడు భరత్‌నగర్‌లోని బిసి భవన్‌లో ఘనంగా జరిగాయి. బిసి కులాల ఐక్య వేదిక అధ్యక్షులు కామల్ల ఐలన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు బత్తిని నర్సింహగౌడ్, జిణికుంట్ల రమేష్‌గౌడ్, కార్యదర్శులు కాసర్ల నాగరాజు, పేపర్ శ్రీనివాస్ నేత, జోగు శ్రీనివాస్ కురుమ, మల్కాజిగిరి ముదిరాజ్ సంఘ అధ్యక్షులు చెరుకు సాంబరాజ్, ఎం.నర్సింగరావు, కె.ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భాస్కర్‌ను పూలమాలలతో సత్కరించారు.

## బాచుపల్లి ఫ్లైఓవర్ పనులు త్వరితగతిన పూర్తి

ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/దుండిగల్ :** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని బాచుపల్లి ఫ్లైఓవర్, బాచుపల్లి బౌరంపేట్, బహదూర్ పల్లి కొంపల్లి రోడ్డు విస్తరణ పనులపై హెచ్ఎండిఏ, వాటర్ వర్క్స్, అటవీ, రెవెన్యూ, మున్సిపల్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 3.97 కోట్ల రూపాయలతో శంకుస్థాపన జరిగి నేటికీ పూర్తి కానీ బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా బాచుపల్లి నుంచి మల్లంపేట వరకు 1.64 కోట్ల రూపాయలతో 1.20 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను, మల్లంపేట్ నుంచి బౌరంపేట వరకు 2.07 కోట్ల రూపాయలతో సుమారు 4.80 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు, గండి మైసమ్మ నుంచి బహదూర్ పల్లి వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనుల్లో ట్రాన్స్ఫార్మర్ల షిఫ్టింగ్, కరెంటు పోల్ షిఫ్టింగ్ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ, కొంపల్లి కమిషనర్ శ్రీహరి, ఎమ్మార్వో మతిన్, హెచ్ఎండిఏ అధికారులు యూసుఫ్ హుస్సేన్, అప్పారావు, హరికృష్ణ, వేణుగోపాలరావు, రమేష్ బాబు లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు సామాగ్రి అందజేత

మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/దుండిగల్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి కమిషనర్ రామకృష్ణారావు ప్రజాప్రతినిధులతో కలిసి మున్సిపల్ కార్మికులకు వర్షా కాలం దృష్ట్యా వారి భద్రతకు రెయిన్ కోర్ట్స్, బూట్లు, సబ్బులు, యూనిఫామ్స్, కొబ్బరి నూనె, టార్చ్ లైట్, టవల్, వంటి సామగ్రి తో కూడిన కిట్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆగం పాండు ముదిరాజ్, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, కాసాని సుధాకర్ ముదిరాజ్, గంగెయ్యల శ్రీనివాస్ యాదవ్, లక్ష్మీ కుమారి, సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్, సురేంద్ర కుమార్ యాదవ్, ఎన్ఎంసి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి అధ్యక్షతన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రామకృష్ణారావు తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పెండింగ్ మరియు అభివృద్ధి పనులపై,అదే విధంగా వర్షా కాలం దృష్ట్యా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగు చర్యలు వంటి కీలక అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ అటెండర్లకు యూనిఫామ్స్ ను మేయర్,కమిషనర్ చేతుల మీదుగా అధికారులతో కలిసి వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ

# మెరిసిన రోహిత్, సూర్య..



పొట్టి ప్రపంచ కప్‌లో టైటిల్ వేటకు చేరువైన భారత్ సెమీస్‌లో భారీ స్కోర్ చేయలేకపోయింది. ప్రధాన ఆటగాళ్లు చేతులెత్తేసిన చోట కెప్టెన్ రోహిత్ శర్మ(56) అర్ధ శతకంతో మెరిశాడు. సూర్యకుమార్ యాదవ్(47) సైతం ధనాధన్ ఆడాడు. 40 పరుగులకే రెండు వికెట్లు పడిన దశలో.. వీళ్లిద్దరూ కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖర్లో హార్దిక్ పాండ్యా(23), రవీంద్ర జడేజా (17 నాటౌట్)లు ధాటిగా ఆడడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. గయనాలో వర్షం కారణంగా మ్యాచ్ 75 నిమిషాలు ఆలస్యంగా మొదలైంది. టాస్ గెలిచిన ఇంగ్లండ సారథి టీమిండియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. అయితే.. ధాటిగా ఆడాలనుకున్న విరాట్ కోహ్లీ(9) టాప్లే వేసిన రెండో ఓవర్లో ఔటయ్యాడు. ఆ తర్వాత రిషభ్ పంత్(4) సైతం ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. ఆ పరిస్థితుల్లోరోహిత్ మరోసారి కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. సూర్యకుమార్ యాదవ్(47)తో కలిసి విలువైన పరుగులు జోడించాడు. అయితే.. 8 ఓవర్లు ముగిశాక చినుకులు పడడంతో ఆటకు అంతరాయం కలిగింది.

**విరాట్ కోహ్లీ చెత్త రికార్డ్.!**

టీ20 ప్రపంచకప్ 2024లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వైఫల్యం కొనసాగుతోంది. ఇంగ్లండ్‌తో కీలక సెమీఫైనల్లోనూ విరాట్ కోహ్లీ దారుణంగా విఫలమయ్యాడు. 9 బంతుల్లో 9 పరుగులే చేసి వెనుదిరిగాడు. ఓ భారీ సిక్సర్‌తో దూకుడు కనబర్చిన కోహ్లీ.. అదే జోరులో భారీ షాట్ ఆడబోయి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. రీస్ టోప్లీ వేసిన మూడో ఓవర్‌లో రెండో బంతిని భారీ సిక్సర్‌గా తరలించిన కోహ్లీ.. నాలుగో బంతికి చెత్త షాట్ ఆడి ఔటయ్యాడు. టోప్లీ వేసిన గూడ లెంగ్త్ బాల్‌ను కోహ్లీ అక్రాస్‌ది లైన్ ఆడబోయి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. బంతి లోగా రావడంతో కోహ్లీ బ్యాట్‌ను మిస్సై వికెట్లను తాకింది. స్ట్రైట్‌గా బౌలర్‌పై నుంచి ఆడాల్సిన షాట్‌ను కోహ్లీ లెగ్ సైడ ఆడి మూల్యం చెల్లించుకున్నాడు. ఔటైన అనంతరం కోహ్లీ కూడా తన సైగలతో ఇదే విషయాన్ని అనుకుంటూ మైదానం వీడాడు. ఈ టోర్నీలో కోహ్లీ సింగిల్ డిజిట్‌కు పరిమితమవ్వడం ఇది ఐదో సారి. ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో రెండు సార్లు మాత్రమే రెండు అంకెల స్కోర్ చేశాడు. 2012 నుంచి టీ20 ప్రపంచకప్ ఆడుతున్న కోహ్లీ ఇలా ఏనాడు విఫలమవ్వలేదు. 2012 నుంచి 2022 వరకు అతను రెండు సార్లు మాత్రమే సింగిల్ డిజిట్‌కు పరిమితమవ్వగా.. తాజా ఎడిషన్‌లో మాత్రం ఐదు సార్లు సింగిల్ డిజిట్ స్కోర్లకు వెనుదిరిగాడు. ఎప్పుడూ ఫస్ట్ డౌన్‌లో ఆడే విరాట్ కోహ్లీ ఈసారి ఓపెనర్‌గా బరిలోకి దిగడం.. తన శైలికి భిన్నంగా తొలి బంతి నుంచే భారీ షాట్స్ ఆడే ప్రయత్నం చేస్తుండటంతో పరుగులు చేయలేకపోతున్నాడు.

## చరిత్ర సృష్టించిన మార్క్‌రమ్ మామ!



సౌతాఫ్రికా కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ చరిత్ర సృష్టించాడు. ప్రపంచకప్ చరిత్రలోనే సౌతాఫ్రికాను ఫైనల్ చేర్చిన తొలి కెప్టెన్‌గా అరుదైన ఘనతను సొంతం చేసు కున్నాడు. టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా గురువారం జరిగిన తొలి సెమీఫైనల్లో సౌతాఫ్రికా 9 వికెట్ల తేడాతో అఫ్గానిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్థాన్ 56 పరుగులకే కుప్పకూలింది. బ్యాటింగ్‌కు కఠినంగా ఉన్న వికెట్‌పై అఫ్గాన్ బ్యాటర్లు 12 ఓవర్లు ఆడలేకపోయారు. దాంతో అఫ్గాన్ 11.5 ఓవర్లకే ఆలౌటైంది. సఫారీ బౌలర్లలో టబ్రైజ్ షంసీ(3/6), మార్కో జాన్సన్(3/16) మూడేసి వికెట్లు తీయగా.. కగిసో రబడా(2/14) రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన సౌతాఫ్రికా 8.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 60 పరుగులు చేసి 67 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది. అఫ్గాన్ బౌలర్లలో ఫజలక్ ఫరూకీ మాత్రమే వికెట్ తీసాడు. అద్భుత ప్రదర్శనతో తొలి సారి సెమీఫైనల్ చేరిన అఫ్గాన్ అనూహ్య రీతిలో ఓటమిపాలైంది. పిచ్ నుంచి లభించిన సహకారాన్ని సౌతాఫ్రికా బౌలర్లు అందిపుచ్చుకున్నారు. శనివారం జరిగే ఫైనల్లో భారత్ వర్సెస్ ఇంగ్లండ మధ్య జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో సౌతాఫ్రికా తలపడనుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటి వరకు సౌతాఫ్రికా జట్టు ఐసీసీ ట్రోఫీ గెలవలేదు. గతంలో ఫైనల్ కూడా చేరలేదు. ఈ సారైనా ఆ ముచ్చట తీర్చుకోవాలని సఫారీ టీమ్ భావిస్తోంది. ఎయిడెన్ మార్క్‌రమ్ కెప్టెన్‌గానే సౌతాఫ్రికా అండర్ 19 ప్రపంచకప్ గెలిచింది. మార్క్‌రమ్ సారథ్యంలోనే సఫారీ టీమ్ టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి ఫైనల్ చేరింది. 2014లో మార్క్‌రమ్ సారథ్యంలోనే సౌతాఫ్రికా అండర్19 ప్రపంచకప్ గెలిచింది. అన్ని స్థాయి క్రికెట్‌లో సౌతాఫ్రికా గెలిచిన ఏకైక ఐసీసీ టైటిల్ ఇదే కావడం విశేషం. సౌతాఫ్రికా టీ20 లీగ్‌లోనూ ఎయిడెన్ మార్క్‌రమ్ కెప్టెన్సీలోని సన్‌రైజర్స్ ఈస్టేర్న్ కేప్ వరుసగా రెండు సీజన్లలో విజేతగా నిలిచింది.



## ఆ టీమిండియా పేసర్ నాకంటే గొప్ప బౌలర్: కపిల్

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ ప్రశంసల జల్లు కురిపించాడు. బుమ్రా తన కంటే ఎంతో ఉత్తమమైన బౌలర్ అని కపిల్ దేవ్ కొనియాడాడు. టీ20 ప్రపంచకప్ 2024లో జస్‌ప్రీత్ బుమ్రా అసాధారణ ప్రదర్శన కనబరుస్తున్న విషయం తెలిసిందే. సంచలన బౌలింగ్‌తో టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. వరుస విజయాలతో టీమిండియా సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. గయానా వేదికగా జరిగే సెమీఫైనల్2లో ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో ఓ ఛానెల్‌తో మాట్లాడిన కపిల్ దేవ్.. బుమ్రాతో పాటు టీమిండియా ప్రదర్శనపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీ20 ప్రపంచకప్ 2024లో బుమ్రా ప్రదర్శనను చూస్తుంటే తనకు ముచ్చటేస్తుందని కపిల్ దేవ్ అన్నాడు. వైవిధ్యమైన బంతులతో బ్యాటర్లపై బుమ్రా పూర్తి ఆధిపత్యం చెలాయిస్తున్నాడని అభినందించాడు. 'జస్‌ప్రీత్ బుమ్రా నాకంటే వెయ్యి రెట్లు అద్భుతమైన బౌలర్. ఈతరం క్రికెటర్లలో చాలా మంది మంచి నైపుణ్యం కలిగిన వారే. ప్రస్తుత టీమిండియాలో చాలా మంది నాణ్యమైన క్రికెట్ ఆడటంతో పాటు ఫిట్‌నెస్ విషయంలో చాలా ముందున్నారు. జట్టు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇలాగే కొనసాగితే గొప్ప క్రికెటర్లుగా కావడం పెద్ద కష్టమేం కాదు' అని కపిల్ దేవ్ చెప్పుకొచ్చాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీలను పోల్చలేమని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డాడు. ఫిట్‌నెస్ పరంగా కోహ్లీ అంత బలంగా లేకపోయినా.. ప్రత్యర్థి బౌలర్లను రోహిత్ అలవోకగా ఆడుతున్నాడని కపిల్ దేవ్ కితాబిచ్చాడు. కోహ్లీ ఫిట్‌నెస్ ఫ్రీక్ : జిమ్‌లో వర్కౌట్లు చేయడానికి చాలా ఇష్టపడుతాడు. వాస్తవానికి, అతని వల్ల సహచర ఆటగాళ్లలోనూ చాలా మార్పు వచ్చింది. రోహిత్ శర్మ మాత్రం జిమ్ అంటే పెద్దగా ఇష్టపడడు. అలాగని ఫిట్‌నెస్ లేదని కాదు. సులువుగా షాట్స్ ఆడగలడు. తాజా టీ20 ప్రపంచకప్‌లో కోహ్లీ విఫలమైనా.. రోహిత్ అద్భుతంగా రాణించాడు. కోహ్లీ 150, 200 కేజీల బరువులు సులువుగా ఎత్తగలడు. అలాగని రోహిత్ శర్మ కూడా ఎత్తాలని లేదు. ఎవరి ఫిట్‌నెస్, ఎవరి ఆట వారిది.

## రీల్



### మైథలాజికల్ అండ్ ఫ్యూచర్ విజువల్ వండర్!

# 'కల్కి 2898 ఏడీ'



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'కల్కి 2898 ఏడీ'. భారతీయ సినీ పరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ చిత్రం ఈ రోజు భారీ అంచనాల మధ్య భారీ స్థాయిలో రిలీజ్ అయింది.

**కథ :** భవిష్యత్‌లో ప్రపంచమంతా వనరులను కోల్పోయిన నిర్జీవమైన దశలో కాశీ పట్టణం ఒక్కటి మాత్రమే ఉంటుంది. అక్కడ సుప్రీం యాస్కిన్ (కమల్హాసన్) కాంప్లెక్స్ అనే వండర్ ఫుల్ లోకాన్ని క్రియేట్ చేసుకుని ఆ ప్రాంతాన్ని లీడ్ చేస్తాడు. కాంప్లెక్స్ కింద భూమి మీద ప్రజలు కష్ట పడుతూ బాధలతో బతుకుతూ ఉంటారు. దీంతో అక్కడే ఉండే భైరవ (ప్రభాస్)కి కాంప్లెక్స్ లోకి వెళ్లి బతకాలని బలమైన కోరిక ఉంటుంది. దాని కోసం భైరవ రకరకాల ప్రయత్నాలు చేస్తుంటాడు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో మళ్లీ 6000 వేల సంవత్సరాల తర్వాత కల్కి (దేవుడు) రాబోతున్నాడని సుప్రీం యాస్కిన్ మనుషులకు అర్థం అవుతుంది. దీంతో సుమతి (దీపికా పదుకొనే) కడుపులోని దేవుడ్ని కాపాడటానికి అశ్వత్థామ (అమితాబ్ బచ్చన్) వస్తాడు. దానికి భైరవ అడ్డు పడుతూ ఉంటాడు. మరి ఈ క్రమంలో జరిగిన సంఘటనలు ఏమిటి ?, అసలు భైరవ ఎవరు ?, ఇంతకీ, సుప్రీం యాస్కిన్ మోటివ్ ఏమిటి ?, చివరకి సుమతిని అశ్వత్థామ సేవ్ చేశాడా? లేదా ? అనేది మిగిలిన కథ.

**ప్లస్ పాయింట్స్ :** ఈ చిత్రం పురాణాలను భవిష్యత్తు కలుపుతూ అత్యంత భారీ బడ్జెట్తో రూపొందించబడటం, అలాగే ప్రభాస్, అమితాబ్ తో పాటు మిగిలిన అగ్ర నటీనటుల నటన, అద్భుతమైన విజువల్స్, అత్యాధునిక వీఎఫ్ఎక్స్ మరియు భారీ యాక్షన్ ఎపిసోడ్స్ వంటి అంశాలు ఈ సినిమాలో స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచాయి. అశ్వత్థామగా అమితాబ్ బచ్చన్, సుప్రీం యాస్కిన్గా కమల్హాసన్ తమ పాత్రల్లో జీవించారు. దాదాపు 40ఏళ్ల విరామం తర్వాత వీరిద్దరూ కలిసి ఒకే సినిమాలో కనిపించడం ఈ సినిమాకి మరో ప్లస్ పాయింట్. ముఖ్యంగా కమల్ హాసన్ సుప్రీం యాస్కిన్ పాత్ర లుక్ చాలా బాగుంది. అదేవిధంగా 81 సంవత్సరాల వయసులో కూడా అశ్వత్థామ పాత్రలో అమితాబ్ తన యాక్షన్ తో అదరగొట్టారు. ఇక భైరవ పాత్రలోని షేడ్స్ ను ప్రభాస్ చాలా బాగా పలికించాడు. ప్రభాస్ అమితాబ్ మధ్య సాగే యాక్షన్ సీక్వెన్స్ కూడా చాలా బాగున్నాయి. తన పాత్రకు ప్రభాస్ ప్రాణం పోశారు. మొత్తానికి ప్రభాస్ తన లుక్స్ అండ్ యాక్షన్ తో ఈ సినిమాకి హైలైట్ గా నిలిచాడు. దీపికా పదుకొనేకి చాలా మంచి పాత్ర దొరికింది. ఆమె భగవంతుడ్ని కనే అమ్మగా అలరించింది. నటి శోభన తన పాత్రలో మెరిశారు. మరో కీలక పాత్రలో రాజేంద్ర ప్రసాద్ కూడా చాలా బాగా నటించాడు. అలాగే, దిశా పటానీ, పశుపతి, అన్నా బెన్ లతో పాటు మిగిలిన నటీనటులు కూడా తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. ఈ 'కల్కి' కథ మూడు ప్రపంచాల మధ్య సాగుతుంది. పైగా భవిష్యత్ లో ప్రపంచమంతా వనరులను కోల్పోయిన నిర్జీవమైన దశలో కాశీ పట్టణాన్ని చూపించిన విధానం కూడా చాలా ఆలోచనాత్మకంగా ఉంది. అదే విధంగా సర్వమత శరణార్థులు ఉండే ప్రాంతంగా శంబాలను చూపించిన విధానం కూడా చాలా బాగుంది. ఇక అన్ని వనరులు కలిగి ఆకాశంలో కిలోమీటర మేర ఉండేలా కాంప్లెక్కు్ను వండర్ ఫుల్ గా డిజైన్ చేశారు. మొత్తానికి గుడ్ క్లైమాక్స్ తో పాటు ప్రతి నేపథ్యాన్ని, ప్రతి పాత్రను దర్శకుడు నాగ్ అశ్విన్ చాలా బాగా తీర్చిదిద్దారు.

**సాంకేతిక విభాగం :** టెక్నికల్‌గా చూసుకుంటే సినిమాలో సాంకేతిక విభాగం వర్క్ చాలా బాగుంది. సంతోష్ నారాయణన్ సంగీతం సినిమాకు ప్లస్ అయ్యింది. అదే విధంగా జోర్జే స్టోజిల్జ్కోవిచ్ సినిమాటోగ్రఫీ సినిమాకే హైలెట్ గా నిలుస్తోంది. కొన్ని కీలక సన్నివేశాల్లో కెమెరామెన్ పనితనం చాలా బాగుంది. ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ బాగుంది. సినిమాలోని నిర్మాత అశ్వనీ దత్ పాటించిన ప్రొడక్షన్ వాల్యూస్ అద్భుతంగా ఉన్నాయి దర్శకుడు నాగ్ అశ్విన్ తన రచనతోనూ దర్శకత్వంతోనూ ఆకట్టుకున్నారు.

**తీర్పు :** పురాణాలను భవిష్యత్తు కలుపుతూ హై వోల్టేజ్ యాక్షన్ అండ్ ఎమోషనల్ ఎంటర్ టైనర్ గా వచ్చిన ఈ చిత్రం యూనిక్ స్టోరీ థీమ్ తో, బిగ్గెస్ట్ స్టార్ కాస్ట్ తో చాలా బాగా ఆకట్టుకుంది. ప్రభాస్ ఫ్యాన్స్ తో పాటు సాధారణ ప్రేక్షకులకు కూడా ఈ సినిమా ఫుల్ కిక్ ను ఇస్తోంది. గ్రాండ్ యాక్షన్ విజువల్స్ తో పాటు ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్, మరియు అమితాబ్ యాక్షన్, కమల్ డిఫెరెంట్ లుక్, మరియు కథలోని యాక్షన్ అండ్ ఎమోషన్స కూడా చాలా బాగున్నాయి. కాకపోతే, కొన్ని యాక్షన్ సన్నివేశాలు రెగ్యులర్ గా అనిపిస్తాయి. కానీ, ఓవరాల్ గా ఈ సినిమా ఆడియన్స్ ను బాగా ఆకట్టుకుంది. డౌట్ లేకుండా ప్రభాస్ ఫ్యాన్స్ కి ఫుల్ పూనకాలను ఇస్తోంది.

## బీహార్‌లో కూలిన మరో బ్రిడ్జ్..

### వారం వ్యవధిలో నాలుగో ఘటన..



**కిషన్‌గంజ్ :** బీహార్ రాష్ట్రంలో వరుసగా వంతెనలు కూలిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే మూడు బ్రిడ్జిలు కుప్పకూలగా.. తాజాగా మరో వంతెన కూలిపోయింది. కిషన్‌గంజ్ జిల్లాలో కంకై నదికి చెందిన ఉపనదిపై నిర్మించిన 70 మీటర్ల పొడవైన వంతెన కూలిపోయింది. ఈ వంతెన బహదూర్ గంజ్ – దిఘల్‌బ్యాంక్ బ్లాకలను కలుపుతుంది. ప్రస్తుతం ఈ వంతెన కూలిపోవడంతో రెండు పట్టణాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని అధికారులు తెలిపారు. ప్రస్తుతం కంకై నదిలో నీటిమట్టం పెరిగినట్లు పేర్కొన్నారు. నీటి ప్రవాహం ఉద్ధృతి కారణంగా వంతెన మధ్యలో ఉన్న పలు స్తంభాలు సుమారు ఒకటిన్నర అడుగుల మేర మునిగిపోయాయని వివరించారు. కాగా, వారం వ్యవధిలోనే బీహార్ రాష్ట్రంలో వంతెనలు కూలిపోవడం వరుసగా ఇది నాలుగో ఘటన. అరారియా జిల్లాలోని పరారియా గ్రామంలో గత మంగళవారం నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత శనివారం ఉదయం సివాన్ జిల్లాలో చిన్నపాటి వంతెన ఒకటి కుప్పకూలింది. దారౌండా, మహారాజా గంజ్ బ్లాక్స్‌లోని రెండు గ్రామాలను కలుపుతూ కెనాల్‌పై కట్టిన ఈ బ్రిడ్జ్.. చాలా ఏండ్ల క్రితం నాటిదని, కెనాల్‌లోని నీటి ప్రవాహ ధాటికి పిల్లర్లు దెబ్బతిని వంతెన కూలిందని జిల్లా కలెక్టర్ ముకుల్ కుమార్ గుప్తా తెలిపారు. ఆ తర్వాతి రోజు అంటే ఆదివారం తూర్పు చంపారన్‌లో నిర్మాణంలో ఉన్న 16 మీటర్ల వంతెన కుప్పకూలింది. మోతిహారి బ్లాక్‌లో ఘోరసహాన్‌లో జరిగిన ఈ ఘటనలో ఎలాంటి ముప్పు వాటిల్లలేదని జిల్లా అధికారులు వెల్లడించారు. వరుసగా వంతెనలు కూలిపోతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదులు, కాలువలపై నిర్మించిన వంతెనల పటిష్టతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పబ్లిక్ వరక్స్‌లో నాణ్యతా లోపాలు, అక్రమాల వల్లే ఈ ఘటనలు జరుగుతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. వరుస ప్రమాదాలతో అధికారులు కూడా ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ప్రమాదవశాత్తు కూలిపోయాయా..? లేక ఎవరైనా కావాలనే కూల్చి వేస్తున్నారా..? అనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు.

## లోటస్ పాండ్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలకు ఉపక్రమించిన ఈవిడిఎం

### అక్రమణాల ప్రాంతాలను పరిశీలించిన.. ఈవిడిఎం కమిషనర్ రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ లోటస్ పాండ్‌లోని బఫర్ జోన్‌లో నిర్మాణాలపై జిహెచ్‌ఎంసి ఈవిడిఎం ( ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్) కమిషనర్ ఎ.వి. రంగనాథ్ చర్యలు చేపట్టారు. గురువారం లోటస్ పాండ్ పరిసర ప్రాంతాల్లోని నిర్మాణాలను ఆయన పరిశీలించారు. చెరువుల అక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవంటూ భవన నిర్మాణ దారులను ఆయన హెచ్చరించారు. అయితే లోటస్ పాండ్ రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగించి నిర్మాణ పనులు చేపట్టడంపై ఆయన చర్యలకు ఆదేశించారు. అందుకు సంబంధించి పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. చట్టానికి వ్యతిరేకంగా పని చేసే ఉద్యోగులపై కొరడా ఝుళిపిస్తామని ఈ సందర్భంగా రంగనాథ్ హెచ్చరించారు. ఈవిడిఎం కమిషనర్‌గా ఎ.వి.రంగనాథ్ బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజు నుంచే జిహెచ్‌ఎంసి పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఆయన చర్యలకు ఉపక్రమించారు. అక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో అక్రమణదారులపై ఈవిడిఎం అసిస్టెంట్ ఇంజనీర్ ఫిర్యాదు చేశారు.

# ఏ ప్రభుత్వం నుండి కూడా రాజకీయ ఒత్తిడిని ఎదుర్కోనలేదు



**న్యూఢిల్లీ :** న్యాయమూర్తిగా పని చేస్తున్న 24 సంవత్సరాలలో తాను ఏ ప్రభుత్వం నుండి కూడా రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొనలేదని సుప్రీం కోర్టు ఛీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనియన్ గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ గడిచిన 24 సంవత్సరాలుగా తాను న్యాయమూర్తిగా పని చేస్తున్నానని, తాను ఎన్నడూ ప్రభుత్వాల నుండి రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొనలేదని చెప్పారు. ప్రభుత్వాల రాజకీయ గుప్పిళ్ళకు దూరంగా తమ జీవితాలను గడపడం భారతదేశంలో ప్రజాస్వామిక సంప్రదాయాలలో ఒకటి అని పేర్కొన్నారు. విస్తృత భావంలో న్యాయమూర్తులపై రాజకీయ ఒత్తిడి అంటే రాజ్యాంగపరమైన కేసుల విషయంలో తమ నిర్ణయాల ఫలితంగా కలిగే రాజకీయ ప్రకంపనలు గుర్తించి, జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అయితే, అది రాజకీయ ఒత్తిడిగా చూడరాదని తాను భావిస్తున్నట్లు చంద్రచూడ్ తెలిపారు. సామాజిక ఒత్తిళ్ళ గురించి ప్రస్తావిస్తూ న్యాయమూర్తులు తమ తీర్పులతో కలిగే సామాజిక ప్రభావం గురించి తరచూ ఆలోచిస్తుంటారని అన్నారు. తాము నిర్ణయించే అనేక కేసులు తీవ్రమైన సామాజిక ప్రభావం కలిగించేవి ఉంటాయని, అందుకే సామాజిక వ్యవస్థపై కలిగే ప్రభావం గురించి ఆలోచించడం తమ విధి అని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచంలోనే భారత దేశంలో న్యాయమూర్తులు, జనాభా నిష్పత్తి భారతదేశంలో అతి తక్కువ అని అన్నారు. మనకు ఎక్కువ మంది న్యాయమూర్తులు కావాలని, న్యాయవ్యవస్థ బలం పెంచేందుకు తాము ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామన్నారు.

**సామాజిక మాధ్యమాలను ఆపలేకపో–తున్నాం :** న్యాయమూర్తులు అనే ప్రతీ మాట వెంటనే సోషల్ మీడియాలోకి వెళ్ళిపోతుందని, దీనిని ఆపాల్సి ఉన్నప్పటికీ, ఆపలేకపోతున్నామని చంద్రచూడ్ అన్నారు. కొన్ని సార్లు తాము ఇబ్బందులు పడుతున్నామని, కొన్ని సార్లు విమర్శలు న్యాయంగానే ఉంటాయని, కొన్ని సార్లు ఉండవని చెప్పారు. అయితే, న్యాయమూర్తులుగా తాము పని చేస్తున్న ప్రజల నుండి వచ్చే విమర్శలను అంగీకరించేందుకు తమ భుజాలు విశాలంగా ఉంటాయన్నారు.

## రాజ్యసభ సభ్యులుగా 6మంది ఎంపిలు ప్రమాణం

**న్యూఢిల్లీ :** రాజ్యసభ సభ్యులుగా శుక్రవారం కొంత మంది ప్రమాణస్వీకారం చేశారు. బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆరుగురు సభ్యులు ప్రమాణం చేయగా రాజ్యసభ చైర్మన్ జగదీశ్ ధన్‌ఖర్ వారికి స్వాగతం పలికారు. మొదటగా బీహార్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపి అఖిలేశ్ ప్రసాద్ సింగ్, ఆ తరువాత జెఎంఎం సభ్యుడు సర్ఫరాజ్ ఆహ్మద్, బిజెపి సభ్యుడు ప్రదీప్ కుమార్ వర్మ (వీరిద్దరూ జార్ఖండ్‌కు చెందిన వారే), బిజెపి నేతలు బన్సిలాల్ గుర్జార్, మాయ నిరోలియా, బాలయోగి ఉమేష్‌నాథ్ (ఈ ముగ్గురు మధ్యప్రదేశ్‌కు చెందిన వారే) రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం చేశారు. బిజెపి సభ్యులు, కాంగ్రెస్ ఎంపి హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యుల ప్రమాణ స్వీకార సమయంలో సభలో ప్రధాని నరేంద్ర మోదీ, సభాపక్ష నేత జెపి నడ్డా, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేలు ఉన్నారు.

## మార్కుల గణనపై ఎన్‌టీఏకు సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ :** నీట్‌యుజి 2024లో అవకతవకలపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)కు గురువారం నోటీసులు జారీ చేసింది. జులై 8వ తేదీలోగా దీనికి తగిన సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. నీట్‌యుజి 2024పై వచ్చిన మిగిలిన పిటిషన్లతో కలిపి అదేరోజు విచారణ చేపడతామని పేర్కొంది. నీట్‌యుజి 2024 మార్కుల గణనలో ఇష్టారీతిన వ్యవహరించారంటూ పిటిషన్‌ను ఓ లెర్నింగ్ యాప్ దాఖలు చేసింది. మెడికల్ పరీక్షకు హాజరైన చాలామంది ఒఎంఆర్ షీట్లను పొందలేదని పేర్కొంది. దీనిపై గురువారం జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టీ బెంచ్ నేడు వాదనలను వినింది. 'ఒఎంఆర్ షీట్లు ఇవ్వడానికి ఏమైనా టైమ్‌లైన్‌ను మీరు పెట్టుకొన్నారేమో తెలియజేయండి. దీనిపై ఎన్‌టిఎను స్పందించనీయండి' అని బెంచ్ పేర్కొంది. సంబంధిత పార్టీలు ఈ అంశంపై జులై 8వ తేదీ లోగా వివరణలు పంపాలని ఆదేశించింది. అదే సమయంలో కోచింగ్ సెంటర్లు పిటిషన్లు దాఖలు చేయడాన్ని కూడా న్యాయస్థానం ప్రశ్నించింది. 'ఇది కోచింగ్ సెంటర్ల వైపు నుంచి వచ్చిన 32వ పిటిషన్. ఇందులో మీ ప్రాథమిక హక్కులకు ఏం ఉల్లంఘన జరిగింది..? ఈ అంశంలో వారు పోషించడానికి ఏ పాత్ర కనిపించడం లేదు. చెప్పిన సేవలు అందించడంతోనే వారి పాత్ర ముగుస్తుంది. కేంద్రం చేయాల్సిన పనులను వారు చూడాల్సిన అవసరం లేదు' అని పేర్కొంది.

**నీట్ పేపర్ లీక్ కేసులో అరెస్టులు మొదలుపెట్టిన సిబిఐ**

పరీక్ష పేపర్ లీక్ కేసు దర్యాప్తును సిబిఐ వేగవంతం చేసింది. దీనికి సంబంధించి అరెస్టులు మొదలుపెట్టింది. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న మనీశ్ ప్రకాశ్, అశుతోష్‌ను బీహార్‌లోని పాట్నాలో అదుపులోకి తీసుకొంది. ఈ కేసులో లీకైన పేపర్‌ను పొందిన విద్యార్థులను మనీశ్ తన కారులోనే తరలించినట్లు గుర్తించారు. వీరిలో రెండు డజన్ల మందికి అతడే ఒక రూమ్ కూడా బుక్ చేసినట్లు తెలుస్తోంది. ఇక రెండో నిందితుడైన అశుతోష్ పేపర్ లీక్‌లో భాగస్వాములైన విద్యార్థులకు తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించాడు. ఇప్పటికే పేపర్ లీక్‌కు సంబంధించి సిబిఐ క్రిమినల్ కేసు నమోదు చేసింది. దీంతోపాటు బీహార్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలు నమోదుచేసిన అభియోగాలను కూడా తమకు బదలాయించాలని నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే గుజరాత్‌లోని గోద్రా తాలుకా పోలీస్‌స్టేషన్‌లో మాల్ ప్రాక్టీస్‌పై ఓ ఎఫ్ఐఆర్ నమోదైంది. సిబిఐ మొత్తం ఈ వ్యవహారంలో ఆరు కేసులను దర్యాప్తు చేస్తోంది. నీట్‌యూజీ 2024 పరీక్షను దేశవ్యాప్తంగా మే 5వ తేదీన నిర్వహించింది. దీనికి 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పేపర్ బిహార్, గుజరాత్ రాష్ట్రాల్లో లీకైనట్లు ఇటీవల కాలంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ మధ్యలోనే జూన్ 4న ఎన్‌టీఏ ఫలితాలు ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. దీంతో కేంద్రం కూడా ఈ వ్యవహారంపై దృష్టి సారించింది.

## ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించడంపై అసంతృప్తి: రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ :** స్పీకర్ సభలో చేసిన ప్రసంగంలో ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇది స్పష్టంగా రాజకీయ పరమైనదని, దానిని నివారించాల్సిందని అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా లోక్‌సభ స్పీకర్ ప్రకటించిన నేపథ్యంలో రాహుల్‌గాంధీ సహా ఇండియా కూటమి నాయకులు గురువారం నాడు పార్లమెంటులోని స్పీకర్ ఛాంబర్‌లో ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ మీడియాతో మాట్లాడుతూ స్పీకర్‌ను కలిసిన సందర్భంలో ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించిన విషయాన్ని ఆయనతో రాహుల్ గాంధీ ప్రస్తావించినట్లు వెల్లడించారు. పార్లమెంటు పనితీరు గురించి మాట్లాడిన సమయంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చిందన్నారు. ప్రతిపక్ష నేతగా రాహుల్‌గాంధీ ఈ అంశాన్ని ప్రస్తావించారని, ఎమర్జెన్సీ గురించి మాట్లాడడం పూర్తిగా రాజకీయ అంశమని, దానిని నివారించి ఉండాల్సిందని స్పీకర్‌తో చెప్పినట్లు తెలిపారు. స్పీకర్‌గా బాధ్యత స్వీకరించిన వెంటనే ఎమర్జెన్సీపై తీర్మానాన్ని ప్రవేశపెట్టడం పట్ల కాంగ్రెస్ అసంతృప్తి వ్యక్తం చేయడాన్ని స్పీకర్ ఓం బిర్లాకు వేణుగోపాల్ లేఖ కూడా రాశారు.

### లోక్‌సభ నేటికి వాయిదా

**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించారు. ప్రసంగం అనంతరం ఆ ప్రతులను, కొన్ని బిల్లులను సభ ముందు ఉంచిన తరువాత లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. అంతకు ముందు కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ 18వ లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణం చేశారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని ఇంగ్లీష్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. 'జై హింద్, జై సంవిధాన్' అని ముగించారు. కాగా, ఇద్దరు స్వతంత్రులు సహా ఇంకా ఐదుగురు సభ్యులు ప్రమాణం చేయాల్సి ఉంది.

## ఎన్‌టిఎ ఆఫీస్‌లోకి చొచ్చుకెళ్లిన విద్యార్థులు

### నీట్ నిర్వాకంపై యూత్ కాంగ్రెస్ నిరసన

**న్యూఢిల్లీ :** యూజిసినెట్, నీట్ పిజి వంటి పరీక్షల్లో ప్రశ్నపత్రం లీకేజీ, ఇతర అక్రమాలు చోటు చేసుకోవడంతో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ ప్రవేశ పరీక్షలు నిర్వహించిన జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)పై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా పలు విద్యార్థి సంఘాల నాయకులు దేశ రాజధాని ఢిల్లీ లో ఆందోళన సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే యూత్ కాం గ్రెస్ కార్యకర్తలు గురువారం ఢిల్లీలో నిరసనలు చేపట్టారు. వి విధ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు కొనసాగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. నీట్‌యుజి ఎగ్జామ్ చు ట్టూ ముసురుకున్న వివాదాలకు నిరసరగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో పెద్దసంఖ్యలో కార్యకర్త లు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్ల కార్డులు ప్రదర్శించారు. పేపర్ లీక్‌లు, అక్రమాల ఆరోపణలతో విద్యార్థులు, తల్లితండ్రులు తీవ్రంగా కలత చెందుతున్నారని యూత్ కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలు, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని నేతలు డిమాండ్ చేశారు. కాగా, కొందరు ఎన్‌టిఎ ఆఫీసులోకి దూసుకెళ్లడం గమనార్హం. నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ఎన్‌ఎస్‌యుఐ సంఘానికి చెందిన దాదాపు 100 మంది ఆందోళనకారులు గురువారం సాయంత్రం ఎన్‌టిఎ ఆఫీసు భవనంలోకి దూసుకెళ్లారు. అనంతరం వారు లోపలి నుంచి లాక్ చేసుకున్నట్లు సమాచారం. దీంతో ఎన్‌టిఎ ఆఫీసు వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.